సూర్య
www.suryaa.com
19 వ వసంతంలోకి ...

నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

విద్యార్థులకు దిశా నిర్దేశం..నిరుద్యోగులకు మార్గనిర్దేశకం...
APPSC,TSPSC పోటీపరీక్షల గైడెన్స్
నిపుణులైన అధ్యాపకులతో నాణ్యమైన మెటీరియల్
కరెంట్ అఫైర్స్
నమూనా ప్రశ్నాపత్రాలు
విద్యా ఉద్యోగ సమాచారం
'సూర్య' ఆన్‌లైన్‌ఎడిషన్ www.suryaepaper.com చూడండి.

visit us @ http://suryaepaper.com
శనివారం | 17 జనవరి 2026 | హైదరాబాద్
సంపుటి 19 | సంచిక 87
| పేజీలు 8+8 | వెల: రూ. 6.50
Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi

అనుగ్రహం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం : దక్షిణాయణం - హేమంతరుతువు, పుష్య మాసం బహుళ పక్షం చతుర్దశి రా.11.57, మూల ఉ.8.38, వర్జ్యం తె.6.52 నుంచి 8.38 వరకు తిరిగి రా.7.03 నుంచి 8.47 వరకు
రాహుకాలం ఉ.9.00 నుంచి 10.30 వరకు దుర్ముహూర్తం ఉ.6.35 నుంచి 8.03 వరకు

## లాభాల్లో స్టాక్ మార్కెట్‌లు



- 187 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్, 28 పాయింట్ల లాభంతో నిఫ్టీ
- మెరుగైన ఫలితాలతో దూసుకెళ్లిన ఐటీ రంగ షేర్లు
- కొనుగోళ్ల మద్దతుతో రాణించిన బ్యాంకింగ్ కౌంటర్లు

5 లో

## ఆర్టికల్ 32 దుర్వినియోగమవుతోంది



- ఆర్టికల్ 32 కింద దాఖలు అయిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు
- ఒక్క వాయిదా పడినా వచ్చేస్తున్నారు
- హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న వాటిపై మళ్లీ మాదగ్గరకెందుకు
- సుప్రీంకోర్టు ఆగ్రహం

6 లో

## 20వ తేదీన బీజేపీ జాతీయ అధ్యక్షుడి ఎన్నిక



- నితిన్ నబీన్ ఎన్నిక లాంఛనమే!

నూతన జాతీయ అధ్యక్షుడిని భారతీయ జనతా పార్టీ ఈనెల 20న ప్రకటించనుంది. ఈ మేరకు పార్టీ నూతన అధ్యక్షుడి ఎన్నిక షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఈ పదవి కోసం ఈ నెల 19న నామినేషన్లు స్వీకరిస్తామని తెలిపింది.

6 లో

## స్టార్టప్ ఇండియా
# విప్లవంగా మారింది

- కంఫర్ట్ జోన్‌లో జీవించే ఆలోచన భారతీయ యువతకు లేదు
- రాబోయే పదేళ్లలో స్టార్టప్స్, టెక్‌లో అగ్రగామిగా భారత్
- భారతీయ స్టార్టప్‌ల వైవిధ్యంపై నాకు విశ్వాసముంది
- రిస్క్ తీసుకొని వ్యాపారం పెట్టడం ఇప్పుడొక ఫ్యాషన్
- 'నేషనల్ స్టార్టప్ డే' కార్యక్రమంలో ప్రధాని మోదీ వ్యాఖ్యలు

రాబోయే పదేళ్లలో స్టార్టప్స్, టెక్ విభాగాల్లో ప్రపంచ అగ్రగామిగా భారత్‌ను నిలపడమే లక్ష్యమని ప్రధాని మోదీ వెల్లడించారు. ఈ లక్ష్యం దిశగా భారతీయ స్టార్టప్‌లు వైవిధ్యంతో, సాహసోపేతంగా పురోగమిస్తాయనే పూర్తి విశ్వాసం తనకు ఉందన్నారు. ప్రస్తుత తరుణంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీపై భవిష్యత్ వ్యూహాన్ని కలిగిన దేశాలకే ఎక్కువ ప్రయోజనాలు లభిస్తాయని ఆయన పేర్కొన్నారు.



6 లో

## మా ప్రభుత్వంపై
## బీజేపీ కుట్రలు



6 లో

- ప్రత్యేక సవరణ ప్రక్రియతో ఓట్ల తొలగింపు
- వలస కూలీల కుటుంబాలకు అండగా ఉంటాం
- పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ

పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ భారత ఎన్నికల సంఘం పనితీరుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు, రాష్ట్రంలో ప్రస్తుతం కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో మైనారిటీలు , వెనుకబడిన వర్గాలను లక్ష్యంగా చేసుకుని వివక్ష చూపుతున్నారని ఆమె సంచలన ఆరోపణలు చేశారు.

## ఏపీ ఫస్ట్ పేరుతో
# అతిపెద్ద రీసెర్చ్ కేంద్రం

- తిరుపతిలో ఏర్పాటుకు నిర్ణయం
- సీఎం చంద్రబాబు గ్రీన్ సిగ్నల్
- ఏరో స్పేస్-డిఫెన్స్, ఐటీ-డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సలహాదారులతో సీఎం సమావేశం
- యువత భవిష్యత్తుకు బాటలు వేసేలా పరిశోధనలు చేయాలన్న సీఎం
- యువతకు రాష్ట్రానికి మేలు జరిగేలా చూడాలని సీఎం పిలుపు

యువతరం భవిష్యత్తును తీర్చిదిద్దేలా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని... ఆ దిశగా వారికి అన్ని విధాలా సహకరించేలా రాష్ట్ర ప్రభుత్వం సంసిద్ధం కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఈ మేరకు భవిష్యత్తులో ఏయే రంగాల్లో అవకాశాలు ఉంటాయో గుర్తించడంతో పాటు...ఆయా రంగాల్లో వారిలో నైపుణ్యాన్ని పెంచడంపై ఇప్పటి నుంచే దృష్టి పెట్టాలని సీఎం చంద్రబాబు సూచించారు. క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ఏరో స్పేస్-డిఫెన్స్, ఐటీ-డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సలహాదారులతో సీఎం సమావేశమయ్యారు. ఈ భేటీలో డ్రోన్ కార్పొరేషన్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



2 లో

సూర్య వెబ్‌సైట్
సూర్య ఈ - పేపర్

## భక్తుల విశ్వాసాలకు అనుగుణంగా
# ఆలయాల అభివృద్ధి


- సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ, పర్యవేక్షణతో నిధులు
- వేములవాడలో రాజన్న ఆలయ విస్తరణ, మేడారంలో సమ్మక్క సారలమ్మ గద్దెల పునర్నిర్మాణం
- మంత్రి సీతక్క

భక్తుల విశ్వాసాలకు అనుగు ణంగా రాష్ట్రంలో ఆలయాల అభివృద్ధి, విస్తరణ పనులను సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం చేయిస్తుందని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, గ్రామీణ నీటి పారుదల, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు.



2 లో

## సుప్రీంలో పార్టీ ఫిరాయింపుల వ్యవహారంపై విచారణ



2 లో

- స్పీకర్‌కు నాలుగు వారాలు గడువు
- ఎమ్మెల్యేల ఫిరాయింపు ఆరోపణలపై స్పీకర్ తీసుకున్న చర్యలపై సుప్రీంకోర్టుకు నివేదిక
- సుప్రీంకోర్టు ఆదేశాల అమలులో స్పీకర్ విఫలమయ్యారన్న బీఆర్ఎస్ లాయర్

## ఆదిలాబాద్ జిల్లాకు
# సీఎం రేవంత్ వరాల జల్లు

- రూ.386 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- సబ్బండ వర్గాల అభివృద్ధియే ప్రజాప్రభుత్వం ప్రధాన ధ్యేయం
- బాసరలో విశ్వ విద్యాలయం ఏర్పాటుకు చర్యలు
- సదర్మాట్ బ్యారేజికి పి. నర్సారెడ్డి పేరు పెడతాం
- ప్రధాని మోడీని కలవడానికి ఆలోచించను..
- ఆదిలాబాద్ జిల్లా పర్యటనలో సీఎం రేవంత్ కీలక వ్యాఖ్యలు



3 లో

ఆదిలాబాద్ జిల్లాపై సీఎం రేవంత్‌రెడ్డి వరాల జల్లు కురిపించారు. రూ.386 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడంతో పాటు, సదర్మట్ బ్యారేజ్‌ను జాతికి అంకితం చేశారు. జిల్లాకు ప్రత్యేక యూనివర్సిటీ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. కేసీఆర్ హయాంలోని పెండింగ్ ప్రాజెక్టులను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేసిందని సీఎం స్పష్టం చేశారు. ఆదిలాబాద్ జిల్లా అంటే తనకు ప్రత్యేకమైన అభిమానం ఉందని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌అబశ్రీశ్రీరెడ్డి వ్యాఖ్యానించారు. అత్యంత వెనుకబడిన ఈ జిల్లాకు ఆశించిన న్యాయం జరగలేదని పేర్కొన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో శక్రవారం సీఎం పర్యటించిన ఆయన.. రూ.386.46 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. హాతిఘాట్‌లో చనాకా - కొరాట బ్యారేజ్ పంప్‌హౌస్ ప్రారంభించారు. సదర్మట్ బ్యారేజ్‌ను జాతికి అంకితం చేశారు. యాసంగి పంటకు నీరు విడుదల చేశారు.

## అంతా ఇంతే!





సోనియా గాంధీ పర్మిషన్ తీసుకుని వస్తారేమో సార్!

## గ్రీన్ అమోనియా ఉత్పత్తిలో
# కొత్త చరిత్ర

- ఏపీలో అతిపెద్ద గ్రీన్ అమోనియా ప్రాజెక్టు
- రూ.13 వేల కోట్లతో ఏఎమ్ గ్రీన్ అమోనియా ప్లాంట్‌కు రేపు శంకుస్థాపన చేయనున్న సీఎం చంద్రబాబు
- కాకినాడలో 495 ఎకరాల్లో ఏర్పాటు..2,600 మందికి ఉద్యోగాలు
- ఏడాదికి 1 మిలియన్ మెట్రిక్ టన్‌ల గ్రీన్ అమోనియా ఉత్పత్తి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం క్లీన్ ఎనర్జీ రంగంలో సరికొత్త చరిత్రను సృష్టించబోతోంది. గ్రీన్ హైడ్రోజన్ ఆధారిత గ్రీన్ అమోనియా పరిశ్రమ ఏర్పాటుతో దేశంలోనే అతిపెద్ద పర్యా వరణహిత పరిశ్రమలలో ఒకటిగా నిలిచి చారిత్రాత్మక అడుగు వేయ నుంది. గత ఏడాది గ్రీన్‌కో గ్రూప్‌కు చెందిన ఏఎమ్ గ్రీన్ సంస్థకు ఏడాదికి 1 మిలియన్ మెట్రిక్ టన్నుల గ్రీన్ అమోనియా ఉత్పత్తి చేసే ప్లాంట్ ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది.



2 లో

## ఏపీలో మరో
# రూ.90 వేల కోట్ల పెట్టుబడులు

- మంత్రి నారా లోకేశ్ ప్రకటన
- కాకినాడలో ఏఎం గ్రీన్ భారీ ప్రాజెక్ట్
- 10 బిలియన్ డాలర్ల పెట్టుబడితో గ్రీన్ అమ్మోనియా టెర్మినల్
- 8,000కు పైగా ఉద్యోగ అవకాశాలు
- జర్మనీ, సింగపూర్, జపాన్‌లకు గ్రీన్ ఎనర్జీ ఎగుమతి
- ప్రపంచ గ్రీన్ ఎనర్జీ రంగంలో ఏపీకి కీలక స్థానం
- అంధ రచయిత్రి రాసిన నవలను ఆవిష్కరించిన మంత్రి లోకేష్
- వైకల్యాన్ని జయించి స్ఫూర్తిగా నిలిచిన చింతక్రింది సాయిజ్యోతికి మంత్రి అభినందన

గ్రీన్ ఎనర్జీలో ఆంధ్రప్రదేశ్.. సౌదీ అరేబియాగా అవతరిస్తుందని మంత్రి నారా లోకేష్ తాజాగా ప్రకటించారు. ఈ మేరకు కాకినాడలో గ్రీన్ ఎనర్జీ రంగంలో 10 బిలియన్ డాలర్ల పెట్టుబడులు రానున్నట్లు తెలిపారు. ఇక్కడి నుంచి జర్మనీ, సింగపూర్, జపాన్‌కు హరిత ఇంధనం ఎగుమతి అవుతుందని తెలిపారు. ఈ ప్రాజెక్టు వల్ల 8,000 ఉద్యోగాలు రానున్నట్లు వెల్లడించారు. చమురు ఉత్పత్తిలో గల్ఫ్ దేశమైన సౌదీ అరేబియా అగ్రగామిగా ఉన్న విషయం తెలిసిందే. అదే మాదిరిగా గ్రీన్ ఎనర్జీలో సౌదీ అరేబియాగా ఆంధ్రప్రదేశ్ అవతరిస్తుందని ఏపీ పరిశ్రమల శాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు.



2 లో

## మెట్రో రెండో దశ
# త్వరలో చేపట్టాలి

- త్వరితగతిన పూర్తి చేయాలి
- సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాసిన జి. కిషన్ రెడ్డి

హైదరాబాదులో నిర్మించ తలపెట్టిన మెట్రో రెండోదశ పనులు వెంటనే ప్రారంభించాలి అని కోరుతూ సీఎం రేవంత్ రెడ్డికి కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి కిషన్ రెడ్డి లేఖ రాశారు. తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో ఎదురవుతున్న ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి, రవాణా సౌకర్యాలను మెరుగుపరచడంలో భాగంగా హైదరాబాద్ మెట్రో రెండో దశ చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ అనుమతి కోరిన విషయం తెలిసిందే.



2 లో




# ఏపీ ఫస్ట్ పేరుతో అతిపెద్ద రీసెర్చ్ కేంద్రం

● తిరుపతిలో ఏర్పాటుకు నిర్ణయం ● సీఎం చంద్రబాబు గ్రీన్ సిగ్నల్ ● ఏరో స్పేస్-డిఫెన్స్, ఐటీ-డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సలహదారులతో సీఎం సమావేశం ● యువత భవిష్యత్తుకు బాటలు వేసేలా పరిశోధనలు చేయాలన్న సీఎం ● యువతకు...రాష్ట్రానికి మేలు జరిగేలా చూడాలని సీఎం పిలుపు

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : యువతరం భవిష్యత్తును తీర్చిదిద్దేలా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని... ఆ దిశగా వారికి అన్ని విధాలా సహకరించేలా రాష్ట్ర ప్రభుత్వం సంసిద్ధం కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఈ మేరకు భవిష్యత్తులో ఏయే రంగాల్లో అవకాశాలు ఉంటాయో గుర్తించడంతో పాటు...ఆయా రంగాల్లో వారిలో నైపుణ్యాన్ని పెంచడంపై ఇప్పటి నుంచే దృష్టి పెట్టాలని సీఎం చంద్రబాబు సూచించారు. క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ఏరో స్పేస్-డిఫెన్స్, ఐటీ-డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సలహదారులతో సీఎం సమావేశమయ్యారు. ఈ భేటీలో డ్రోన్ కార్పొరేషన్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలో తిరుపతి కేంద్రంగా అతిపెద్ద రీసెర్చ్ కేంద్రం ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనలను ముఖ్యమంత్రి అంగీకరించారు. ఏపీ ఫ్యూచరిస్టిక్ ఇన్నోవేషన్ అండ్ రీసెర్చ్ ఇన్ సైన్స్ అండ్ టెక్నాలజీ- ఏపీ ఫస్ట్ కు తిరుపతిలో రీసెర్చ్ కేంద్రం ఏర్పాటుకు సీఎం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. వివిధ రంగాల్లో కంపెనీలు కూడా పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తున్నాయి. ఎయిరో స్పేస్, డిఫెన్స్, స్పేస్ టెక్నాలజీ, ఏఐ-సైబర్ సెక్యూర్టీ, సెమీ కండక్టర్ల డివైసెస్-సెన్సార్లు, క్వాంటం టెక్నాలజీ, హెల్త్ కేర్, బయో టెక్నాలజీ, గ్రీన్ ఎనర్జీ, రూరల్ ఏరియా టెక్నాలజీ వంటి రంగాలు భవిష్యత్తులో కీలకం కానున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం కూడా దీనికి అనుగుణంగా పాలసీలు రూపొందిస్తోంది. ఆయా రంగాల్లో పెట్టుబడులు పెట్టే కంపెనీలను ప్రొత్సహిస్తోంది. దేశంలో తొలిసారిగా గ్రీన్ ఎనర్జీ రంగంలో గ్రీన్ అమోనియా ప్లాంట్ కాకినాడలో ఏర్పాటు చేయబోతున్నాం. ఈ తరహాలో కొత్త ఆవిష్కరణలకు...వివిధ స్టార్టప్ కంపెనీలకు రాష్ట్రం వేదికగా నిలవాల్సిన అవసరం ఉంది. ఇలా వచ్చే కంపెనీలకు... పరిశ్రమలకు నైపుణ్యమున్న యవతను అందించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉంది. ఈ మేరకు భవిష్యత్తులో డిమాండ్ ఉన్న రంగాలకు పెద్దపీట వేయడమే కాకుండా...స్టార్టప్ కంపెనీలను ప్రొత్సహించాల్సిన అవసరం ఉంది. వీటికి రాష్ట్ర ప్రభుత్వం వైపు నుంచి ఓ అతి పెద్ద రీసెర్చ్ కేంద్రం అవసరం. తిరుపతిలో ఏర్పాటు చేయబోతున్న ఏపీ-ఫస్ట్ వ్యవస్థ ఆ అవసరాలను తీర్చేలా... రాష్ట్రంలోని యువతకు సహకరించేలా పూర్తి స్థాయిలో పనిచేయాలి. తిరుపతిలోని ఐఐటీ-ఐఐఎస్ఈఆర్ రెండు ప్రముఖ జాతీయ విద్యా సంస్థల కాంబినేషన్లో ఏపీఫస్ట్ ఏర్పాటు కాబోతోంది. దీన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీర్చిదిద్దాలి. ఏపీ ఫస్ట్ వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వంతోనూ సంప్రదింపులు జరపాలి."అని సీఎం చంద్రబాబు చెప్పారు.

**వర్సిటీలు, కంపెనీలు, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌తో అనుసంధానం**

"రాష్ట్ర ప్రభుత్వ ఆలోచన నిరంతరం ఏపీని అభివృద్ధి చేయడంతోపాటు...యువతకు చక్కటి ఉపాధి కల్పించడంపైనే ఉంటుంది. సంక్షేమానికి-అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఏ స్థాయిలో ఆలోచన చేస్తుందో... యువతకు మెరుగైన అవకాశాలు అందించే విషయంలోనూ అదే స్థాయిలో ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. దీంట్లో భాగంగానే ఏపీ ఫస్ట్ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నాం. యూనివర్శిటీలు, వివిధ రంగాల్లో ప్రముఖ స్థానంలో ఉన్న కంపెనీలతో ఏపీ ఫస్ట్ సమన్వయం చేసుకోవాలి. ఇప్పటికే వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ యూనివర్శిటీల్లో విద్యార్థులు కొత్త కొత్త ఆవిష్కరణలు చేస్తున్నారు. వాటిని అందిపుచ్చుకోవాలి. దీంతో యువతలో వివిధ రంగాల్లో నైపుణ్యం పెంచేందుకు పరిశ్రమలు, కంపెనీలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ ఉండాలి. దీంతో పాటు అందుబాటులోకి వస్తోన్న టెక్నాలజీలు ఏంటీ...? ఏయే రంగాల్లో అభివృద్ధి జరుగుతోందనే విషయాలను గుర్తించి.. వాటిని కరిక్యులమ్‌లో చేర్చేలా విద్యా సంస్థలతో సంప్రదింపులు జరపాలి. ఈ మేరకు ఆయా విద్యా సంస్థలకు కరిక్యులమ్ ప్రిపేర్ చేసేలా ఏపీ ఫస్ట్ పని చేయాల్సిన అవసరం ఉంటుంది. ఐటీని ప్రమోట్ చేయడం వల్ల ఇప్పుడు తెలుగువాళ్లు ఐటీలో మేటిగా ఉన్నారు. అలాగే ఫార్మా రంగంలో భవిష్యత్ ఉంటుందని గుర్తించడం వల్లే తెలుగు రాష్ట్రాలు ఫార్మాలో అగ్రభాగాన ఉన్నాయి. ఇదే తరహాలో భవిష్యత్ రంగాలను నేటి యువత అందిపుచ్చుకోవాలి. దానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. యువత భవిత కోసం... స్టార్టప్ కంపెనీలకు మరింత చేయూతనివ్వడం కోసం ఏపీ ఫస్ట్ వ్యవస్థ కృషి చేయాలి. వచ్చే మూడేళ్లల్లో కీలక పురోగతి కనబరిచేలా ఏపీ ఫస్ట్ పని చేయాలి." అని ముఖ్యమంత్రి సూచించారు.



**డ్రోన్లతో సేవలందించవచ్చని నిరూపిద్దాం**

"డ్రోన్ కార్పొరేషన్‌ను మరింత బలోపేతం చేయాలి. ప్రకృతి వైపరీత్యాల సందర్భాల్లో డ్రోన్లను వినియోగించి బాధితులకు సేవలు అందించాం. ఇప్పుడు అంతకు మించిన స్థాయిలో డ్రోన్లను వినియోగించుకుని ప్రజలకు సేవలు అందించేలా చూడాలి. వ్యవసాయం, మెడికల్ ఎమర్జెన్సీ వంటి వాటిల్లో డ్రోన్ల వినియోగం పెరగాల్సిన అవసరం ఉంది. ఇవన్నీ ఫ్యూచర్ టెక్నాలజీలు.. కానీ వీటికి మనం ఇప్పటి నుంచే సంసిద్ధత కావాల్సి ఉంది. వివిధ దేశాల్లో డ్రోన్ల ద్వారా ఎలాంటి సేవలు అందుతున్నాయోననే అంశాన్ని పరిశీలించాలి... అధ్యయనం చేయాలి. టెక్నాలజీ విషయంలో ఎప్పటికప్పుడు అప్డేట్ అవుతూ ఉండాలి. టెక్నాలజీని అందరూ అందిపుచ్చుకున్నాక... మనం అప్పుడు మేల్కొనే కంటే... ముందుగానే టెక్నాలజీని అందిపుచ్చుకునేలా మన వ్యవస్థలను సిద్ధం చేయాలి. డ్రోన్ కార్పొరేషన్ నిపుణులతో కూడిన సలహా బృందాన్ని ఏర్పాటు చేసుకోవాలి. వచ్చే ఇంటర్నేషనల్ డ్రోన్ డే నాటికి డ్రోన్ల ద్వారా సేవలు ఏ విధంగా అందించవచ్చోననే అంశంపై రాష్ట్ర ప్రభుత్వం చేసిన కృషిని ప్రజలకు కళ్లకు కట్టేలా చూపాలి. డ్రోన్ ట్యాక్సీ, డ్రోన్ అంబులెన్స్ వంటి అంశాల్లో లోతుగా అధ్యయనం చేయండి. కేంద్రంతో సంప్రదింపులు జరిపి.. ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ మేనేజ్మెంట్ వ్యవస్థ తరహాలో డ్రోన్ ట్రాఫిక్ కంట్రోల్ మేనేజ్మెంట్ వ్యవస్థను ఏర్పాటు చేయవచ్చేమోననేది పరిశీలించండి."అని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో ఏరో స్పేస్ డిఫెన్స్ సలహదారు సతీష్ రెడ్డి, ఐటీ-డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సలహదారు అమిత్ దుగర్, తిరుపతి ఐఐటీ డైరెక్టర్ కెఎన్ సత్యనారాయణ, ప్రొఫెసర్ సెంథిల్ కుమార్, డీఎంటీఐ డైరెక్టర్ కల్నల్ పీఎస్ రెడ్డి సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## అణుకు గిరిజన గ్రామంలో హెూంమంత్రి అనిత పర్యటన



ఏపీ స్టేట్ క్రైమ్ బ్యూరో, మేజర్ న్యూస్, జనవరి 16: అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం గొట్టివాడ శివారు మారుమూల గిరిజన గ్రామమైన అణుకులో హెూంమంత్రి అనిత పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మంత్రికి సంప్రదాయ పద్ధతుల్లో ఘన స్వాగతం పలికారు.అణుకులోని పరిదేశమ్మ తల్లిని దర్శించుకున్న మంత్రి అనిత, అనంతరం సంక్రాంతి, కనుమ పండుగల సందర్భంగా గిరిజనులతో కలిసి కుటుంబ సమేతంగా వేడుకల్లో పాల్గొన్నారు. గిరిజనులతో ఎంతో ఆత్మీయంగా మమేకమై పండుగ ఆనందాన్ని పంచుకున్నారు."అనితమ్మ మా గుండె", "అనితమ్మ మా గ్రామానికి రావడం మాకు పెద్ద పండుగ" అంటూ అణుకు వాసులు మంత్రిపై తమ ప్రేమాభిమానాలను చూపించారు. గతంలో రోడ్డు సౌకర్యం లేక ఎన్నో ప్రాణాలు కోల్పోయామని పేర్కొంటూ, రూ.2 కోట్ల 50 లక్షల వ్యయంతో రోడ్డు మంజూరు చేయించినందుకు మంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామస్తులతో ముఖాముఖి సమావేశం నిర్వహించిన మంత్రి అనిత, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరినీ పేరు పేరునా పలకరిస్తూ యోగక్షేమాలు తెలుసుకున్నారు. చిన్నారులతో ముచ్చటించి, వారికి పుస్తకాలు పంపిణీ చేయగా, గిరిజనులకు సంక్రాంతి కానుకలు అందజేశారు. మంత్రి స్వయంగా భోజనాలు వడ్డించి, గిరిజనులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి కుమారుడు నిఖిల్, కుమార్తె రేష్మిత శ్రీ కూడా పాల్గొన్నారు. అణుకు యువకులకు క్రికెట్ కిట్లు, స్పోర్ట్స్ టీ షర్ట్స్ ను మంత్రి కుమారుడు నిఖిల్ అందజేశారు. గిరిజనులు పండించిన కూరగాయలు, పంటలను మంత్రికి బహుకరించారు. అణుకు చిన్నారుల డ్యాన్స్ కార్యక్రమాన్ని మంత్రి అభినందించగా, యువకులతో కలిసి వాలీబాల్ ఆడారు. ఈ సందర్భంగా హెూంమంత్రి అనిత మాట్లాడుతూ మీతో కలిసి ప్రశాంతంగా పండుగ చేసుకోవాలనే ఉద్దేశంతో ఇక్కడికి వచ్చానని, మీ అందరితో కలిసి పండుగ జరుపుకోవడం నా పూర్వజన్మ సుకృతమన్నారు. అణుకు గ్రామానికి ఏం కావాలో అన్నీ చేస్తానని చెప్పారు. రోడ్డు మంజూరు ఆర్డర్ కాపీతోనే వచ్చానన్నారు. మీ పిల్లలు చక్కగా చదువుకుని మంచి ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు.

# సుప్రీంకోర్టులో పార్టీ ఫిరాయింపుల వ్యవహారంపై విచారణ

● స్పీకర్కు నాలుగు వారాలు గడువు ● ఎమ్మెల్యేల ఫిరాయింపు ఆరోపణలపై స్పీకర్ తీసుకున్న చర్యలపై సుప్రీంకోర్టుకు నివేదిక ● సుప్రీంకోర్టు ఆదేశాల అమలులో స్పీకర్ విఫలమయ్యారన్న బీఆర్ఎస్ లాయర్ ● మిగతా ఎమ్మెల్యేల విచారణకు స్పీకర్‌కు 4 వారాల గడువిచ్చిన ధర్మాసనం



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : పార్టీ ఫిరాయించారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న మరో ముగ్గురు ఎమ్మెల్యేలపై నిర్ణయం తీసుకునేందుకు సుప్రీంకోర్టు నాలుగు వారాలు గడువు ఇచ్చింది. ఈ నాలుగు వారాల్లో ముగ్గురు ఎమ్మెల్యేల విచారణ పూర్తిచేసి నిర్ణయం వెలువరించాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు సుప్రీంకోర్టు ధర్మాసనం సూచించింది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై స్పీకర్ సత్వరమే నిర్ణయం తీసుకునే విధంగా ఆదేశించాలంటూ దాఖలైన పిటిషన్‌లపై జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ మసీహ్‌లతో కూడిన ధర్మాసనం ఇవాళ మరోసారి విచారణ జరిపింది. ఈ విచారణలో సుప్రీంకోర్టుకు హామీ ఇచ్చి, కోర్టు ఇచ్చిన ఆదేశాలను అమలు చేయడంలో స్పీకర్ పూర్తిగా విఫలమయ్యారని పిటిషనర్లు పాడి కౌశిక్ రెడ్డి, వివేకానంద్, కేటీఆర్ తరఫు న్యాయవాదులు వివరించారు. విచారించిన ధర్మాసనం స్పీకర్కు 4 వారాల సమయమిస్తూ వాయిదా వేసింది. ఇద్దరు ఎమ్మెల్యేలకు క్లీన్‌చిట్ ఇచ్చిన స్పీకర్ : ఇవాళ సుప్రీంకోర్టులో బీఆర్ఎస్ వేసిన పిటిషన్ విచారణకు వస్తున్న నేపథ్యంలో స్పీకర్ నిన్ననే స్పందించారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్రెడ్డి, కాలే యాదయ్య బీఆర్ఎస్లోనే ఉన్నట్లు తెలంగాణ స్పీకర్ ప్రసా ద్కుమార్ నిన్న క్లీన్చిట్ ఇచ్చారు. వారు పార్టీ మారారనేందుకు ఆధారాలు లేవన్నారు. బీఆర్ఎస్ ఫిర్యాదు చేసిన పది మందిలో గతంలోనే ఐదుగురు ఎమ్మెల్యేలకు స్పీకర్ క్లీన్చిట్ ఇచ్చేశారు. వీరు కాకుండా ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరిపై వచ్చిన ఫిర్యాదులపై స్పీకర్ విచారణ జరపాల్సి ఉంది. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్పై దాఖలైన అనర్హత పిటిషన్పై విచారణ పూర్తి అయింది. కానీ తీర్పును ఇంకా వెల్లడించలేదు. స్పీకర్ తీర్పును రిజర్వులో ఉంచారు. 4 వారాల గడువు ఇచ్చిన సుప్రీంకోర్టు : గత నెలలో తెలంగాణలో ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఈ అంశంపై సర్వోన్నత న్యాయస్థానం తెలంగాణ స్పీకర్కు మరో 4 వారాల గడువు ఇచ్చింది. ఈ లోపు నిర్ణయం తీసుకోవాలని సూచించింది. కేసు విచారణను కూడా 4 వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు ఎమ్మెల్యేల అనర్హతకు సంబంధించి వాదనలను వినేందుకు స్పీకర్ నిర్ణయం తీసుకున్నారు. ఫిరాయించారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న మరో ముగ్గురు ఎమ్మెల్యేలపై నిర్ణయం తీసుకునేందుకు సుప్రీంకోర్టు 4 వారాలు గడువు విధించింది. ఇది అసలు నేపథ్యం : తమ పార్టీకి చెందిన 10 మంది శాసన సభ్యులు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి(గద్వాల), ఎం.సంజయ్ ం(జగిత్యాల), గూడెం మహిపాల్‌రెడ్డి(పటాన్‌చెరు), పోచారం శ్రీనివాస్‌రెడ్డి(బాన్సువాడ), కాలె యాదయ్య(చేవెళ్ల), తెల్లం వెంకట్రావు(భద్రాచలం) అరెకపూడి గాంధీ, (శేరిలింగంపల్లి), ప్రకాశ్‌గౌడ్(రాజేంద్రనగర్), కడియం శ్రీహరి (స్టేషన్‌ఘన్‌పూర్), దానం నాగేందర్(ఖైరతాబాద్)లు కాంగ్రెస్ పార్టీలో చేరారని, ఫిరాయింపు నిరోధక చట్టం కింద వారిని అనర్హులుగా ప్రకటించాలని స్పీకర్‌కు భారాస ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, జగదీశ్రెడ్డి, కేపీ వివేకానంద, డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, చింత ప్రభాకర్, పాడి కౌశిక్రెడ్డి ఫిర్యాదు చేశారు. అయితే ఈ ఫిర్యాదులపై స్పీకర్ నిర్ణయం తీసుకోవడంలో జాప్యం చేస్తున్నారని బీఆర్ఎస్ పార్టీ న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. దీంతో సుప్రీంకోర్టు విచారించగా పార్టీ ఫిరాయింపు ఫిర్యాదులపై నిర్ణయం తీసుకోవడానికి స్పీకర్కు ఒకసారి 3 నెలలు, మరోసారి 4 వారాల గడువు ఇచ్చింది. డిసెంబర్ 19వ తేదీతో రెండోవిడత గడువు ముగిసింది. ఈ మేరకు న్యాయనిపుణులు, అడ్వొకేట్ జనరల్‌తో చర్చించిన స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఆ 10 మంది ఎమ్మెల్యేలకు నోటీసులు జారీచేశారు. ఎనిమిది మంది ఎమ్మెల్యేలు తమ వివరణలను సభాపతికి సమర్పించారు. దీంతో వారు అఫిడవిట్ దాఖలు చేశారు. మరోవైపు ఫిర్యాదు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆ ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించారంటూ ఆధారాలను స్పీకర్కు సమర్పించారు. రెండు దశల్లో ఎనిమిది మంది ఎమ్మెల్యేలపై వచ్చిన ఫిరాయింపు ఫిర్యాదులను విచారించిన సభాపతి తీర్పు వెల్లడించారు.

## మెట్రో రెండో దశ త్వరలో చేపట్టాలి



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: హైదరాబాదులో నిర్మించి తలపెట్టిన మెట్రో రెండోదశ పనులు వెంటనే ప్రారంభించాలి అని కోరుతూ సీఎం రేవంత్ రెడ్డికి కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి కిషన్ రెడ్డి లేఖ రాశారు. తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో ఎదురవుతున్న ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి, రవాణా సౌకర్యాలను మెరుగుపరచడంలో భాగంగా హైదరాబాద్ మెట్రో రెండో దశ చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ అనుమతి కోరిన విషయం తెలిసిందే. ఇప్పటికే అమలు జరుగుతున్న మొదటి దశ మెట్రోను ? నుంచి రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకుని, ప్రభుత్వమే నిర్వహిస్తుందని ప్రకటించారని లేఖలో పేర్కొన్నారు. తాను కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ ను కలిసి మెట్రో రెండో దశ నిర్మాణం గురించి చర్చించాను. ముందుగా మెట్రో మొదటి దశను ? నుంచి రాష్ట్ర ప్రభుత్వం టేకోవర్ చేసుకోవాలని, అందుకు అన్ని ఒప్పందాలు, నిర్ణయాలు, లావాదేవీలు పూర్తి కావాలని చెప్పారు. లావాదేవీలు పూర్తయిన తర్వాత రెండో దశ నిర్మాణంపై కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే హైదరాబాద్ మెట్రో రెండో దశ నిర్మాణానికి అంగీకరించిందని కూడా కేంద్రమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ గుర్తు చేశారు. మెట్రో మొదటి దశను రాష్ట్ర ప్రభుత్వం ఎల్ అండ్ టి నుంచి తీసుకోవడం, రెండో దశకు సన్నాహాల కోసం కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం కలిసి సంయుక్తంగా కమిటీ ఏర్పాటుచేయడంపై మీతో కలిసి నిర్ణయించారని కూడా కేంద్రమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ కు తెలిపినట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఇద్దరు, కేంద్ర ప్రభుత్వం తరఫున ఇద్దరు అధికారులతో కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఇద్దరు అధికారుల పేర్లను పంపాలని కోరినట్లు కూడా వివరించారు. కానీ, ఇంతవరకు రాష్ట్ర ప్రభుత్వం అధికారుల పేర్లను ప్రతిపాదించలేదని చెప్పారు. కావున మీరు వెంటనే ఇద్దరు అధికారుల పేర్లు పంపి సమావేశ నిర్వహణకు ప్రయత్నం చేయాలని కోరారు. అదేవిధంగా, వేగవంతంగా ఎల్ అండ్ టి నుంచి 'మెట్రో నెట్‌వర్క్'ను రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకుని, ఆ తర్వాత మెట్రో రెండో దశ నిర్మాణానికి కావాల్సిన ప్రతిపాదనలు కేంద్ర ప్రభుత్వానికి పంపాల్సిందిగా మనవి చేస్తున్నాను. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని లేఖలో పేర్కొన్నారు.

# భక్తుల విశ్వాసాలకు అనుగుణంగా ఆలయాల అభివృద్ధి

● సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ, పర్యవేక్షణతో నిధులు ● వేములవాడలో రాజన్న ఆలయ విస్తరణ, మేడారంలో సమ్మక్క సారలమ్మ గద్దెల పునర్నిర్మాణం ● మంత్రి సీతక్క



తెలంగాణ బ్యూరోప్రతినిధిః భక్తుల విశ్వాసాలకు అనుగుణంగా రాష్ట్రంలో ఆలయాల అభివృద్ధి, విస్తరణ పనులను సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం చేయిస్తుందని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, గ్రామీణ నీటి పారుదల, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. వేములవాడ పట్టణంలోని శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో మంత్రి సీతక్క శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. మంత్రి సీతక్క ఆలయానికి రాగా, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గీతే పుష్పగుచ్చం అందజేసి మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ఆలయంలో అర్చకులు, అధికారులు మంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ముందుగా కోడె మొక్కు చెల్లించుకొని, భీమేశ్వర స్వామి వారికి మంత్రి ప్రత్యేక పూజలు చేశారు. గాయత్రి మాతను దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు, అధికారులు మంత్రికి స్వామి వారి ప్రసాదం అందజేసి, వేదోక్త ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అత్యంత భక్తుల రద్దీ ఉండే ఆలయాల అభివృద్ధి, విస్తరణ పనులకు సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని వివరించారు. వేములవాడ రాజన్న ఆలయ విస్తరణ పనుల విషయమై ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, లక్ష్మణ్ కుమార్ సీఎం దృష్టికి తీసుకెళ్లగా, సీఎం, మంత్రులు హాజరై ఆలయ విస్తరణ పనులకు శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. రూ. 150 కోట్లతో రాజన్న ఆలయ విస్తరణ పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. భక్తులకు మెరుగైన వసతులు, దర్శన భాగ్యం త్వరలోనే అందుబాటులోకి రానున్నదని తెలిపారు. అలాగే మేడారంలో సమ్మక్క సారలమ్మ జాతర గద్దెల పునర్నిర్మాణం, అభివృద్ధి పనులు వేగంగా పూర్తి అవుతున్నాయని తెలిపారు. ఆదివాసి పూజారులు, భక్తుల విశ్వాసాలకు అనుగుణంగా గద్దెల పునర్నిర్మాణం, వివిధ అభివృద్ధి పనులు వందల ఏండ్ల పాటు నిలిచిపోయేలా.. రెండు వందల కోట్ల రూపాయలకు పైగా మంజూరు చేసి.. రానున్న తరాలకు చరిత్ర తెలిసేలా పనులు సీఎం రేవంత్ రెడ్డి చేయించారని వివరించారు. ఈ నెల 18వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు మేడారం రానున్నారని, అక్కడే కేబినెట్ సమావేశం నిర్వహిస్తారని తెలిపారు. ఈ నెల 19వ తేదీన మేడారం జాతర పనులను సీఎం, మంత్రులు ప్రారంభిస్తారని వెల్లడించారు. మేడారం జాతరకు ముందు రాజన్న ఆలయాన్ని దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తుందని, అందులో భాగంగానే తాను ఇక్కడికి వచ్చానని వివరించారు. మేడారం జాతరకు అన్ని పార్టీల ఎమ్మెల్యేలకు స్వాగతం పలికామని, భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి తల్లులను దర్శించుకోవాలని కోరారు.

**రూ.150 కోట్లతో రాజన్న ఆలయ విస్తరణ..**

రూ. 150 కోట్ల నిధులతో వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయ విస్తరణ పనులకు ప్రజా ప్రభుత్వంలోని సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో శ్రీకారం చుట్టారని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. రాజన్న భక్తులకు వేగంగా స్వామి వారి దర్శనం, మెరుగైన వసతులు కల్పించేలా పనులు సాగుతున్నాయని వివరించారు. ఈ ప్రాంతంపై ప్రత్యేక ఆసక్తి, చొరవతోనే సీఎం రేవంత్ రెడ్డి నిధులు మంజూరు చేస్తున్నారని పేర్కొన్నారు. మేడారంలో కూడా అభివృద్ధి పనులు వేగంగా పూర్తి అవుతున్నాయని తెలిపారు. మేడారంలో మొక్కులు చెల్లించుకునే ముందు వేములవాడ కు రావడం ఆనవాయితీగా వస్తుందని వివరించారు. ప్రజా ప్రభుత్వంలో ఆలయాల నిర్మాణం, విస్తరణ పనులు వేగంగా పూర్తి అవుతున్నాయని తెలిపారు.

# గ్రీన్ అమోనియా ఉత్పత్తిలో కొత్త చరిత్ర

● ఏపీలో అతిపెద్ద గ్రీన్ అమోనియా ప్రాజెక్టు ● రూ.13 వేల కోట్లతో ఏఎమ్ గ్రీన్ అమోనియా ప్లాంట్‌కు రేపు శంకుస్థాపన చేయనున్న సీఎం చంద్రబాబు ● కాకినాడలో 495 ఎకరాల్లో ఏర్పాటు..2,600 మందికి ఉద్యోగాలు ● ఏడాదికి 1 మిలియన్ మెట్రిక్ టన్నుల గ్రీన్ అమోనియా ఉత్పత్తి

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం క్లీన్ ఎనర్జీ రంగంలో సరికొత్త చరిత్రను సృష్టించబోతోంది. గ్రీన్ హైడ్రోజన్ ఆధారిత గ్రీన్ అమోనియా పరిశ్రమ ఏర్పాటుతో దేశంలోనే అతిపెద్ద పర్యావరణహిత పరిశ్రమలలో ఒకటిగా నిలిచి చారిత్రాత్మక అడుగు వేయనుంది. గత ఏడాది గ్రీన్‌కో గ్రూప్‌కు చెందిన ఏఎమ్ గ్రీన్ సంస్థకు ఏడాదికి 1 మిలియన్ మెట్రిక్ టన్నుల గ్రీన్ అమోనియా ఉత్పత్తి చేసే ప్లాంట్ ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. ఏడాదిలోనే ఈ ప్రాజెక్ట్ కార్యరూపం దాల్చడం గమనార్హం. ఈ పరిశ్రమకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ శనివారం ఉదయం కాకినాడలో శంకుస్థాపన చేయనున్నారు. ఉదయం 10.30 గంటలకు ముఖ్యమంత్రి అమరావతి నుంచి కాకినాడకు వెళ్తారు. 11.20 గంటలకు ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తారు.

**రూ.13 వేల కోట్ల పెట్టుబడులు...2,600 ఉద్యోగాలు**

గ్రీన్ హైడ్రోజన్‌ను ఉపయోగించి పూర్తిగా పునరుత్పాదక శక్తితో తయారయ్యే కార్బన్ ఉద్గారాలు లేకుండా గ్రీన్ అమోనియాను ఏఎమ్ గ్రీన్ సంస్థ ఉత్పత్తి చేయనుంది. బొగ్గు, చమురు, సహజ వాయువులతో తయారయ్యే గ్రే, బ్లూ అమోనియాకు భిన్నంగా ఈ ఉత్పత్తి జరుగుతుంది... పర్యావరణానికి ఏమాత్రం హానికరం కాదు. ప్రపంచం మొత్తం డీకార్బనైజేషన్, నెట్-జీరో ఎమిషన్స్ లక్ష్యాల వైపు అడుగులు వేస్తున్న తరుణంలో గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమోనియా భవిష్యత్ ఇంధనాలుగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో కాకినాడలో ఏఎమ్ గ్రీన్ అమోనియా ప్రాజెక్ట్ దేశానికే గర్వకారణంగా నిలవనుంది. నాగార్జున ఫెర్టిలైజర్స్ కెమికల్స్ లిమిటెడ్ పాత గ్రే అమోనియా ప్లాంట్‌ను గ్రీన్ ప్లాంట్‌గా అభివృద్ధి చేస్తున్నారు. 495 ఎకరాల్లో రూ.13 వేల కోట్ల పెట్టుబడితో ఏఎమ్ గ్రీన్ సంస్థ ఈ ప్లాంట్ ఏర్పాటు చేస్తోంది. ఈ ప్లాంట్ ఏర్పాటు ద్వారా సుమారు 2,600 మంది యువతకు ఉద్యోగ అవకాశాలు దక్కనున్నాయి. 2027 చివరినాటికి ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్నారు.

**ఎగుమతులకు అద్భుత అవకాశం**



ఏఎమ్ గ్రీన్ అమోనియా ప్లాంట్ కాకినాడ పోర్ట్‌కు కేవలం 1 కిలోమీటర్ దూరంలో ఉంటుంది. గ్రీన్ అమోనియాను అవసరమైన ప్రపంచ దేశాలకు ఎగుమతులకు అద్భుత అవకాశం ఉండనుంది. ఏఎమ్ గ్రీన్ సంస్థ ఇప్పటికే జర్మనీకి చెందిన యూనిపర్ ఎస్ఈతో ఒప్పందం కుదుర్చుకుంది. 2028 నుంచి ఏడాదికి 125 కేటీపీఏ గ్రీన్ అమోనియాను ఆ దేశానికి ఎగుమతి చేయనుంది. అలాగే మలేషియాకు చెందిన పెట్రోనాస్, సింగపూర్‌కు చెందిన జీఐసీ, యూఏఈకి చెందిన ఏడీఏఐ వంటి సంస్థల సహకారంతో ఏర్పాటు చేస్తోన్న ఈ ప్రాజెక్ట్ ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందనుంది.

# ఏపీలో మరో రూ. 90 వేల కోట్ల పెట్టుబడి

● మంత్రి నారా లోకేశ్ ప్రకటన ● కాకినాడలో ఏఎమ్ గ్రీన్ భారీ ప్రాజెక్ట్ ● 10 బిలియన్ డాలర్ల పెట్టుబడితో గ్రీన్ అమ్మోనియా టెర్మినల్ ● 8,000కు పైగా ఉద్యోగ అవకాశాలు ● జర్మనీ, సింగపూర్, జపాన్‌లకు గ్రీన్ ఎనర్జీ ఎగుమతి ● ప్రపంచ గ్రీన్ ఎనర్జీ రంగంలో ఏపీకి కీలక స్థానం ● అంధ రచయిత్రి రాసిన నవలను ఆవిష్కరించిన మంత్రి లోకేష్ ● వైకల్యాన్ని జయించి స్ఫూర్తిగా నిలిచిన చింతక్రింది సాయిజ్యోతికి మంత్రి అభినందన



కాకినాడః గ్రీన్ ఎనర్జీలో ఆంధ్రప్రదేశ్.. సౌదీ అరేబియాగా అవతరిస్తుందని మంత్రి నారా లోకేష్ తాజాగా ప్రకటించారు. ఈ మేరకు కాకినాడలో గ్రీన్ ఎనర్జీ రంగంలో 10 బిలియన్ డాలర్ల పెట్టుబడులు రానున్నట్లు తెలిపారు. ఇక్కడి నుంచి జర్మనీ, సింగపూర్, జపాన్‌కు హరిత ఇంధనం ఎగుమతి అవుతుందని తెలిపారు. ఈ ప్రాజెక్టు వల్ల 8,000 ఉద్యోగాలు రానున్నట్లు వెల్లడించారు. చమురు ఉత్పత్తిలో గల్ఫ్ దేశమైన సౌదీ అరేబియా అగ్రగామిగా ఉన్న విషయం తెలిసిందే. అదే మాదిరిగా గ్రీన్ ఎనర్జీలో సౌదీ అరేబియాగా ఆంధ్రప్రదేశ్ అవతరిస్తుందని ఏపీ పరిశ్రమల శాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు. ఈ మేరకు తాజాగా కీలక ప్రకటన చేశారు. హరిత ఇంధన రంగంలో కాకినాడలో త్వరలో 10 బిలియన్ల డాలర్లు (సుమారు రూ. 90.6 వేల కోట్లు) పెట్టుబడులు రాబోతున్నట్లు ప్రకటించారు. ఇక్కడ ఉత్పత్తి కాబోయే గ్రీన్ ఎనర్జీ.. జర్మనీ, సింగపూర్, జపాన్ వంటి దేశాలకు ఎగుమతి అవుతుందని వెల్లడించారు. దీనిపై శుక్రవారం (జనవరి ) సాయంత్రం 6 గంటలకు కీలక ప్రకటన చేస్తామని మంత్రి పేర్కొన్నారు.

కాగా, కాకినాడలో ఇప్పటికే భారతదేశంలోనే మొట్టమొదటి, ప్రపంచంలోనే అతిపెద్ద గ్రీన్ అమ్మోనియా కాంప్లెక్స్ పనులు జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ పరిశ్రమను ఏఎమ్ గ్రీన్ సంస్థ నిర్మిస్తోంది. అందుతున్న సమాచారం ప్రకారం.. ఈ కాంప్లెక్స్‌లో శనివారం (జనవరి 17) ప్రధాన పరికరాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా జరిగే కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ హాజరుకానున్నట్లు సమాచారం. కాగా, ఆంధ్రప్రదేశ్‌తో పాటు ప్రపంచ హరిత ఇంధన వ్యాల్యూ చైన్‌లో ప్రాముఖ్యత దృష్ట్యా.. ఈ ప్రాజెక్ట్‌కు ప్రాధాన్యం ఏర్పడింది. అయితే దీనిపై మంత్రి లోకేశ్ ఏమైనా అప్డేట్ ఇస్తారా లేక.. ఇతర పెట్టుబడులను ప్రకటిస్తారా అనేది ఆసక్తిగా మారింది.

భారత్‌లో అతిపెద్ద గ్రీన్ ఎనర్జీ పెట్టుబడులలో ఏఎమ్ గ్రీన్ ప్రాజెక్ట్ ఒకటి అని గతంలో ప్రభుత్వం ఓ ప్రకటనలో. అయితే ఈ ప్రాజెక్టు వల్ల నిర్మాణ దశలోనే సుమారు 8,000 ఉద్యోగాల వస్తాయని అధికారులు చెబుతున్నారు. అంతేకాకుండా కార్యకలాపాలు ప్రారంభించాక.. పునరుత్పాదక ఇంధనం, లాజిస్టిక్స్, స్టోరేజ్, పోర్ట్ సేవలు వంటి అనుబంధ పరిశ్రమల్లో.. పెద్ద ఎత్తున, హై స్కిల్ ఉద్యోగాలను సృష్టిస్తుందని తెలిపారు.

ఏఎం గ్రీన్ కంపెనీ.. నెదర్లాండ్స్‌కు చెందిన ఏఎంజీ మెటల్ భాగస్వామ్యంతో మొదటి దశలో రూ. 10,050 కోట్ల పెట్టుబడితో గ్రీన్ అమ్మోనియా, గ్రీన్ అల్యూమినియం తయారీ పరిశ్రమలను ఏర్పాటు చేయనుంది. ఈ కాంప్లెక్స్ సంవత్సరానికి 1.5 మిలియన్ టన్నుల సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. దీని మొదటి దశ మార్చి 2027 నాటికి ప్రారంభం అవుతుందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ప్రాజెక్ట్ చివరి దశ 2030 నాటికి పూర్తయ్యే అవకాశం ఉంది. కాగా, గ్రీన్ అమ్మోనియా అంటే పర్యావరణానికి హాని చేయని పద్ధతుల్లో తయారుచేసే అమ్మోనియా. అంధ రచయిత్రి రాసిన నవలను ఆవిష్కరించిన మంత్రి లోకేష్ : మంగళగిరి 26వ వార్డుకు చెందిన విభిన్న ప్రతిభావంతురాలు చింతక్రింది సాయిజ్యోతి రచించిన 'చేయి వీడని చెలిమి' అనే నవలను విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఆవిష్కరించారు. ఈ మేరకు ఉండవల్లి నివాసంలో కుటుంబంతో సహా సాయిజ్యోతి మంత్రి నారా లోకేష్ ను కలిశారు. అంధురాలైన సాయిజ్యోతి మొబైల్ లో వాయిస్ ఇన్ పుట్ సాంకేతిక పరిజ్ఞానం సాయంతో రచనలు చేస్తున్నారు. 'చైత్రశ్రీ' కలం పేరుతో కవితాంజలి అనే కవితా సంపుటితో పాటు 'మంచుతాకిన ప్రేమ', 'ఎవరు అతను' అనే నవలలు, సామాజిక స్పృహ కలిగించే కథలు రచించారు. నూతక్కి హైస్కూల్ లో జూనియర్ అసిస్టెంట్ గా ఆమె పనిచేస్తున్నారు. వైకల్యాన్ని జయించి తన ప్రతిభతో యువతరానికి స్ఫూర్తిగా నిలిచిన సాయిజ్యోతిని ఈ సందర్భంగా మంత్రి లోకేష్ అభినందించారు. భవిష్యత్ లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీ వెల్ఫేర్ అండ్ డెవలప్ మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, ఇతర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.




# ఆదిలాబాద్ జిల్లాకు సీఎం రేవంత్ వరాల జల్లు

● రూ.386 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన ● సబ్బండ వర్గాల అభివృద్ధియే ప్రజాప్రభుత్వం ప్రధాన ధ్యేయం
● బాసరలో విశ్వ విద్యాలయం ఏర్పాటుకు చర్యలు ● సదర్మాట్ బ్యారేజికి పి. నర్సారెడ్డి పేరు పెడతాం
● ప్రధాని మోడీని కలవడానికి ఆలోచించను.. ● ఆదిలాబాద్ జిల్లా పర్యటనలో సీఎం రేవంత్ కీలక వ్యాఖ్యలు



అదిలాబాద్ ఉమ్మడి జిల్లా బ్యూరో /నిర్మల్ ప్రతినిధి, సూర్య మేజర్ న్యూస్ : ఆదిలాబాద్ జిల్లాపై సీఎం రేవంత్‌రెడ్డి వరాల జల్లు కురిపించారు. రూ.386 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడంతో పాటు, సదర్మట్ బ్యారేజ్‌ను జాతికి అంకితం చేశారు. జిల్లాకు ప్రత్యేక యూనివర్సిటీ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. కేసీఆర్ హయాంలోని పెండింగ్ ప్రాజెక్టులను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేసిందని సీఎం స్పష్టం చేశారు. ఆదిలాబాద్ జిల్లా అంటే తనకు ప్రత్యేకమైన అభిమానం ఉందని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్అబశ్రీశ్రీరెడ్డి వ్యాఖ్యానించారు. అత్యంత వెనుకబడిన ఈ జిల్లాకు ఆశించిన న్యాయం జరగలేదని పేర్కొన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో శుక్రవారం సీఎం పర్యటించిన ఆయన.. రూ.386.46 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. హాతిఘాట్‌లో చనాకా - కొరాట బ్యారేజ్ పంప్‌హౌస్ ప్రారంభించారు. సదర్మట్ బ్యారేజ్‌ను జాతికి అంకితం చేశారు. యాసంగి పంటకు నీరు విడుదల చేశారు. పొన్కల్ దగ్గర గోదావరి నదిపై సదర్మట్ బ్యారేజ్ నిర్మాణాన్ని ప్రారంభించారు. రూ.676 కోట్లతో ప్రభుత్వం సదర్మట్ బ్యారేజ్ నిర్మాణం చేపట్టిందని సీఎం ప్రసంగించారు. ఈ బ్యారేజ్ ద్వారా 18 వేల ఎకరాలకు సాగునీరును ప్రభుత్వం అందించనుందన్నారు.

**సరైన న్యాయం జరగలేదు.. :** పోరాటం, పౌరుషాల గడ్డ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అని రేవంత్ రెడ్డి ఉద్ఘాటించారు. గతంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సరైన న్యాయం జరగలేదని చెప్పుకొచ్చారు. పాలమూరుతో సమానంగా ఆదిలాబాద్ అభివృద్ధి చేస్తామని వివరించారు. ఆదిలాబాద్‌కు కావాల్సిన నిధులు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలో చిత్తశుద్ధిగా పనిచేసి ఉంటే చనాక - కొరాట ప్రాజెక్టు ఎప్పుడో పూర్తయ్యేదని తెలిపారు. పాలమూరు జిల్లాతో సమానంగా ఆదిలాబాద్ అభివృద్ధికి నిధులు ఇస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**నిధులు మంజూరు చేశాం.. :** చనాక - కొరాట, సదర్మట్ బ్యారేజీలు గత పదేళ్లలో పూర్తికాలేదని ఈ సందర్భంగా సీఎం చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అవసరమైన నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేశామని వెల్లడించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు యూనివర్సిటీ ఇవ్వాలని నిర్ణయించినట్టు ఆయన తెలిపారు. బాసర ట్రిపుల్ ఐటీలోనే యూనివర్సిటీని ప్రారంభిస్తామన్నారు. ఇందుకు అవసరమైన ప్రణాళిక సిద్ధం చేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రికి సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. ఆదిలాబాద్ యూనివర్సిటీని తానే ప్రారంభిస్తానని రేవంత్ చెప్పుకొచ్చారు.కాళేశ్వరానికి రూ.లక్షా 10 వేల కోట్లు ఖర్చుచేసినా.. చుక్కనీరు రాలేదని విమర్శించారు. రైతులకు నీరు రావాలంటే తుమ్మిడిహెట్టి దగ్గర ప్రాజెక్టు కట్టాల్సిందేనని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన ప్రక్రియ ప్రారంభమైందని పేర్కొన్నారు. ఒక్కొక్కటిగా సమస్యలు పరిష్కరించుకుంటూ ముందుకెళ్తున్నామని తెలిపారు. తెలంగాణ అభివృద్ధి విషయంలో రాజకీయాలు చేయొద్దని హితవు పలికారు. నాగోబా జాతరకు నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. రూ.300 కోట్లతో మేడారం ఆలయ అభివృద్ధి పనులు జరుగుతున్నాయని సీఎం రేవంత్ పేర్కొన్నారు.

**అందుకే మోదీని కలుస్తున్నా..**

'ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ ఏర్పాటు చేయబోతున్నాం. ప్రధాని మోదీ చేతులమీదుగా ప్రారంభిస్తాం. ఆదిలాబాద్‌లో పరిశ్రమల అభివృద్ధికి 10వేల ఎకరాల భూసేకరణ జరుపుతాం. పరిశ్రమలు వస్తేనే అభివృద్ధి సాధ్యం అవుతుంది. ఎన్నికలప్పుడే రాజకీయాలు.. ఎన్నికలు ముగిసిన తర్వాత అభివృద్ధికి కలిసి పనిచేద్దాం. అందుకే ప్రతి మూడు నెలలకోసారి ప్రధానిని, కేంద్ర మంత్రులను కలుస్తున్నాం. బీజేపీ ప్రజా ప్రతినిధులు కూడా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి సమస్యలు తీసుకువస్తే పరిష్కరిస్తాం. నేను తరచూ ప్రధానిని కలవడంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. నాకు నరేంద్ర మోదీతో బంధుత్వం లేదు.. చుట్టమూ కాదు. ఆయన మనకు ప్రధాని.. ఆయనతో పనులు చేయించుకుంటున్నాం. రాష్ట్ర అభివృద్ధి కోసం ఎవరినైనా కలుస్తా, పైరవీల కోసం పోవడం లేదు, పర్సనల్ ఎజెండా ఏమీ లేదు. ఎవరిని కలిసినా అభివృద్ధి కోసమే. కేంద్రం సహకారంతోనే అవసరమైన ఎయిర్ పోర్టులు, నిధులు వస్తున్నాయి.



**ప్రధాని మోడీని కలవడానికి ఆలోచించను.. సీఎం రేవంత్ కీలక వ్యాఖ్యలు**

నన్ను ప్రతిసారి నరేంద్ర మోడీతో ఎందుకు కలుస్తున్నారని ప్రశ్నించే వారికి సూటిగా చెబుతున్నా.. మోడీతో బరాబర్ కలుస్తా..! తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం ఎన్నిసార్లు అయినా ఢిల్లీకి వెళ్తా..! అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. చిన్న వయస్సులోనే రాష్ట్రానికి ముఖ్యమంత్రి చేసిన తెలంగాణ ప్రజలకు సేవ చేసేందుకు ఎవరు ఎన్ని విమర్శలు చేసినా పట్టించుకోను. ఎర్రబస్సు రాని వెనుకబడిన ఆదిలాబాద్ జిల్లాకు ఎయిర్ బస్సును తీసుకొస్తున్నా. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు ప్రాణహిత ద్వారా రెండున్నర లక్షల ఎకరాలకు సాగునీరు అందించి తీరుతా. ఇలాంటి పనులు ముందుకు సాగాలంటే కేంద్రంలో ఉన్న ప్రధాని, కేంద్ర మంత్రులని తప్పనిసరి కలవాల్సిందే. దీన్ని కొందరు రాజకీయం చేస్తున్నారు. నేను అసలు ఇలాంటివి అసలే పట్టించుకోను. ఎన్నికలు ఉన్నప్పుడు మాత్రమే రాజకీయం. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి పేదల సంక్షేమం మాత్రమే నాకు ముఖ్యం అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుండ బద్దలు కొట్టారు. నిర్మల్ జిల్లా కేంద్రంలో జరిగిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రసంగించారు. కేంద్రంతో దోస్తీపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలపై రేవంత్ రెడ్డి స్పష్టతఅబశ్రీశ్రీ ఇచ్చారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు యూనివర్సిటీ విషయంలో జిల్లాల వారీగా డిమాండ్లు ఉన్నప్పటికీ సరస్వతి అమ్మవారి క్షేత్రం బాసరలో యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించారు. పదివేల ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్కులు.. పాలమూరుఅబశ్రీశ్రీతో సమానంగా నిధులు ఇస్తామని హామీ ఇచ్చారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో నిరుద్యోగంతో పాటు పేద ప్రజల బతుకులు బాగుపడాలంటే ఈ ప్రాంతంలో పెద్ద ఎత్తున పరిశ్రమలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని రేవంత్ రెడ్డి అన్నారు ఇందుకు ఆదిలాబాద్ జిల్లాలో పదివేల ఎకరాలు సేకరించే బాధ్యతను జిల్లా ఇన్చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావుకు అప్పగిస్తున్నట్లు చెప్పారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు నా సొంత జిల్లా పాలమూరుతో సమానంగా నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. తాను పీసీసీ అధ్యక్షుడిగా తొలి పర్యటన నిర్మల్‌లోనే జరిగిందని.. ఎన్నికల శంఖారావానికి సంబంధించి తొలి బహిరంగ సభ ఇంద్రవెల్లిలో నిర్వహించాలని అందుకే తనకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అంటే అభిమానం అని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

నాటి పాలకులు చేసిన అప్పులే ఇప్పుడు ఉరి తాడు అయ్యాయి. మేం ఫ్యూచర్ సిటీ అంటే మమ్మల్ని రియల్ ఎస్టేట్ బ్రోకర్స్ అంటున్నారు' అని ప్రతిపక్షాలనుద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్ అన్నారు.

**ఫామ్‌హౌస్‌లోనే ఉండండి.. :** 'పదేళ్ల పాలనలో ఏమీచేయని వ్యక్తి ప్రజాపాలనను భరించలేక పోతున్నారు. 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ఉన్న వ్యక్తి ఇలాగేనా మాట్లాడేది. చేతనైతే మమ్మల్ని ఆశీర్వదించండి.. లేకుంటే ఫామ్‌హౌస్‌లోనే ఉండండి. మారీచుడు, సుగ్రీవుడు తరహాలో రాక్షసుల్లా.. అభివృద్ధికి అడ్డుపడుతున్నారు. శుక్రాచార్యుడిలా ఫామ్‌హౌస్‌లో ఉన్న వ్యక్తి ప్రోత్సహిస్తున్నారు. పదేళ్లు అధికారంలో ఉండి రూ.8 లక్షల కోట్ల అప్పులు చేశారు. బీఆర్ఎస్ నేతలకు అభివృద్ధి అంటే ఇష్టం లేకపోతే ఫామ్‌హౌస్‌లో విశ్రాంతి తీసుకోవచ్చు. బావాబామ్మర్దులు అభివృద్ధిని అడ్డుకుంటున్నారు. మొన్న పంచాయతీ ఎన్నికల్లో 66శాతం కాంగ్రెస్ సర్పంచ్‌లను గెలిపించారు ప్రజలు. వారి నమ్మకాన్ని వమ్ము చేయం. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లోనూ మంచి వాళ్లను ఎన్నుకోండి. సమస్యలను పరిష్కరించే వాళ్లను, ప్రజా ప్రభుత్వంతో కలిసి పనిచేసిన వాళ్లనే గెలిపించుకోండి. నేను ఓడిపోయిన వాళ్ల గురించి మాట్లాడను. మేం పాలకులం కాదు.. సేవకులం. మీ మనసు గెలుస్తాం.. రాబోయే ఎన్నికల్లో విజయం సాధిస్తాం. 2038వరకు అధికారంలో ఉంటాం' అని సీఎం రేవంత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

**రెండున్నర లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తా... :** గత పాలనలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు తీవ్ర అన్యాయం జరిగిందని రేవంత్ రెడ్డి ఆక్షేపించారు. తుమ్మిడి హట్టి ప్రాజెక్టు నిర్మాణం జరిగి ఉంటే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రైతాంగానికి న్యాయం జరిగేదని ఆయన పేర్కొన్నారు. గత పాలకులు నిర్లక్ష్యం చేసి వదిలివేసిన ఆ కార్యక్రమాన్ని తమ ప్రభుత్వం తీసుకుంటుందని ఈ విషయంలో ఇరిగేషన్ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి బాధ్యత తీసుకోవాలని సూచించారు ఆ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేసి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు రెండున్నర లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

ఓడిపోయిన, పడిపోయిన వాళ్ల గురించి ఇక పట్టించుకోను సీఎం రేవంత్ వెల్లడి

మామడ మండలంలోని పొన్కల్ గ్రామంలోని గోదావరి నదిపై రూ. 576 కోట్లతో నిర్మించిన సదర్ మట్ బ్యారేజ్ ను శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్యారేజ్ కు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. రిమోట్ స్విచ్ ద్వారా గేట్లను ఓపెన్ చేశారు. బ్యారేజ్ వద్దకు వెళ్లడానికి పాసులు ఉన్న వారినే అనుమతించారు . ఎస్పీ జానకి షర్మిల ఆధ్వర్యంలో భారీ భద్రత ఏర్పాట్లు చేశారు. ప్రశాంతంగా ముఖ్యమంత్రి పర్యటన ముగియడంతో అధికారులు ఊపిరిపించుకున్నారు. గ్రామానికి సంబంధించిన పలు సమస్యలను నాయకులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు

.ఈ కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, బొజ్జు పటేల్, సంజయ్ కుమార్ ,రామారావు పటేల్ ,సర్పంచ్ చిట్యాల లక్ష్మి, మాజీమంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, కలెక్టర్ అభిలాష అభినవ్ ,ఎస్పీ జానకి షర్మిల, ఆయా శాఖల అధికారులు ,నాయకులు పాల్గొన్నారు.

**నిర్మల్ జిల్లాలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం :** నిర్మల్ జిల్లాలో పలు అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం నిర్మల్ పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించారు. 'ఆదిలాబాద్ జిల్లా అంటే నాకు ప్రత్యేకమైన అభిమానం. ఈ జిల్లాకు ఘనమైన పోరాట చరిత్ర ఉంది. ఉమ్మడి రాష్ట్ర పాలకులతో పాటు గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలోనూ ఆదిలాబాద్ జిల్లా అన్యాయానికి గురైంది. బీఆర్ఎస్ నేతలు పట్టించుకుని ఉంటే చనాకా-కొరాటా ప్రాజెక్టు ఎప్పుడో పూర్తయ్యేది. తాము పక్కా ప్రణాళికతో జిల్లా అభివృద్ధికి ముందుకు వెళ్తున్నాము. ఉమ్మడి ఆదిలాబాద్‌కు యూనివర్సిటీ ఇచ్చే బాధ్యత నాది. ఎవరూ అడ్డుపడకుండా పార్టీలకు అతీతంగా సహకరించండి. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌ను కూడా నిర్మల్ జిల్లాలో ఏర్పాటు చేస్తాం. స్టేడియం, కొత్త కలెక్టరేట్‌తో పాటు ఇక్కడి నేతలు కోరినవన్నీ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాం. పాలమూరు జిల్లాతో సమానంగా ఆదిలాబాద్‌ను అభివృద్ధి చేస్తాం. అసెంబ్లీలో ఆదిలాబాద్ నేతలతో పత్యేకంగా సమావేశం జరిపి.. బడ్జెట్‌లో కేటాయింపులు కూడా చేస్తాం. బడ్జెట్ సమావేశాలలోపే తుమ్మడిహట్టి వద్ద నిర్మించాల్సిన ప్రాజెక్టు ప్రణాళికలు సిద్ధం చేస్తాం. ఆదిలాబాద్‌లో ప్రతీ ఎకరాకు నీరందిస్తాం. ఎర్రబస్సు రావడమే కష్టంగా ఉండే ఈ ప్రాంతానికి ఎయిర్‌పోర్టు తీసుకొస్తాం. దానికి స్వయంగా ప్రధాని మోడీ చేత ప్రాంభింపచేస్తాం. అతిపెద్ద పారిశ్రామిక వాడను కూడా ఆదిలాబాద్‌లో ఏర్పాటు చేస్తాం. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం. ఎన్నికలు వచ్చినప్పుడు రాజకీయాలు చేద్దాం.. కానీ ఎన్నికలు ముగిసిన తర్వాత అందరం కలిసి అభివృద్ధికి కృషి చేద్దాం. పదే పదే ప్రధాని మోడీని కలుస్తున్నా.. రాష్ట్రానికి నిధులు తీసుకొచ్చేందుకు చేయాల్సిన ప్రయత్నాలు అన్నీ చేస్తున్నాను. ప్రజల కోసం, తెలంగాణ అభివృద్ధి కోసం ఎవరినైనా కలుస్తా. ఎక్కడికైనా వెళ్తా. వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఏనాడూ పాకులాడలేదు. అడగకపోతే అమ్మ కూడా పెట్టదు అంటారు.. అందుకే ప్రతీసారి వెళ్లి పరిస్థితిని మోడీకి వివరించి అభివృద్ధికి సహకరించండి అని మోడీని కోరుతున్నాను.

**బీఆర్ఎస్ నిర్వాకం వల్లే ఈ పరిస్థితి :** పదేళ్లు అధికారంలో ఉన్న వాళ్లు చేసిన నిర్లక్ష్యం వల్లే ఇవాళ పరిస్థితి ఇలా తయారయింది. అప్పు చేసి రాష్ట్రాన్ని నిలువునా ముంచారు. వాళ్లు చేసిన గందరగోళం అంతా ఇంతా కదు. ఒక్కొక్క చిక్కుముడిని విప్పుకుంటూ ముందుకు వెళ్తున్నాం. ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చాం. ఇందిరమ్మ చీరలు ఇచ్చాం. ఆర్టీసీల్లో ఉచిత బస్సు సౌకర్యం కల్పించాం. సన్నబియ్యం ఇస్తున్నాం. రూ.500 లకే గ్యాస్ సిలిండర్ ఇస్తున్నాం. సన్నవడ్లు పండించిన రైతులకు రూ.500 బోనస్ ఇస్తున్నాం. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. స్వయం సహాయక సంఘాలకు సున్నా వడ్డీకే రుణాలు ఇచ్చాం. వెయ్యి ఆర్టీసీ బస్సులకు మహిళలనే యజమానులను చేశాం. ఒక్కొక్కటి అమలు చేస్తూ అందరినీ కాపాడుకుంటూ వెళు_న్నాం. మన పౌరుషానికి ప్రతీకలైన సమ్మక్క-సారలమ్మ ఆలయాలను అద్యద్భుతంగా నిర్మిస్తున్నాం. రేపు జాతర ప్రారంభానికి ముందే ప్రజలకు అందుబాటులోకి రాబోతోంది. మేడారం జాతరకు కూడా మా అక్కలు, అమ్మలు ఉచితంగా బస్సులో వెళ్లి దర్శించుకుని రావచ్చు.

**పనిచేసే వారిని మున్సిపల్ ఎన్నికల్లో ఎన్నుకోండి:** ప్రపంచమంతా హైదరాబాద్‌కు వైపు చూసేలా ఫ్యూచర్ సిటీని నిర్మిస్తుంటే.. కాళ్లలో కట్టెలు పెడుతున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని మాపైనే ఆరోపణలు చేస్తున్నారు. అభివృద్ధిని అడ్డుకుంటే ప్రజలు వారికి రాజకీయ సమాధి కట్టడం ఖాయం. 40 ఏళ్ల రాజకీయ చరిత్ర ఉన్న కేసీఆర్.. అభివృద్ధికి సలహాలు ఇవ్వకుండా విమర్శలు చేస్తున్నారు. ప్రజలంతా ఫామ్‌హౌజ్‌లో ఉండి ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్న కేసీఆర్ గురించి ఆలోచించాలి. దేశంలోనే తెలంగాణను నెంబర్ స్టేట్‌గా నిలుపుతాం. మున్సిపల్ ఎన్నికల్లో అభివృద్ధి చేసేవారికి ఓటు వేయండి. ప్రజా ప్రభుత్వంతో కలిసి పనిచేసేవారికి ఆ ప్రాంతానికే ఉపయోగం జరుగుతుంది. డబ్బులకు ఆశపడి ఓటు వేస్తే.. ఆ తర్వాత ఐదేళ్లు బాధపడాల్సి ఉంటుంది. ఓడిపోయిన వారి గురించి ఎక్కువ మాట్లొద్దని నిర్ణయించుకున్నాను. ఒక్క వేటుకే ఫామ్‌హౌజ్‌కు పరిమితం అయ్యిండు. మైక్ టైసన్‌లా మనం పంచ్ ఇస్తే కథ ముగిసింది. అందుకే ఇక వారి గురించి మాట్లాడొద్దని ఫిక్స్ అయ్యా. 2034 వరకు తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉంటుంది' అని సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు.

స్వర్ణ నారావారి పల్లె తరహాలో

## స్వర్ణ చంద్రగిరికి ప్రణాళిక

● స్వర్ణకుప్పం, నారావారిపల్లె తరహాలోనే సుస్థిరాభివృద్ధి లక్ష్యం
● స్వర్ణ చంద్రగిరి మండల అభివృద్ధి ప్రణాళికల్ని ప్రకటించిన సీఎం చంద్రబాబు



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : తిరుపతి జిల్లాలోని చంద్రగిరి మండలాన్ని అభివృద్ధి నమూనాగా తీర్చిదిద్దేందుకు స్వర్ణ చంద్రగిరి ప్రణాళికల్ని సీఎం చంద్రబాబు ప్రకటించారు. స్వర్ణ కుప్పం, నారావారి పల్లె తరహాలోనే సుస్థిరాభివృద్ధి లక్ష్యాన్ని సాధించేందుకు వీలుగా సీఎం ఈ ప్రణాళికల్ని అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. చంద్రగిరి మండలంలో ప్రజల జీవన ప్రమాణాలు పెంచేలా ఈ అభివృద్ధి ప్రణాళికల్ని అమలు చేయనున్నారు. గత ఏడాది సంక్రాంతికి కందులవారి పల్లి, చిన్న రామాపురం, ఎ రంగంపేట గ్రామాలను కలిపి స్వర్ణ నారావారిపల్లికి కార్యక్రమానికి ఎంపిక చేశారు. స్వర్ణ నారావారి పల్లె ప్రాజెక్టు ద్వారా ఒక్క ఏడాదిలోనే అద్భుతమైన ఫలితాలు వచ్చాయి. ఏడాది కాలంలోనే అన్ని ఇళ్లకూ వంద శాతం సౌర ప్యానెళ్లను అమర్చడం ద్వారా ఇంధన స్వయం సమృద్ధిని సాధించింది. తద్వారా ప్రతీ ఇంటికీ ఉచితంగానే విద్యుత్ వెలుగులు వచ్చాయి. శాస్త్రీయ పద్ధతుల్లో పాడిపరిశ్రమను ప్రోత్సహించడం, ప్రకృతి సేద్యం విస్తరణ తదితర ప్రణాళికల ద్వారా తలసరి ఆదాయం 20 శాతం మేర పెరిగింది. మహిళలు, యువతకు ఉపాధి అవకాశాలను మెరుగుపర్చేలా ప్రత్యేక స్కిల్లింగ్, అప్ స్కిల్లింగ్ కార్యక్రమాలను కూడా సమర్థంగా అమలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పూర్తి సంతృప్త స్థాయిలో ప్రతీ లబ్ధిదారుడికి చేరేలా అమలు చేయటంతో పాటు మౌలిక సదుపాయాలు కల్పనను స్వర్ణ నారావారిపల్లె కార్యక్రమంలో భాగంగా అమలు చేశారు. ఇప్పుడు ఇదే స్ఫూర్తితో చంద్రగిరి మండలం అంతటా ఈ ప్రాజెక్టును విస్తరించాలని..ఏడాదిలోపు నిర్ధేశించుకున్న ఫలితాలను సాధించాలని సీఎం చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ తో పాటు ఉన్నతాధికారులతో జరిగిన సమీక్షలో ఈ మేరకు సిఎం చంద్రబాబు దిశానిర్ధేశం చేశారు.

## 18న పాలేరుకు సీఎం రేవంత్ రెడ్డి

● రూ. 362 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం
● చారిత్రక ఘట్టం.. మేడారంలో రాష్ట్ర క్యాబినెట్ భేటీ : మంత్రి పొంగులేటి



ఏదులాపురం మున్సిపాలిటీ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాత ఉమ్మడి జిల్లాల పర్యటనలో భాగంగా ఈ నెల 18న ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పాలేరు నియోజకవర్గంలో పర్యటించనున్నట్లు తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. శుక్రవారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని మద్దులపల్లిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ పర్యటనలో భాగంగా మొత్తం రూ. 362 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారని తెలిపారు.

**పాలేరు గడ్డపై అభివృద్ధి పండుగ**

మద్దులపల్లిలో జేఎన్టీయూ కళాశాలకు శంకుస్థాపన, నర్సింగ్ కళాశాల ప్రారంభోత్సవం చేయడంతో పాటు.. మున్నేరు-పాలేరు లింక్ కెనాల్ నిర్మాణ పనులను సీఎం ప్రారంభిస్తారు. అదేవిధంగా మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్ ను ప్రారంభిస్తారు. అలాగే కూసుమంచిలో నిర్మించిన 100 పడకల ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, వాకిటి శ్రీహరి తదితరులు పాల్గొంటారని వివరించారు. ఇదే వేదికగా రాబోయే మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల సన్నద్ధతపై ఉమ్మడి జిల్లా ముఖ్య కార్యకర్తలతో సీఎం దిశానిర్దేశం చేయనున్నారని పొంగులేటి తెలిపారు.

**తొలిసారిగా హైదరాబాద్ వెలుపల క్యాబినెట్ భేటీ..**

రాష్ట్ర చరిత్రలో నిలిచిపోయేలా ఈ నెల 18న మేడారంలో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం (క్యాబినెట్ మీటింగ్) నిర్వహించనున్నట్లు పొంగులేటి ప్రకటించారు. ఉమ్మడి రాష్ట్రంలోనూ ఎన్నడూ లేని విధంగా హైదరాబాద్ వెలుపల క్యాబినెట్ భేటీ జరగడం ఇదే ప్రథమమని పేర్కొన్నారు. "గత ప్రభుత్వంలా ఎన్నికల వేళ బొమ్మలు చూపడం మా అలవాటు కాదు.. నిరంతరం ప్రజల మధ్య ఉంటూ పనిచేసే ప్రభుత్వమిది" అని స్పష్టం చేశారు.

**కుంభమేళాకు మించి మేడారం ఏర్పాట్లు**

సమ్మక్క-సారలమ్మ జాతరను కుంభమేళా కంటే అద్భుతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందని మంత్రి తెలిపారు. మేడారంలో కాకతీయుల నాటి వైభవం ఉట్టిపడేలా నిర్మించిన రాతి కట్టడాలను 19వ తేదీ ఉదయం ముఖ్యమంత్రి ప్రారంభిస్తారని వెల్లడించారు. అలాగే గడువు ముగిసిన మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు త్వరలోనే ఎన్నికలు నిర్వహిస్తామని ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

## రేవంత్ టూర్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే.. రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చ

తెలంగాణ బ్యూరో ప్రతినిధి : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పర్యటనలో గులాబీ పార్టీ ఎమ్మెల్యే పాల్గొనడం రాజకీయంగా తీవ్ర చర్చకు దారితీసింది. ముఖ్యమంత్రి ఆదిలాబాద్ పర్యటనకు ఆ పార్టీ ఎమ్మెల్యేలు దూరంగా ఉండాలని బీఆర్ఎస్ అధిష్టానం అంతర్గతంగా సంకేతాలు ఇచ్చినట్లు సమాచారం. కానీ అనూహ్యంగా సీఎం రేవంత్ రెడ్డి పర్యటనలో కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ హాజరు కావడం హాట్ టాపిక్‌గా మారింది. శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించిన సదర్ మాట్ ప్రాజెక్ట్ ద్వారా జగిత్యాల జిల్లాలోని కోరుట్ల నియోజకవర్గానికి సైతం సాగునీరు అందనుంది. దీంతో భూసేకరణ నిధులతో పాటు కాలువల నిర్మాణం గురించి మంత్రి ఉత్తమ్, సీఎం రేవంత్‌ను కలిశారని చెబుతున్నారు. కాగా ఈ వ్యవహారం గులాబీ పార్టీ వర్గాల్లో చర్చకు దారి తీస్తున్నది.

## ధరణి, భూ భారతి కుంభకోణంలో 15 మంది అరెస్టు



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : తెలంగాణలో సంచలనం సృష్టించిన ధరణి, భూ భారతి కుంభకోణంలో 15 మందిని అరెస్టు చేసినట్టు వరంగల్ కమిషనర్ సన్ ప్రీత్‌సింగ్ తెలిపారు. మరో 9 మంది పరారీలో ఉన్నట్టు చెప్పారు. "ప్రధాన నిందితులుగా బసవరాజు, జెల్లా పాండుగా గుర్తించాం. జనగామ, యాదాద్రి జిల్లాల్లో గతంలో అక్రమ రిజిస్ట్రేషన్లు జరిగాయి. యాదగిరిగుట్టలోని ఆన్‌లైన్ సర్వీస్ సెంటర్ల ద్వారా మోసాలు జరిగాయి. రూ.3.90 కోట్ల ప్రభుత్వ ఆదాయానికి గండి పడింది. వెబ్‌సైట్‌లో సాంకేతిక లోపాల ఆధారంగా లూటీ చేశారు. నిందితుల నుంచి రూ.63.19లక్షల నగదు స్వాధీనం చేసుకున్నాం. నిందితుల బ్యాంక్ ఖాతాల్లోని రూ.లక్ష సీజ్ చేశాం. రూ.కోటి విలువైన ఆస్తి పత్రాలు, కారు, ల్యాప్ టాప్‌లు, డెస్క్ టాప్‌లు, సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నాం. పరారీలో ఉన్న నిందితుల కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. ధరణి- భూ భారతి కేసులో మరిన్ని అరెస్టులు జరిగే అవకాశముంది" అని సీపీ తెలిపారు.

# గోల్కొండలో అట్టహాసంగా ప్రారంభమైన హాట్ ఎయిర్ బెలూన్ ఫెస్టివల్

● లాంఛనంగా ప్రారంభించి.. విహరించిన మంత్రి జూపల్లి ● గగనతలంలో మంత్రి జూపల్లి సాహస యాత్ర
● సుమారు గంటన్నర పాటు 13 కిలోమీటర్లు విహరించిన మంత్రి జూపల్లి ● ఈ రైడ్ గొప్ప అనుభూతిని ఇచ్చిందన్న మంత్రి జూపల్లి
● పర్యాటక రంగంలో కొత్త అధ్యాయం ● సంస్కృతి -- సాంకేతికతల సమ్మేళనం ● డెస్టినేషన్ తెలంగాణ" బ్రాండ్ బలోపేతమే లక్ష్యం ● దేశీ, విదేశీ పర్యాటకులను ఆకర్షించడమే ఉద్దేశ్యం ● మంత్రి జూపల్లి కృష్ణారావు

తెలంగాణ బ్యూరో ప్రతినిధి : చారిత్రక గోల్కొండ కోట సమీపంలోని గోల్ఫ్ క్లబ్ వేదికగా హాట్ ఎయిర్ బెలూన్ ఫెస్టివల్ అట్టహాసంగా ప్రారంభమైంది. పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ వేడుకలకు శ్రీకారం చుట్టారు. ప్రారంభోత్సవం అనంతరం మంత్రి స్వయంగా హాట్ ఎయిర్ బెలూన్‌లో విహరించి సందడి చేశారు. ఆకాశ మార్గంలో సుమారు గంటన్నర సేపు 13 కిలోమీటర్లు విహరించారు. హైదరాబాద్ గోల్కొండ కోట సమీపంలోని గోల్ఫ్ క్లబ్ నుంచి ప్రారంభమైన హాట్ ఎయిర్ బలూన్ అప్పాజి గూడ శివారులో దిగింది.

ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.... తెలంగాణ పర్యాటక రంగంలో ఇదొక కొత్త అధ్యాయమని మంత్రి అభివర్ణించారు. వినూత్న ఆలోచనలకు తెలంగాణ వేదిక అని చాటిచెప్పడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. ఒకవైపు 'ఇంటర్నేషనల్ కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్ల ద్వారా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయం మరియు ఆతిథ్యాన్ని చాటుతుండగా, మరోవైపు 'హాట్ ఎయిర్ బెలూన్, డ్రోన్ ఫెస్టివఅబశ్రీశ్రీల్ల ద్వారా ఆధునిక సాంకేతికతను, భవిష్యత్తు దృక్పథాన్ని ప్రపంచానికి పరిచయం చేస్తున్నామని తెలిపారు.

డెస్టినేషన్ తెలంగాణ - ప్రపంచ పర్యాటక కేంద్రంగా.. తెలంగాణలోని సహజ సౌందర్యాన్ని, చారిత్రక వారసత్వాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. "డెస్టినేషన్ తెలంగాణ" అనే బ్రాండ్‌ను బలోపేతం చేస్తూ, కేవలం దేశీయ పర్యాటకులనే కాకుండా విదేశీ పర్యాటకులను కూడా ఆకర్షించేలా ఇటువంటి సాహసోపేత క్రీడలు (ూాంజవత్‌బతీవ ూజూశీ్‌ం) ఎంతో దోహదపడతాయని ఆయన అభిప్రాయపడ్డారు. పర్యాటకులు కేవలం సందర్శించడమే కాకుండా, ఒక గొప్ప అనుభూతిని పొందేలా వినూత్న కార్యక్రమాలను రూపొందిస్తున్నట్లు వెల్లడించారు.

ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన పర్యాటక విధానం ద్వారా పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తున్నామఅబశ్రీశ్రీని, ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షిస్తూ, భాగస్వామ్య పద్ధతిలో ప్రపంచ స్థాయి మౌలిక వసతులు, నాణ్యమైన సేవలను అందుబాటులోకి తెస్తున్నామన్నారు. ఈ అభివృద్ధి ద్వారా స్థానిక యువతకు ఉపాధి, ఆదాయ మార్గాలను పెంచడమే లక్ష్యమన్నారు.

ఇదొక అద్భుత అనుభూతి. సంప్రదాయానికి గౌరవం, సాంకేతికతకు స్వాగతం పలుకుతూ పర్యాటక రంగంలో తెలంగాణను దేశంలోనే అగ్రస్థానంలో నిలుపుతాం. నేడు ఆకాశంలో ఎగురుతున్న ఈ బెలూన్లు.. తెలంగాణ పర్యాటక రంగం ప్రపంచ స్థాయి ఎత్తులకు చేరుకోబోతోంది అనడానికి నిదర్శనం" అని మంత్రి జూపల్లి కృష్ణారావు ఆకాంక్షించారు.

కుటుంబ సభ్యులు, యువత, పిల్లలందరికీ ఈ ఫెస్టివల్ ఒక మధుర జ్ఞాపకంగా మిగిలిపోతుందని, ప్రతి ఒక్కరూ ఈ వేడుకల్లో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

హాట్ ఎయిర్ బెలూన్ ఎక్కేద్దాం - నగర అందాలను ఆకాశం నుంచి వీక్షిద్దాం

హాట్ ఎయిర్ బెలూన్ ఫెస్టివల్ ద్వారా పర్యాటకాన్ని ప్రమోట్ చేయడంతో పాటు మన తెలంగాణ వారసత్వ సంపదలైన గొప్ప గొప్ప కట్టడాలు, దేవాలయాలు, మన ప్రకృతి




రమణీయతను ఆకాశం నుంచి వీక్షించేందుకు ఇదొక గొప్ప అవకాశం. ఈ ఫెస్టివల్ ద్వారా నిరుద్యోగ యువతకు సైతం ఈ 3 రోజులు ఉపాధి దొరుకుతుంది. పైలట్లకు భవిష్యత్తులో ఉద్యోగాలు దొరికే అవకాశం ఉంటుంది. పెట్టుబడులు ఆకర్షించేందుకు సైతం ఈ కార్యక్రమం ఉపయోగపడుతుంది.

" అని తెలంగాణ రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు.

**అందుబాటులో 18కిపైగా బెలూన్స్ :** ఈ హాట్ ఎయిర్ బెలూన్లు వివిధ దేశాల నుంచి వచ్చాయని ఫెస్టివల్ నిర్వాహకులు తెలిపారు. ఫ్రాన్స్, యూకే, జర్మనీ, బెల్జియం, మెసిడోనియా, స్పెయిన్ దేశాల నుంచి 18కి పైగా బెలూన్స్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నాయని తెలిపారు. ఇది హైదరాబాద్ యువతకు ఉపాధి అవకాశాలను పెంచుతుందని, నగరవాసులకు ఇదో మంచి అవకాశమని వివరించారు. ఇలాంటివి ఎక్స్పీరియన్స్ చేయడం కోసం విదేశాలకు వెళ్లేవారని, ఇప్పుడు మన హైదరాబాద్లోనే ఆ అనుభూతి పొందవచ్చని చెప్పారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరక్టర్ క్రాంతి వల్లూరి, పర్యాటక అధికారులు పాల్గొన్నారు.

## సంతకం 'ఇంజనీర్లది.. రాత 'బినామీ'ది!



ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో : "కాలే కడుపు ఏమో ప్లాంటుది.. మేసే గడ్డి ఏమో కాంట్రాక్టరుది.. కానీ, చెమట పట్టేది మాత్రం అధికారి కలానికే! - ఏమిటది?" జవాబు: 'ఆర్ & బి' అక్రమ ఎం-బుక్ మాయాజాలం!

ప్లాంట్ నడవదు కానీ బిల్లులు పుట్టుకొస్తాయి.. కాంట్రాక్టర్ కష్టపడడు కానీ కోట్లు కురుస్తాయి.. కానీ వీటన్నింటికీ బాధ్యత వహించాల్సిన అధికారి మాత్రం, సైట్‌కు వెళ్లకుండానే ఎం-బుక్ నిండుగా రికార్డింగ్లు రాస్తూ 'కలంతో చెమట' పట్టిస్తున్నాడు. నిబంధనల ప్రకారం ఉండాల్సిన వర్క్ హిస్టరీ, అగ్రిమెంట్ రిజిస్టర్లను బూజు పట్టించి, కేవలం కమీషన్ల కోసం ప్రజాధనాన్ని బలిపీఠం ఎక్కిస్తున్నారు. ఆ అక్రమ బంధం వెనుక ఉన్న సాంకేతిక ఆధారాల ఉమ్మడి గోదావరి జిల్లాల లో కొందరు ఇంజనీర్ల అవినీతిపై ప్రత్యేక నివేదిక ఇది..

ఎం-బుక్ మాయాజాలం: ఫోరెన్సిక్ ఉచ్చులో 'ఘోస్ట్ రైటింగ్'!

ఈ కుంభకోణంలో అత్యంత కీలకమైన అంశం చేతిరాతలు. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్మెంట్ కోడ్ లో పేరాగ్రాఫ్ 288 ప్రకారం ఎం-బుక్ లో ప్రతి అక్షరం, ప్రతి అంకె అధికారి స్వయంగా తన చేతిరాతతోనే రాయాలి.

బినామీ రాతలు: క్షేత్రస్థాయిలో కొలతలు తీయకుండానే, కాంట్రాక్టర్ల ఆఫీసుల్లో పని చేసే క్లర్కులతో ఎం-బుక్స్ రికార్డింగ్ చేయిస్తూ, బాధ్యత లేని కొందరు ఇంజనీరింగ్ అధికారులు కేవలం 'సంతకాలు' పెడుతున్నారు. సంతకాలు అధికారులవే కావొచ్చు.. కానీ రాతలు పరాయి వ్యక్తులవి! ఈ ఒక్క అంశంపై ఫోరెన్సిక్ విచారణ జరిగితే, ఈ అవినీతి రాకెట్ సెకన్లలో కుప్పకూలుతుంది. ఇది దీమీ సెక్షన్ 336 (ఫోర్జరీ) కింద నాన్-బైలబుల్ నేరం.

అటకెక్కిన కీలక రిజిస్టర్లు: చట్టబద్ధమైన నిబంధనలకు పాతర!

డి.ఇ , ఇ.ఇ , ఎస్.ఇ స్థాయి అధికారులు రిజిస్టర్లను నిర్వహించడంలో ఉద్దేశపూర్వకంగా ఉదాసీనత ప్రదర్శిస్తున్నారు. ఏపీ ఫైనాన్షియల్ కోడ్ ఆర్టికల్ 273 ,292 మరియు ఏపీ పీడబ్ల్యుడి కోడ్ పేరాగ్రాఫ్ 324 ప్రకారం ప్రతి పనికి సంబంధించిన రికార్డులను పక్కాగా నిర్వహించాలి.

నిబంధనల ఉల్లంఘన ఎం-బుక్ చెక్ మెజర్మెంట్ రిజిస్టర్, టెండర్ రిజిస్టర్, సాంక్షన్ ఎస్టిమేట్ రిజిస్టర్లు, అగ్రిమెంట్ రిజిస్టర్ల నిర్వహణ తప్పనిసరి. కానీ ఇక్కడ ఏ ఒక్క రిజిస్టర్ కూడా అప్‌డేట్‌గా లేకపోవడం గమనార్హం. ఉన్నతాధికారులు తనిఖీలకు వచ్చినప్పుడు ఈ రికార్డులను పరిశీలించడం ద్వారా వాస్తవాలు బయటపడతాయని తెలిసి, అధికారులు వీటిని బూజు పట్టించారు.

ఫీల్డ్ డైరీల 'లీకు': పర్యటన ఒకటి.. రికార్డింగ్ మరొకటి! అధికారులు ప్రతిరోజూ ఎక్కడ తనిఖీలు చేశారు, ఏయే పనులు పర్యవేక్షించారో వారి 'ఫీల్డ్ ఇన్-సెక్షన్ డైరీ' లో నమోదు చేయాలి.

తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ
NIT.No. HMA/DEV/CE/43/2025-26 Date: 16.01.2026
https://tender.telangana.gov.in
DIPR RO No.13741 PP/CL/Advt/1/2024-25, Dt: 16.01.2026
HMDA

# సంపాదకీయం

suryaeditpage@gmail.com

## శాస్త్రీయ దృష్టికోణం - విద్యారంగం పాత్ర...

ప్రపంచం ఆధునికంగా కనిపిస్తుందంటే, మరింత ముందుకు దూసుకు పోతుందంటే, దీనికి ప్రధాన కారణం " విజ్ఞాన ఆవిష్కరణలు" తప్ప మరేదీ కాదు. ఇది మాత్రమే కాకుండా, సమాజ అభివృద్ధికి అత్యవసరమైన మరో ముఖ్య అంశం "శాస్త్రీయ దృష్టికోణం" (సైంటిఫిక్ టెంపర్మెంట్). ఇది కేవలం విజ్ఞాన శాస్త్రాలను చదవడం మాత్రమే కాదు, చదివిన సమాచారాన్ని ఆలోచించడం, ప్రశ్నించడం, విశ్లేషించడం, ఆధారాలు (సాక్ష్యాలు) కోరడం, తార్కికంగా (లాజికల్‌గా) నిర్ణయాలు తీసుకోవడం వంటి సమగ్ర ప్రక్రియలను కలిగి ఉంటుంది. భారత రాజ్యాంగంలోని 51ఏ (హెచ్) ప్రకారం, ప్రతి పౌరుడు శాస్త్రీయ దృష్టిని అలవాటు చేసుకోవడం ప్రాథమిక కర్తవ్యంగా పేర్కొనబడింది. ఈ దృష్టికోణం సమాజాన్ని అజ్ఞానం, మూఢనమ్మకాల నుండి విముక్తి చేసి, సమస్య పరిష్కారాల వైపు మరియు కొత్త ఆవిష్కరణలు (ఇన్నోవేషన్లు) వైపు ముందుకు నడిపిస్తుంది. విద్యారంగం ఇక్కడ చాలా కీలక పాత్ర పోషిస్తుంది. ఎందుకంటే విద్యార్థులు లేదా యువతను ఈ దృక్పథంలో అలవాటు చేయడం ద్వారా మాత్రమే దేశం ఆధునిక సవాళ్లను ఎదుర్కోగలదు.ఉదాహరణకు, వాతావరణ మార్పులు (క్లైమేట్ చేంజ్), డిజిటల్ మిస్‌ఇన్ఫర్మేషన్ (తప్పుడు సమాచారం) వంటి సమస్యలను తార్కిక ఆలోచన లేకుండా పరిష్కరించలేము. 2026 లో, భారతదేశం వంటి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో, ఈ దృక్పథం లేకపోతే, సాంకేతిక పురోగతిని (టెక్నాలజికల్ అడ్వాన్స్‌మెంట్) కూడా సమర్థవంతంగా ఉపయోగించుకోలేము. శాస్త్రీయ దృష్టికోణం అనేది మూఢ విశ్వాసాలకు బదులుగా తార్కికతను (లాజిక్) ఆధారంగా చేసుకుని ఆలోచించడం. వదంతులు, అబద్ధ ప్రచారాలను (రూమర్స్, ఫేక్ న్యూస్) నమ్మేముందు సాక్ష్యాలను ఆధారాలను (ఎవిడెన్స్) తనిఖీ చేయడం. సమస్యలను విచారణాత్మకంగా (ఇన్వెస్టిగేటివ్‌గా) పరిశీలించి పరిష్కారాలను అన్వేషించడం. కొత్త ఆలోచనలను ఆహ్వానించే మరియు పరిశీలించే వృత్తిత్వం (పర్సనాలిటీ) కలిగి ఉండటం, బేధాభిప్రాయాలపై (డిఫరెంట్ ఒపీనియన్స్) సామరస్యంగా చర్చించే ధోరణి (అటిట్యూడ్) వంటివి దీని ముఖ్య లక్షణాలు. క్లుప్తంగా చెప్పాలంటే, "సత్యం, ఆధారాలతో (ఎవిడెన్స్‌తో) నిరూపించబడినదే" అని అంగీకరించడమే సైంటిఫిక్ మెథడ్‌లో ఆలోచించడమే శాస్త్రీయ దృష్టికోణం.అందరూ ఈ మనస్తత్వం, జీవన విధానం (లైఫ్‌స్టైల్) అలవరచుకుని, ప్రపంచాన్ని ప్రశ్నించడం, తప్పుల నుండి నేర్చుకోవడం (లెర్నింగ్ ఫ్రం మిస్టేక్స్) అనే స్వభావాన్ని కలిగి ఉండటం. ఎందుకంటే ఇది సమాజాన్ని మూఢత్వం (సూపర్‌స్టిషన్స్) నుండి దూరంగా ఉంచుతూ, ఆలోచనాత్మక (క్రిటికల్ థింకింగ్) వైఖరితో ఉంచుతుంది. ఉదాహరణకు, ఒక సాధారణవ్యక్తి ఒక వార్తను చదివినప్పుడు, దాని మూలాన్ని, ఆధారాలను తనిఖీ చేస్తూ, వివిధ మూలాల నుండి ధ్రువీకరించడం ద్వారా మాత్రమే సత్యాన్ని గుర్తించగలడు.శాస్త్రీయ దృష్టికోణం ఇపుడు ఎందుకు అత్యవసరం? : ఆధునికసమాజం శాస్త్రీయ దృక్కోణం లేకుండా నిలబడలేదు. సామాజిక మాధ్యమాలు, సందేశ ఫార్వర్డింగ్ సంస్కృతి వల్ల తప్పుడు సమాచారం క్షణాల్లోనే అంతటా వ్యాపిస్తోంది. 'డీప్‌ఫేక్', 'ఏఐ ఫాబ్రికేషన్స్', 'తప్పుడు వైద్య సలహాలు' వంటి సమస్యలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. 2025 చివర నాటికి భారతదేశంలో ఇంటర్నెట్ వినియోగదారుల సంఖ్య సుమారు 103 కోట్లు (సుమారు 70 శాతం జనాభా), సామాజిక మాధ్యమాల వినియోగదారులు సుమారు 50 కోట్లు (34 శాతం జనాభా). ఇది తప్పుడు సమాచార వ్యాప్తికి కూడా అనుకూల వాతావరణాన్ని సృష్టించింది.

యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్ బుక్ తదితర సామాజిక మాధ్యమాల్లో, వ్యూస్ కోసం కొందరు తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారు. చూసే వారికి ఇది ఒక వ్యసనంలా మారి, చూసిన ప్రతిదీ నిజమేనన్న భ్రమలో పడుతున్నారు. ఈ మిస్‌ఇన్ఫర్మేషన్ అల్గోరిథమ్స్, కుటుంబ జీవితాలను, సామాజిక స్థిరత్వాన్ని మరియు ఎన్నికలను కూడా ప్రభావితం చేస్తోంది. ఈ నేపథ్యంలో సమాచార నిజనిజాలను గుర్తించడానికి శాస్త్రీయ దృష్టికోణం తప్పనిసరి. ఎందుకంటే ఇది వాస్తవాలను ఆధారాలతో పరిశీలించే అలవాటును పెంపొందిస్తుంది.పర్యావరణ సంక్షోభం (ఎన్విరాన్‌మెంటల్ క్రైసిస్), వాతావరణ మార్పులు, ప్రజా ఆరోగ్యం, డిజిటల్ సెక్యూరిటీ వంటివి శాస్త్రీయ అవగాహనతోనే పరిష్కరించగలవు. ఉదాహరణకు, 'ఇంటర్ గవర్నమెంటల్ ప్యానెల్ ఆన్ క్లైమేట్ చేంజ్ 'రిపోర్ట్లు, డేటా ఆధారంగా వాతావరణ మార్పును అర్థం చేసుకోవాలి. ఇక్కడ తార్కిక దృష్టి లేకపోతే, మూఢనమ్మకాలు సమస్యను మరింత తీవ్రతరం చేసి ప్రజల్లో ఆందోళన కలిగిస్తాయి. టీకాలు (వ్యాక్సినేషన్), ఔషధాల విషయంలో అపోహలు (మిత్స్) నేటికీ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నాయి. కోవిడ్-19 మహమ్మారి తర్వాత, ఫేక్ మెడికల్ అడ్వైస్ వల్ల ప్రాణాలు కోల్పోయిన సంఖ్య లక్షల్లో ఉంది. ఆధునిక మెడిసిన్ పట్ల అనవసరభయాలు లేదా మాయలు మంత్రాలపై అతిగా నమ్మకం వల్ల ప్రాణహాని సంభవిస్తుంది. శాస్త్రీయ దృష్టి మాత్రమే ఆరోగ్య విధానాలను బలోపేతం చేస్తుంది.భారతదేశం ప్రపంచంలో మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థగా ఉంది. 2025 చివరి నాటికి 2 లక్షలకు పైగా డీపీఐటీ గుర్తింపు పొందిన స్టార్టప్‌లు ఉన్నాయి. ఇవి 21 లక్షలకు పైగా ఉద్యోగాలను సృష్టించాయి. ఇందులో ఆలోచన, పరిశోధన, ప్రయోగాలు శాస్త్రీయ ధోరణి కీలకం. ఇది కృత్రిమ మేధస్సు (ఏఐ), పర్యావరణ నుకూల సాంకేతికత (గ్రీ టెక్ ) వంటి రంగాల్లో ఆర్థిక వృద్ధికి దోహదపడుతుంది. శాస్త్రీయ దృష్టికోణాన్ని అందరిలో పెంచడంలో విద్యారంగం పాత్ర అత్యంత ముఖ్యం. జాతీయ విద్యా విధానం 2020 (నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ 2020)లో, ఎంక్వైరీ బేస్డ్ లెర్నింగ్ (పరిశోధన ఆధారిత నేర్చుకోవడం), క్రిటికల్ థింకింగ్ (విమర్శనాత్మక ఆలోచన), విజ్ఞాన పరిశోధన (సైంటిఫిక్ ఇన్‌క్వైరీ) మొదలగిన పద్ధతులపై ప్రత్యేక దృష్టి పెట్టారు. 2026 నాటికి 5౦3౦3౦4 పాఠ్యాంశ నిర్మాణం దేశవ్యాప్తంగా దశలవారీగా అమలవుతోంది. ఇది విద్యార్థులను పాఠం నేర్చుకోవడం, ఆలోచించడం, ప్రశ్నించడం, ప్రయోగించడం వైపు నడిపిస్తుంది. భౌతికశాస్త్ర పాఠాల్లో నిజసమయ ప్రయోగాలు (రియల్-టైమ్ ఎక్స్‌పెరివెట్లు), వర్చువల్ ల్యాబ్‌లు జోడించడం ద్వారా తార్కికత పెరుగుతుంది.ఉపాధ్యాయులు కేవలం పుస్తకం చదివించడమే కాకుండా, ప్రయోగాలు చేయించడం, విద్యార్థులచే ప్రశ్నలు వేయించడం, సమస్యలకు విజ్ఞాన పరమైన సమాధానాలు (సైంటిఫిక్ సొల్యూషన్స్) కనుగొనేందుకు అవకాశాలు కల్పించడం ద్వారా మార్గదర్శక పాత్ర పోషించాలి. విద్యార్థుల్లో స్వాభావిక కుతూహలాన్ని (క్యూరియాసిటీ) రేకెత్తించేందుకు ఉపాధ్యాయులు "ఫెసిలిటేటర్స్ "గా మారాలి. సైన్స్ ల్యాబ్‌లు, రోబోటిక్స్ క్లబ్‌లు, మేకర్ స్పేస్‌లు,సైన్స్ ఫెయిర్స్ వంటివి విద్యార్థుల్లో పరిశోధనా శక్తిని (రీసెర్చ్ స్కిల్స్) పెంచుతాయి. 2025 జులై నాటికి, దేశవ్యాప్తంగా దాదాపు 26-27 సైన్స్ సెంటర్లు, సైన్స్ సిటీలు స్థాపించబడ్డాయి. ఇవి దేశంలోని వివిధ రాష్ట్రాల్లో విద్యార్థులకు ఇంటరాక్టివ్ లెర్నింగ్ అనుభవాలు అందిస్తున్నాయి. విద్యాసంస్థలు నేడు విద్యార్థులకు కేవలం విజ్ఞానాన్ని బోధించడమే కాదు, తప్పుడు వార్తలను (ఫేక్ న్యూస్) గుర్తించడం, వాస్తవాలను పరిశీలించడం, సోషల్ మీడియా బాధ్యతాయుత వినియోగం (రెస్పాన్సిబుల్ సోషల్ మీడియా యూస్) వంటి అంశాలను కూడా బోధించాలి. వాతావరణ మార్పులు, నీటి సంరక్షణ (వాటర్ కన్జర్వేషన్), ప్లాస్టిక్ వినియోగ నియంత్రణ వంటి అంశాల్లో విద్యార్థుల భాగస్వామ్యం వారిలో తార్కిక ఆలోచనను పెంచుతుంది. ఉదాహరణకు, స్కూల్ ప్రాజెక్టుల ద్వారా విద్యార్థులు స్థానిక పర్యావరణ సమస్యలను సర్వే చేసి, డేటా ఆధారంగా సొల్యూషన్స్ సూచించవచ్చు.పరీక్షలకు బట్టి పట్టి చదువుకునే విధానానికి బదులుగా, అర్థం చేసుకుని అన్వయించుకునే (అప్లైయింగ్) విధానం ఇపుడు అవసరం. ఎన్ఈపీ 2020 రోట్ లెర్నింగ్‌ను తగ్గించి, ఎక్స్‌పీరియెన్షియల్ లెర్నింగ్, క్రిటికల్ థింకింగ్, డిస్కషన్-బేస్డ్ లెర్నింగ్ వంటివాటిపై ఎక్కువ దృష్టి సారించాలని సూచిస్తుంది. ఈ మార్పులు 2025 నాటికి ప్రధాన కరిక్యులమ్ రిఫార్మ్స్‌లో భాగంగా అనేక రాష్ట్రాల్లో అమలవుతున్నాయి. ఈ పద్ధతి విద్యార్థుల్లో సృజనాత్మకతను (క్రియేటివిటీ) పెంచుతుంది. విద్యార్థి దశ నుంచే ప్రయోగాత్మక శిక్షణ (ఎక్స్‌పెరిమెంటల్ ట్రైనింగ్), ప్రాజెక్ట్ బేస్డ్ లెర్నింగ్ అవసరం. ఉదాహరణకు, ప్రైమరీ స్కూళ్లలో సింపుల్ సైన్స్ కిట్స్ ఉపయోగించడం ద్వారా ఆసక్తి పెరుగుతుంది. నిజానికి, నిజ జీవితానికి (రియల్ లైఫ్) దగ్గరగా ఉండే విద్యా పద్ధతి (ప్రాక్టికల్ ఎడ్యుకేషన్) మాత్రమే శాస్త్రీయ దృష్టికోణాన్ని బలోపేతం చేస్తుంది. సైన్స్ పుస్తకాలు కథలు (సైన్స్ స్టోరీ బుక్స్), శాస్త్రవేత్తల జీవిత చరిత్రలు (బయోగ్రఫీస్ ఆఫ్ సైంటిస్ట్స్, ఉదా., ఏ.పి.జె. అబ్దుల్ కలాం), పరిశోధన ఆధారిత రచనలు (రీసెర్చ్ బేస్డ్ రైటింగ్) విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తిని పెంచుతాయి.విద్యాసంస్థలు తల్లిదండ్రులకు కూడా శాస్త్రీయ దృష్టి అవసరాన్ని తెలియజేయాలి. పిల్లల 'ఎందుకు?' అనే ప్రశ్నలకు సమాధానం ఇవ్వడం ఒక కుటుంబ సంస్కృతిగా (ఫ్యామిలీ కల్చర్) మారాలి. వర్క్‌షాప్‌లు, పేరెంట్ ట్రైనింగ్ సెషన్ల ద్వారా ఇది సాధ్యమే.

ముక్తాయింపుగా, శాస్త్రీయ దృష్టికోణం అనేది ఆధునిక సమాజం అభివృద్ధికి ప్రాణాధారం. మారుతున్న ప్రపంచం సవాళ్లను ఎదుర్కోవడానికి పౌరులందరికీ తార్కిక ఆలోచన, విచారణా దృష్టి (ఇన్వెస్టిగేటివ్ వ్యూ), పరిశోధనా శక్తి (రీసెర్చ్ అబిలిటీ) అవసరం. ఈ లక్ష్యాన్ని సాధించడంలో విద్యారంగం పాత్ర అత్యంత కీలకం. జ్ఞానం ప్రశ్నతోనే ప్రారంభమౌతుంది.ఆ ప్రశ్నలకు శాస్త్రీయ దృష్టికోణమే సరైన దారి చూపుతుంది. విద్యారంగం ఈ దిశగా ముందుకు సాగితే, భారతదేశం శాస్త్రీయ ఆలోచనలతో (సైంటిఫిక్ థింకింగ్) మరింత ఆధునికంగా, స్థిరంగా మారుతుంది.

పాఠకులు, విశ్లేషకులు, రచయితలు తమ రచనలు క్రింది చిరునామాకు గానీ సూర్య దినపత్రిక ఎడిటోరియల్ మెయిల్ ఐడికి గానీ పంపవలసినదిగా మనవి మెయిల్ :
suryaeditpage@gmail.com

SPR publications, Surya Soudha, Plot.No: 185, M.C.H. NO.258/1/185, siddi vinayaka nagar, Ayyappa Society Opp: Hi-Tech City, Hyderabad - 500 072.

# భారత రసాయన రంగానికి చైనా సెగ!



- ఔషధ రంగానికి అవసరమైన ముడి పదార్థాలు అందచేత
- వ్యవవసాయరంగానికి ఎరువుల వరకు అన్నింటినీ అందించేది ఈ రంగమే
- అంతర్జాతీయ మార్కెట్లలో చోటుచేసుకుంటున్నపెను మార్పులు
- చైనా చౌక ధరల పోటీని తట్టుకోలేక వెనుకబడుతు భారతీయ మార్కెట్‌లు
- ఆదాయ వృద్ధిలో గణనీయమైన తగ్గుదల దిశగా భారత రసాయన కంపెనీలు

**తేజస్విని**
**హైదరాబాద్**

భారతదేశ ఆర్థిక వ్యవస్థలో రసాయన పరిశ్రమ ఒక వెన్నెముక వంటిది. ఔషధ రంగానికి అవసరమైన ముడి పదార్థాల నుండి వ్యవసాయానికి కావలసిన ఎరువుల వరకు అన్నింటినీ ఈ రంగమే అందిస్తోంది. అయితే, ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్లలో చోటుచేసుకుంటున్న మార్పులు ఈ పరిశ్రమను తీవ్రమైన ఒత్తిడికి గురిచేస్తున్నాయి. గత ఏడాది కాలంగా భారత రసాయన కంపెనీలు తమ ఆదాయ వృద్ధిలో గణనీయమైన తగ్గుదలని నమోదు చేస్తున్నాయి. ప్రముఖ బ్రోకరేజ్ సంస్థ నువామా ఇన్‌స్టిట్యూషనల్ ఈక్విటీస్ తాజా నివేదిక ప్రకారం.. చైనా నుండి వెల్లువెత్తుతున్న చౌక దిగుమతులు, అంతర్జాతీయంగా తగ్గిన డిమాండ్ మరియు పెరుగుతున్న ముడిచమురు ధరలు భారత కెమికల్ పరిశ్రమను తీవ్ర ఒత్తిడిలోకి నెట్టాయి.

ముఖ్యంగా చైనా దేశం నుండి వస్తున్న అడ్డూఅదుపు లేని దిగుమతులు మరియు ముడిచమురు ధరలలో పెరుగుదల భారతీయ తయారీదారులకు గట్టి పోటీని ఇస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ తగ్గడం వల్ల ఎగుమతులపై ఆధారపడిన భారత కంపెనీలు తమ మార్కెట్ వాటాను కాపాడుకోవడానికి కష్టపడుతున్నాయి. ముదురుతున్న ఈ సంక్షోభం కేవలం ఒకే రకమైన రసాయనాలకు పరిమితం కాలేదు. ఇది పారిశ్రామిక రసాయనాల నుండి రోజువారీ వినియోగ వస్తువుల వరకు అన్నింటిపై ప్రభావం చూపుతోంది. ఈ పరిస్థితుల నుండి గట్టెక్కడానికి భారత ప్రభుత్వం మరియు పరిశ్రమ వర్గాలు తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఈ సంక్షోభానికి గల ప్రధాన కారణాలను మరియు దాని ప్రభావాలను ఈ క్రింది విభాగాల్లో వివరంగా తెలుసుకుందాం.

చైనా నుండి అదనపు నిల్వలు, ఆధిపత్యం:
చైనా ప్రపంచవ్యాప్తంగా రసాయనాల ఉత్పత్తిలో అగ్రస్థానంలో ఉంది. ప్రస్తుతం ఆ దేశంలో అంతర్గత డిమాండ్ తగ్గడంతో, అక్కడ ఉత్పత్తి అవుతున్న అదనపు రసాయన నిల్వలు ప్రపంచ మార్కెట్లను ముంచెత్తుతున్నాయి. చైనా కంపెనీలు తమ నిల్వలను వదిలించుకోవడానికి చాలా తక్కువ ధరలకు ఇతర దేశాలకు విక్రయిస్తున్నాయి. దీనివల్ల భారతీయ కంపెనీలు తమ ధరలను తగ్గించుకోక తప్పడం లేదు, ఫలితంగా వారి లాభాలు దారుణంగా పడిపోతున్నాయి.

నువామా నివేదిక ప్రకారం, చైనా ప్రభుత్వ మద్దతు ఉన్న కంపెనీలు నష్టాల్లో ఉన్నప్పటికీ ఉత్పత్తిని ఆపడం లేదు. ఇది అంతర్జాతీయంగా రసాయనాల సరఫరా మరియు డిమాండ్ మధ్య సమతుల్యతను దెబ్బతీస్తోంది. భారతీయ తయారీదారులు నాణ్యమైన ఉత్పత్తులు తయారు చేస్తున్నప్పటికీ, చైనా నుండి వస్తున్న చౌక ధరల పోటీని తట్టుకోలేక మార్కెట్‌లో వెనుకబడుతున్నారు. ముఖ్యంగా ప్లాస్టిక్ మరియు పారిశ్రామిక రసాయనాల విభాగంలో ఈ ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది.

**ముడిచమురు ధరలు, ముడి పదార్థాల ఖర్చు:** రసాయన పరిశ్రమకు ముడిచమురు మరియు సహజ వాయువు అత్యంత ముఖ్యమైన ఆధారాలు. రసాయనాల తయారీకి వాడే నాఫ్తా మరియు ఇతర ముడి పదార్థాల ధరలు నేరుగా ముడిచమురు ధరలపై ఆధారపడి ఉంటాయి. ప్రపంచవ్యాప్తంగా భౌగోళిక రాజ కీయ ఉద్రిక్తతల వల్ల చమురు ధరలు నిలకడలేకుండా మారుతున్నాయి. ఈ అనిశ్చితి వల్ల భారత కంపెనీలకు తయారీ ఖర్చులు భారీగా పెరుగుతున్నాయి.

ఒకవైపు చైనా పోటీ వల్ల అమ్మకపు ధరలను పెంచలేక, మరోవైపు ముడి పదార్థాల కోసం ఎక్కువ వెచ్చించాల్సి రావడంతో కంపెనీలు ఇరకా టంలో పడ్డాయి. ఈ వ్యయాల పెరుగుదల వల్ల కంపెనీల నిర్వహణ సామర్థ్యం తగ్గిపోతోంది. ముఖ్యంగా ఇంధన వినియోగం ఎక్కువగా ఉండే భారీ రసాయన పరిశ్రమలు ఈ ధరల పెరుగుదల వల్ల తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. దీనివల్ల నూతన పెట్టుబడులు పెట్టడానికి కూడా కంపెనీలు వెనుకాడవలసి వస్తోంది.

**అంతర్జాతీయ మార్కెట్లలో తగ్గిన డిమాండ్:** యూరప్, అమెరికా వంటి అభివృద్ధి చెందిన దేశాల్లో ఆర్థిక మందగమనం వల్ల రసాయనాలకు డిమాండ్ గణ నీయంగా తగ్గింది. భారత రసాయన కంపెనీలు తమ ఉత్పత్తులలో అధిక భాగాన్ని ఈ దేశాలకే ఎగుమతి చేస్తాయి. కానీ అక్కడ నిర్మాణ రంగం మరియు వాహన రంగం మందగించడంతో ఎగుమతులు క్షీణించాయి. దీంతో భారత కంపెనీల వద్ద ఉన్న నిల్వలు పేరుకుపోయి, ఆదాయం తగ్గడానికి కారణవ-ువుతున్నాయి.

అంతేకాకుండా, అంతర్జాతీయ కంపెనీలు తమ వద్ద ఉన్న పాత నిల్వలను వదిలించుకునే ప్రక్రియను కొనసాగిస్తుండటం వల్ల కొత్త ఆర్డర్లు రావడం లేదు. వ్యవసాయ రంగంలో వాడే క్రిమిసంహారకాలు మరియు ఇతర రసాయనాల ఎగుమతులు కూడా ఆశించిన స్థాయిలో లేవు. ఈ పరిస్థితి మరికొన్ని త్రైమాసికాల వరకు కొనసాగే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రపంచ మార్కెట్లలో సాధారణ స్థితి నెలకొంటేనే భారత రసాయన రంగం మళ్ళీ పుంజుకోగలదు.

రూపాయి విలువ, కరెన్సీ హెచ్చుతగ్గులు:
అమెరికన్ డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి విలువలో వస్తున్న మార్పులు కూడా ఎగుమతిదారులపై ప్రభావం చూపుతున్నాయి. రూపాయి విలువ బలంగా ఉన్నప్పుడు ఎగుమతుల ద్వారా వచ్చే ఆదాయం తగ్గుతుంది. ప్రపంచవ్యాప్తంగా రసాయనాల ధరలు ఇప్పటికే తక్కువగా ఉన్న తరుణంలో, కరెన్సీ మార్పిడి వల్ల వచ్చే నష్టాలు కంపెనీలను మరింత కుంగదీస్తున్నాయి. దీనివల్ల అంతర్జాతీయ మార్కెట్‌లో ఇతర దేశాల పోటీని తట్టుకోవడం భారత్‌కు కష్టమవుతోంది.

నువామా విశ్లేషణ ప్రకారం, ఎగుమతులపై ఎక్కువగా ఆధారపడే స్పెషాలిటీ కెమికల్ కంపెనీలు ఈ కరెన్సీ రిస్క్ వల్ల ఎక్కువగా ప్రభావితమవుతున్నాయి. దిగుమతి చేసుకునే ముడి పదార్థాల ఖర్చు డాలర్లలో చెల్లించాల్సి రావడంతో, రూపాయి బలహీనపడితే ఆ ఖర్చు మరింత పెరుగుతుంది. ఇలా రెండు వైపులా కరెన్సీ హెచ్చుతగ్గుల వల్ల కంపెనీల ఆర్థిక ప్రణాళికలు తారుమారవుతున్నాయి. ఈ ఆర్థిక అనిశ్చితి పెట్టుబడిదారులలో కూడా ఆందోళన కలిగిస్తోంది.

**ప్రభుత్వ విధానాలు - రక్షణ చర్యల ఆవశ్యకత:** చైనా నుండి జరుగుతు న్న అడ్డూఅదుపు లేని దిగుమతులను అడ్డుకోవడానికి భారత ప్రభుత్వం కఠినమైన వాణిజ్య నిబంధనలను అమలు చేయాల్సిన తరుణం ఆసన్న మైంది. ఇతర దేశాల నుండి చౌకగా వస్తున్న రసాయనాలపై అదనపు పన్నులు విధించడం ద్వారా స్వదేశీ కంపెనీలకు కొంత ఊరట లభిస్తుం ది. ఇప్పటికే కొన్ని రకాల రసాయ నాలపై ప్రభుత్వం ఆంక్షలు విధించినప్పటికీ, వాటి పరిధిని మరిన్ని ఉత్పత్తులకు విస్తరించాలని పరిశ్రమ వర్గాలు బలంగా కోరుతున్నాయి. దీనివల్ల దేశీయ మార్కెట్‌లో ఆరోగ్యకరమైన పోటీ నెలకొనడానికి అవకాశం ఉంటుంది. అంతేకాకుండా, రసాయన రంగాన్ని ప్రోత్సహించడానికి ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకాలను మరింత బలోపేతం చేయవలసిన అవసరం ఉంది. మౌలిక సదుపాయాల కల్పన మరియు పరిశోధనలకు రాయితీలు ఇవ్వడం ద్వారా కంపెనీలు తమ తయారీ వ్యయాన్ని తగ్గించుకోగలవు. స్వయం సమృద్ధి సాధించడం ద్వారా విదేశీ దిగుమతులపై ఆధారపడటం తగ్గుతుంది, ఇది దీర్ఘకాలంలో భారత రసాయన రంగాన్ని ప్రపంచ స్థాయి పోటీకి సిద్ధం చేస్తుంది. ప్రభుత్వ మద్దతు తోడైతేనే ఈ రంగం ప్రస్తుత గండం నుండి సురక్షితంగా బయటపడగలదు.

**పరిశోధన, అభివృద్ధిపై పెట్టుబడులు :** సాధారణ రసాయనాల తయారీలో చైనా వంటి దేశాలతో ధరల విషయంలో పోటీ పడటం భారత్‌కు సవాలుగా మారింది. అందుకే భారత కంపెనీలు ఇప్పుడు ప్రత్యేక రసాయనాల తయారీపై దృష్టి సారించవలసి ఉంది. వినియో గదారుల అవసరాలకు అనుగుణంగా కొత్త రకాల రసాయనాలను కనిపెట్టడానికి పరిశోధన మరియు అభివృద్ధి విభాగాలలో భారీగా పెట్టుబడులు పెట్టాలి. ఆధునిక సాంకేతికతను జోడించి ఉత్పత్తుల నాణ్యతను పెంచడం ద్వారా అంతర్జాతీయ మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయించే అవకాశం ఉంటుంది.

రసాయన కంపెనీలు తమ తయారీ ప్రక్రియలో వ్యర్థాలను తగ్గించి, పర్యావరణహితమైన పద్ధతులను అవలంబించడం ద్వారా ప్రపంచ స్థాయి ప్రమాణాలను అందుకోవచ్చు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా పర్యావరణ అనుకూల రసాయనాలకు డిమాండ్ పెరుగుతోంది, ఈ అవకాశాన్ని భారత కంపెనీలు అందిపుచ్చుకోవాలి. కేవలం ఉత్పత్తిపైనే కాకుండా నూతన ఆవిష్కరణలపై దృష్టి పెట్టిన కంపెనీలే ఈ క్లిష్ట సమయంలో నిలదొక్కుకోగలవు. పరిశోధనల ద్వారా వచ్చే కొత్త ఉత్పత్తులు కంపెనీల ఆదాయ వృద్ధికి కొత్త మార్గాలను చూపుతాయి.

**మౌలిక సదుపాయాలు - లాజిస్టిక్స్ సవాళ్లు:** భారతదేశంలో రసాయ నాల రవాణా మరియు నిల్వకు సంబంధించిన ఖర్చులు ఇతర దేశాలతో పోలిస్తే ఎక్కువగా ఉన్నాయి. నౌకాశ్రయాల వద్ద జాప్యం మరియు రవాణా సౌకర్యాల కొరత వల్ల ఎగుమతిదారులకు అదనపు భారం పడుతోంది. ముడి పదార్థాలను దిగుమతి చేసుకోవాల న్నా లేదా తుది ఉత్పత్తులను ఎగుమతి చేయాలన్నా సమర్థవంతమైన రవాణా వ్యవస్థ లేకపోవడం ఒక పెద్ద లోపంగా మారింది. ఈ వ్యయాలను తగ్గించగలిగితే భారతీయ ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్‌లో తక్కువ ధరకే లభ్యమవుతాయి.ప్రభుత్వం చేపడుతున్న పారిశ్రామిక నడవాలు మరియు ప్రత్యేక ఆర్థిక మండలిల నిర్మాణం ఈ సమస్యకు కొంతవరకు పరిష్కారం చూపగలవు. రసాయన పరిశ్రమల కోసం ప్రత్యేక క్లస్టర్లను ఏర్పాటు చేయడం ద్వారా వనరులను సమర్థవంతంగా వాడుకోవచ్చు. విద్యుత్ మరియు నీటి సరఫరా వంటి కనీస వసతులను తక్కువ ధరకే అందించడం ద్వారా తయారీదారులపై భారం తగ్గుతుంది. మౌలిక సదుపాయాల మెరుగుదల రసాయన రంగం పుంజుకోవడంలో కీలక పాత్ర పోషిస్తుంది.

**భవిష్యత్తు అంచనాలు:** నువామా నివేదిక ప్రకారం, భారత రసాయన రంగం కోలుకోవడానికి మరికొంత సమయం పట్టవచ్చు. ప్రపంచవ్యా ప్తంగా ఆర్థిక పరిస్థితులు మెరుగుపడి, చైనా నుండి వస్తున్న సరఫరా తగ్గినప్పుడు మాత్రమే ధరలు స్థిరపడతాయి. అప్పటి వరకు కంపెనీలు తమ నిర్వహణ వ్యయాలను తగ్గించుకుంటూ ఆర్థిక క్రమశిక్షణ పాటించ్డం అవసరం. ఇన్వెస్టర్లు కూడా స్వల్పకాలిక నష్టాలను చూసి ఆందోళన చెందకుండా, దీర్ఘకాలిక వృద్ధిపై నమ్మకంతో ఉండాలి.

భారత రసాయన రంగం ఎదుర్కొంటున్న సవాళ్లు తాత్కాలికమే అయి నప్పటికీ, అవి నేర్పే పాఠాలు భవిష్యత్తుకు మార్గదర్శకాలుగా ఉంటాయి. కేవలం ధరలపై ఆధారపడకుండా నాణ్యత మరియు ఆవిష్కరణల ద్వారానే ప్రపంచ మార్కెట్‌లో నిలబడగలమని ఈ సంక్షోభం నిరూపి స్తోంది. సరైన ప్రభుత్వ విధానాలు మరియు కంపెనీల ముందుచూపు తోడైతే, భారత్ త్వరలోనే ప్రపంచ రసాయన తయారీ కేంద్రంగా అవతరిస్తుంది. అన్ని అడ్డంకులను అధిగమించి ఈ రంగం మళ్ళీ తన పూర్వ వైభవాన్ని సంతరించుకుంటుందని ఆశిద్దాం.

# బంగారు భవిష్యత్తుపై కల్తీ విషం!?

**వెంక గారి భూమయ్య**
**9848559863**



దేశ భవిష్యత్తుకు ప్రాణవాయువు వంటి పసిపిల్లల ఆరోగ్యం నేడు కల్తీ మందుల కోరల్లో చిక్కుకుని విలవిల్లాడుతోంది. ప్రాణాలను కాపాడాల్సిన ఔషధాలే మృత్యుపాశాలుగా మారుతున్న ఉదంతాలు వరుసగా వెలుగులోకి వస్తుండటం పౌర సమాజాన్ని ఉలిక్కిపడేలా చేస్తోంది. ఇటీవల బయటపడిన ప్రాణాంతక మందుల వ్యవహారం కేవలం ఒక సంస్థ చేసిన పొరపాటుగా చూడలేం; ఇది వ్యవస్థీకృత వైఫల్యంగా మరియు పాలకుల ఉదాసీనతకు నిదర్శనంగా కనిపిస్తోంది. ఒక మందు విపణిలోకి వచ్చి వేలాది మంది పిల్లల శరీరాల్లోకి ప్రవేశించిన తర్వాత, అది విషపూరితమని అధికారులు గుర్తించడం వల్ల ప్రయోజనం ఏమిటనే నిలదీతలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

**నియంత్రణ సంస్థల ఘోర వైఫల్యం:** ఈ ప్రాణాంతక పరిస్థితులకు తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ , సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ల నిర్లక్ష్యమే ప్రధాన కారణమని స్పష్టమవుతోంది. మందుల నాణ్యతను నిరంతరం పర్యవేక్షించాల్సిన ఈ సంస్థలు, కేవలం కార్యాలయాలకే పరిమితమవ్వడం వల్ల కల్తీ మాఫియా చెలరేగిపోతోంది. క్షేత్రస్థాయిలో తయారీ కేంద్రాలను తనిఖీ చేయడంలో, ముడి పదార్థాల నాణ్యతను పరీక్షించడంలో ఈ రెండు కీలక సంస్థలు ఘోరంగా విఫలమయ్యాయి. అనుమతులు ఇచ్చే సమయం ఓలో చూపించే అత్యుత్సాహం, నాణ్యతను పరీక్షించే సమయంలో మృగ్యమవుతోంది. అధికారుల పర్యవేక్షణా లోపం వల్లే విషపూరిత రసాయనాలు మందుల్లోకి చేరుతున్నాయని నిపుణులు మండిపడుతున్నారు.

**జవాబుదారీతనం లేని యంత్రాంగం:** ప్రస్తుత ఔషధ నియంత్రణ వ్యవస్థలో అత్యంత దారుణమైన విషయం ఏమిటంటే, తప్పు జరిగినప్పుడు బాధ్యతను ఒకరిపై ఒకరు నెట్టేసుకోవడం. కల్తీ మందులు మార్కెట్లోకి ఎలా వచ్చాయని ప్రశ్నిస్తే, కేంద్ర సంస్థ రాష్ట్ర విభాగంపై, రాష్ట్ర అధికారులు కేంద్ర నిబంధనలపై సాకులు చెబుతూ కాలయాపన చేస్తున్నారు. ప్రాణాంతకమైన 'ఇథలీన్ గ్లైకాల్ల వంటి రసాయనాలు కలవకుండా చూడాల్సిన బాధ్యత కేవలం కంపెనీలదే అన్నట్లుగా అధికారులు వ్యవహరించడం విస్మయానికి గురిచేస్తోంది. తయారీ లైసెన్సుల మంజూరులో ఉన్న వేగంలో పదో వంతు కూడా నాణ్యత తనిఖీల్లో లేకపోవడం వ్యవస్థలోని డొల్లతనాన్ని బయటపెడుతోంది. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న కంపెనీలపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంలో చూపిస్తున్న జాప్యం, పరోక్షంగా కల్తీ ముఠాలకు కొమ్ముకాస్తున్నట్లుగా ఉందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు ఏసీ గదుల నుంచి బయటకు వచ్చి క్షేత్రస్థాయిలో నిరంతర తనిఖీలు చేపట్టకపోతే, ఔషధ నియంత్రణ విభాగం ఉనికికే అర్థం లేదని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**లాభాల వేటలో బలిపీఠంపై పసిప్రాణాలు :** సాధారణంగా ఏదైనా ఒక ఔషధం తయారీ కేంద్రం నుంచి బయటకు రావడానికి ముందే దాని నాణ్యతను ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రయోగశాలల్లో శాస్త్రీయంగా పరీక్షించాల్సిన అవసరం ఉంది. అయితే, ప్రస్తుతం అమలులో ఉన్న నిబంధనలు కంపెనీలకు మితిమీరిన వెసులుబాటును కల్పిస్తున్నాయి. 'స్వీయ ధృవీకరణ' పేరుతో కంపెనీలే తమ మందుల నాణ్యతను తామే నిర్ధారించుకుని విక్రయాలకు విడుదల చేసే అవకాశం ఉండటం పెను ప్రమాదానికి దారితీస్తోంది. ఈ వెసులుబాటునే పెట్టుబడిగా మార్చుకున్న కొన్ని స్వార్థపూరిత కంపెనీలు, లాభాల వేటలో ముడి పదార్థాల నాణ్యతను పూర్తిగా పక్కన పెడుతున్నాయి. ముఖ్యంగా ద్రవ రూప మందుల తయారీలో వాడే ఖరీదైన రసాయనాలకు బదులుగా, పారిశ్రామిక అవసరాల కోసం వాడే అత్యంత విషపూరితమైన పదార్థాలను వాడుతున్నాయి.

**అనుమతుల ప్రక్రియలో అంతులేని లొసుగులు :** ఔషధ అనుమతుల ప్రక్రియలో ఉన్న లొసుగులు కల్తీ ముఠాలకు వరంగా మారుతున్నాయి. ఒక రాష్ట్రంలో తయారీ అనుమతి పొందిన కంపెనీ తన ఉత్పత్తులను దేశవ్యాప్తంగా ఎక్కడైనా విక్రయించవచ్చు. దీనివల్ల ఒక రాష్ట్రంలోని ఔషధ నియంత్రణ అధికారులకు మరో రాష్ట్రంలోని తయారీ కేంద్రాలను నేరుగా తనిఖీ చేసే అధికారం ఉండదు. కేవలం మందు దుకాణాల్లో అమ్మకానికి సిద్ధంగా ఉన్న నమూనాలను మాత్రమే వారు సేకరించగలరు. ఈ నమూనాలు సేకరించి, వాటిని ప్రయోగశాలకు పంపి నివేదిక వచ్చేసరికి నెలల సమయం పడుతోంది. ఈ లోపు ఆ విడతకు సంబంధించిన వేలాది సీసాలు అప్పటికే ప్రజల శరీరాల్లోకి చేరుతున్నాయి. ప్రాణాలు పోయాక 'వాడకం నిలిపివేయండి' అని నోటీసులు ఇవ్వడం అనేది యుద్ధం ముగిశాక ఆయుధాలు తీయడం వంటిదని విమర్శలు వస్తున్నాయి.

**ప్రక్షాళన జరగాల్సింది వ్యవస్థలోనే :** ఇకనైనా కేంద్ర ఔషధ నియంత్రణ సంస్థ (జణూజూ) మరియు రాష్ట్రాల విభాగాలు మేల్కోవాల్సిన అత్యవసర పరిస్థితి ఏర్పడింది. కేవలం పత్రాల మీద సంతకాలు చేసి అనుమతులు ఇవ్వడమే కాకుండా, ప్రతి తయారీ దశలోనూ నిశితమైన నిఘా ఉంచాలి. మందు విపణిలోకి విడుదల కావడానికి ముందే ప్రతి విడతను స్వతంత్ర ప్రయోగశాలల ద్వారా పరీక్షించి, 'నాణ్యత ధృవీకరణ' పత్రం ఉంటేనే విక్రయాలకు అనుమతించాలనే నిబంధనను తక్షణమే అమల్లోకి తీసుకురావాలి. ప్రాణాలను కాపాడాల్సిన మందుల విషయంలో రాజకీయాలకు, అధికారుల అవినీతికి తావు లేకుండా కఠినమైన ప్రక్షాళన జరగాలి. లేనిపక్షంలో సామాన్యుడు ప్రతి చుక్క మందు వేసుకునేటప్పుడు తన ప్రాణంపై ఆశలు వదులుకోవాల్సిన దుస్థితి ఏర్పడుతుంది.

## యువభారతాన్ని ప్రోత్సహిస్తున్న 'స్టార్టప్ వ్యవస్థలు'

అత్యాధునిక డిజిటల్ ప్రపంచంలో 3వ అతి పెద్ద 'స్టార్టప్‌ల హబ్(అంకుర కేంద్రం)'అబశ్రీశ్రీగా యువభారతం అవతరించడం హర్షదాయకం. ఒక సరి కొత్త ఆలోచనతో మొదలు పెట్టే వినూత్న వ్యాపార ప్రారంభ దశను స్టార్టప్ అని పిలుస్తారు. స్టార్టప్ అనే పదానికి అంకురార్పణ, ఉపారంభం, నాంది, శ్రీకారం, సమారంభం అనే అర్థాలు ఉన్నాయి. సాధారణంగా ప్రారంభ దశలో ఉన్న వాణిజ్య సంస్థలను స్టార్టప్‌లు లేదా అంకుర సంస్థలుగా పిలుస్తాం. స్టార్టప్‌లను ప్రారంభించడం అంత సులభమేమీ కాదు. మన వినూత్న ఆలోచనలు కార్యరూపం దాల్చడానికి కంపెనీ స్థాపన, నిధుల సేకరణ, మౌలిక వనరులు/వసతుల కల్పన, మానవ వనరులు, సరైన శ్రమ అవసరం అవుతాయి.

**ఆత్మ నిర్భర భారతానికి వెన్నెముక:** "ఆత్మ నిర్భర భారతు నిర్మాణానికి వెన్నెముక వలె అన్ని రంగాల్లో స్టార్టప్‌లు ప్రారంభం కావాలని 2022లో మన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ భావించి ప్రారంభించిన 'జాతీయ స్టార్టప్ దినోత్సవం' ప్రతి ఏట 16 జనవరి రోజున నిర్వహించడం ఆనవాయితీగా మారింది. స్టార్టప్‌ల స్థాపనలు పుంజుకున్నపుడు దేశ ఆర్థికాభివృద్ధి, ఉద్యోగ ఉపాధుల కల్పన, అంకుర సంస్థల ప్రగతి, స్వయం సమృద్ధ భారతం, ఆత్మనిర్భర భారత్, 2047 నాటికి వికసిత్ భారత్ కలల సాకారం, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు చొరవ తీసుకోవడం లాంటి పలు ప్రయోజనాలు కలుగుతాయి. 2026 నాటికే కేంద్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన 6.67 లక్షల స్టార్టప్‌లు దేశవ్యాప్తంగా టెక్నాలజీ, వ్యవసాయం, విద్య, ఆరోగ్య సంరక్షణ లాంటి రంగాల్లో ప్రారంభం కావడంతో రానున్న రోజుల్లో యువభారత స్టార్టప్‌ల ఎకోసిస్టమ్ మరింత పుంజుకోనున్నట్లు నిపుణులు అంచనా వేస్తున్నారు.

**'స్టార్టప్ ఇండియా స్కీమ్' ప్రారంభం:** దేశాభివృద్ధిలో స్టార్టప్‌ల అమూల్య పాత్రను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం 2016లోనే " స్టార్టప్ ఇండియా స్కీమ్"ను తీసుకురావడం జరిగింది. ఈ పథకం ద్వారా స్టార్టప్‌లకు సులభ రిజిస్ట్రేషన్ల వ్యవస్థ, పన్నుల్లో రాయితీలు, ఆర్థిక చేయూత, సులభ వ్యాపార విధానాలు, ఇన్నొవేషన్‌కు ఊతం ఇవ్వడం, పాలసీలను రూపొందించడం, పరిశ్రమలు-అకడమియా అనుసంధానాలు, ఇంక్యుబేషన్ మెంటర్‌షిప్ లాంటి పలు సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తున్నది. నేడు భారత్‌లో ఉన్న 2.09 లక్షల రిజిస్టర్డ్ స్టార్టప్‌లతో 126 యూనికార్న్స్, వివిధ రంగాలకు విస్తరణలు, మార్గ్ ప్లాట్‌ఫామ్, క్రెడిట్ గ్యారంటీ స్కీమ్, ఫండ్ ఆఫ్ ఫండ్స్ లాంటి ప్రోత్సాహక పథకాలు తీసుకురావడం సంతోషదాయకం.

నేటి జాతీయ స్టార్టప్ దినోత్సవ వేదికగా పరిశోధనలకు ప్రేరణ, గ్రామీణాభివృద్ధి దిశగా స్టార్టప్‌ల స్థాపనలు, అంతర్జాతీయ సహకారం, టెక్నాలజీ అభివృద్ధి, సమస్యల పరిష్కారం, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు అనువైన వాతావరణ కల్పన, డిజిటల్ రంగంలో సానుకూల మార్పులు లాంటి అత్యవసర సౌకర్యాలు సత్వరమే అందుబాటులోకి తేవాలని కోరుకుందాం. యువ భారత్ అంటే స్టార్టప్‌ల పర్యాయపదంగా నిలవాలని ఆశిద్దాం. ప్రతి ఒక్క స్టార్టప్, వినూత్న ఆలోచన ప్రగతికి వేసిన మరో ముందడుగు అని భారత యువత నమ్మాలి.

**డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి 9949700037**

# భయం లేని చదువులు కావాలి

పిల్లల చదువులో నిజమైన అడ్డంకి తెలివితేటలు కాదు. వారికి చదువు పట్ల ఉన్న భయం. పరీక్షల భయం, తప్పు చేయక పోయినా ఎక్కడ చేస్తామో అన్న భయం, ఉపాధ్యాయుల మందలింపుల వల్ల కలిగే భయం, తల్లిదండ్రుల అంచనాలను అందుకోలేక కలిగే భయం, ఇవి పిల్లల మనస్సును బంధించి, వారి సామర్థ్యాన్ని కుంగదీస్తాయి. చదువు ఒక ఆనందకరమైన అనుభవం అందించాల్సి ఉంటుంది అలాంటి చోట, ఒత్తిడి ఎక్కువ అయినప్పుడు విజయం కచ్చితంగా దూరమవుతుంది. కానీ అదే భయాన్ని పిల్లలు జయించినప్పుడు, చదువు వారికి శక్తిగా మారుతుం ది. విజయం సహజంగా చేరువవుతుంది. చిన్న వయసులోనే పిల్లలపై పెట్టే అధిక అంచనాలు భయానికి విత్తనాలు వేస్తాయి. "మార్కులు రావాలి", "ఫస్ట్ రావాలి", "ఇతరుల పిల్లలతో పోలిక" వంటి మాటలు పిల్లలలో అసురక్షిత భావాన్ని పెంచుతాయి. తప్పు చేస్తే ప్రేమ తగ్గిపోతుందన్న భావన కూడా వారి మనస్సులో గట్టిగా పాతుకుపోతుంది. ఈ భయం చదువును అర్థం చేసుకునే ప్రక్రియను అడ్డుకుంటుంది. జ్ఞాపకశక్తి తగ్గుతుంది, ఆలోచనల ప్రవాహం ఆగిపోతుంది. భయం ఉన్నచోట అభ్యాసం ఉండదుమనస్తత్వశాస్త్రం చెబుతున్న సత్యం ఒక్కటే , భయం ఉన్నప్పుడు మెదడు "రక్షణ మోడులోకి వెళ్తుంది. అప్పుడు సృజనాత్మకత, విశ్లేషణాత్మక ఆలోచన, సమస్య పరిష్కరణ సామర్థ్యం తగ్గిపోతాయి. పిల్లలు చదువును అర్థం చేసుకోవడం కన్నా, తప్పించుకోవడానికే ప్రయత్నిస్తారు. ఫలితంగా మార్కులు పడిపోతాయి, ఆత్మవిశ్వాసం క్షీణిస్తుంది, చదువుపై ఆసక్తి పూర్తిగా తగ్గిపోతుంది. భయం పోతే నేర్చుకోవడం మొదలవుతుంది పిల్లలకు భయం లేని వాతావరణం లభించినప్పుడు, వారు ప్రశ్నలు అడుగుతారు, తప్పులను స్వీకరిస్తారు, మళ్లీ ప్రయత్నిస్తారు. తప్పు చేయడం నేర్చుకునే భాగమని అర్థమైనప్పుడు చదువు ఒక ప్రయోగంగా మారుతుంది అంతే కానీ పరీక్షగా కాదు. అప్పుడు పిల్లలలో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది.తమ సామర్థ్యంపై నమ్మకం ఏర్పడుతుంది. ఈ నమ్మకమే విజయానికి పునాది.ఉపాధ్యాయులు భయాన్ని తొలగించే ప్రధాన శక్తి. మార్కులకన్నా ప్రయత్నాన్ని మెచ్చుకోవడం, తప్పును మందలించకుండా మార్గనిర్దేశం చేయడం, ప్రతి పిల్లవాడి ప్రత్యేకతను గుర్తించడం.ఇవి తరగతి గదిని సురక్షితమైన అభ్యాస కేంద్రంగా మారుస్తాయి. ఒక మంచి మాట, ఒక ప్రోత్సాహం పిల్లల జీవిత దిశనే మార్చగలదు.తల్లిదండ్రులు తమ పిల్లలతో పోటీ పెట్టకుండా, ప్రయాణంలో భాగస్వాములు కావాలి. మార్కుల కంటే ప్రయత్నాన్ని గౌరవించడం, ఇతరులతో పోల్చకుండా తమ పిల్లల పురోగతిని మాత్రమే చూడడం, "నువ్వు ప్రయత్నించావు,అదే చాలు" అనే భరోసా ఇవ్వడం పిల్లల భయాన్ని కరిగిస్తుంది. ఇలాంటిప్పుడు పిల్లలు చదువును బాధ్యతగా కాకుండా అవకాశంగా చూస్తారు.భయం లేని చదువు,సమాజానికి అవసరం.భయం లేకుండా చదువుకున్న పిల్లలు కేవలం పరీక్షల్లోనే కాదు, జీవితంలోనూ విజయం సాధిస్తారు. వారు ప్రశ్నించే ధైర్యం కలిగి ఉంటారు.కొత్త ఆలోచనలకు పూనుకుంటారు, వైఫల్యానికి భయపడరు. ఇవే లక్షణాలు సమాజాన్ని ముందుకు నడిపించే పౌరులను తయారు చేస్తాయి.

**సింగంపల్లి శేష సాయి కుమార్, 8639635907**

## లాభాల్లో ముగిసిన సూచీలు

### సెన్సెక్స్ 187.64 పాయింట్ల లాభం -నిఫ్టీ 28.75 పాయింట్లలాభం



ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. ముఖ్యంగా ఐటీ, బ్యాంకింగ్ స్టాక్స్‌లో కొనుగోళ్లు సూచీలకు దన్నుగా నిలిచాయి. మార్కెట్ అంచనాలను మించి ఇన్ఫోసిస్ మెరుగైన త్రైమాసిక ఫలితాలను ప్రకటించడం, భవిష్యత్ అంచనాలను కూడా పెంచడంతో ఐటీ స్టాక్స్‌లో ర్యాలీ కనిపించింది. ఫార్మా, కన్జ్యూమర్ డ్యూరబుల్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి కనిపించింది. ఓ దశలో సెన్సెక్స్ 750 పాయింట్లకు పైగా లాభాల్లోకి వెళ్లినా.. లాభాల స్వీకరణతో మోస్తరు లాభాలకే పరిమితమైంది. సెన్సెక్స్ ఉదయం 83,670.79 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 83,382.71) లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 84,134.97 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 187.64 పాయింట్ల లాభంతో 83,570.35 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 28.75 పాయింట్ల లాభంతో 25,694.35 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 90.86గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఎస్‌బీఐ, అల్ట్రాటెక్ సిమెంట్ షేర్లు లాభపడ్డాయి. ఎటెర్నల్, ఏషియన్ పెయింట్స్, బీఈఎల్, సన్‌ఫార్మా, మారుతీ సుజుకీ షేర్లు నష్టపోయాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 64.30 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4610 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## బీబీజీ సంక్రాంతి సంబరాలు



కరీంనగర్ , : ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ బిల్డింగ్ బ్లాక్స్ గ్రూప్ (బీబీజీ) సంక్రాంతి పండుగ వేళ తమ వినియోగదారులకు అదిరిపోయే కానుకలను ప్రకటించింది. "ఫ్రీ రిజిస్ట్రేషన్ నుండి ఫ్రీ ప్లాట్ వరకు" పేరుతో నిర్వహించిన ప్రత్యేక క్యాంపెయిన్‌లో భాగంగా బుధవారం భారీ లక్కీ డ్రాను నిర్వహించి విజేతను ప్రకటించింది. వినియోగదారుల నుంచి వస్తున్న విశేష స్పందనను చూసి, బీబీజీ మేనేజ్‌మెంట్ మరిన్ని పండుగ ఆఫర్లను ప్రకటించింది. కొత్తగా ప్లాట్లు కొనుగోలు చేసే వారికి ఉచిత రిజిస్ట్రేషన్: ప్లాట్ కొనుగోలుపై రిజిస్ట్రేషన్ ఛార్జీల భారం లేకుండా సంస్థే భరిస్తుంది నిర్ణీత గడువులోగా ప్లాట్ బుక్ చేసుకున్న వారికి 55 అంగుళాల భారీ స్మార్ట్ ఎల్ఈడీ టీవీని ఉచితంగా అందజేయనున్నారు. ఈ సందర్భంగా సంస్థ సీఎండీ మల్లికార్జున్ రెడ్డి మాట్లాడుతూ... "పారదర్శకత, కస్టమర్ల సంతృప్తికే తాము మొదటి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. అమరావతి వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో, సామాన్యులకు కూడా ప్లాట్ సొంతం చేసుకునే అవకాశాన్ని కల్పించడమే బీబీజీ లక్ష్యమని" ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, సహచరులు పెద్ద సంఖ్యలో కొనుగోలుదారులు పాల్గొన్నారు.

## టిబిజెడ్-ది ఒరిజినల్ షోరూం ప్రారంభించిన రాశీఖన్నా




హైదరాబాద్‌లో తమ 25 ఏళ్ల కార్యకలాపాలను వేడుక జరుపుకున్న టిబిజెడ్-ది ఒరిజినల్. హిమాయత్‌నగర్‌లో కొత్త షోరూమ్‌ను ప్రారంభించింది. ప్రారంభోత్సవ ఆఫర్లతో 161 సంవత్సరాల ప్రతిష్టాత్మక వారసత్వంను వేడుక జరుపుకుంటోంది.

ఇప్పటికే నగరంతో బలమైన బ్రాండ్ మరియు ప్రత్యేకమైన అనుబంధంను ఏర్పరచుకోవటంతో ఈ కొత్త స్టోర్, హిమాయత్ నగర్ మెయిన్ రోడ్‌లోని ప్రధాన హై స్ట్రీట్ ప్రాంతంలో ఉన్న తమ కస్టమర్లకు ఉన్నతమైన కొనుగోలు అనుభవాన్ని అందించనుంది. ఆభరణాల ప్రియులకు ఈ స్టోర్ స్వర్గధామంగా నిలువనుంది, విస్తృత శ్రేణి వినూత్న , ఆకర్షణీయమైన డిజైన్‌లను కలిగి ఉంది. సమకాలీన వస్తువుల నుండి సాంప్రదాయ ఆభరణాల వరకు, టిబిజెడ్-ది ఒరిజినల్ యొక్క శ్రేష్ఠత పట్ల అంకితభావానికి ప్రతి డిజైన్ నిదర్శనంగా నిలుస్తుంది. ఇటీవల, టిబిజెడ్-ది ఒరిజినల్ తమ "డోర్ కలెక్షను ను కూడా విడుదల చేసింది, ఇది ఒక ప్రత్యేకమైన డిటాచబుల్ బ్రైడల్ జ్యువెలరీ కాన్సెప్ట్, ప్రఖ్యాత నటి రాశీ ఖన్నా ప్రారంభించిన ఈ స్టోర్ , బంగారం, యాంటిక్ మరియు టెంపుల్ జువెలరీ యొక్క గొప్ప కలెక్షన్ ను ప్రదర్శిస్తుంది. ఈ కలెక్షన్‌లోని ఆకర్షణీయమైన హెరిటేజ్ సెట్‌లలో ఒకదానిని ధరించిన రాశీ ఖన్నా, టిబిజెడ్-ది ఒరిజినల్ షోరూమ్‌లలో అందుబాటులో ఉన్న అద్భుతమైన రత్నాలు, క్లిష్టమైన డిజైన్‌లతో రూపొందించబడిన విస్తృత శ్రేణి బంగారు , వజ్రాల ఆభరణాలను చూసి తన ఆనందాన్ని వ్యక్తం చేసింది.

## బజాజ్ జనరల్ ఇన్సూరెన్స్ ఫీటల్ ఫ్లారిష్



దేశంలో ప్రముఖ ప్రైవేట్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీలలో ఒకటైన బజాజ్ జనరల్ ఇన్సూరెన్స్ లిమిటెడ్ (గతంలో బజాజ్ అలియంజ్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ అని పిలువబడేది) నేడు 'ఫీటల్ ఫ్లారిష్ను ఆవిష్కరించింది, ఇది ఫీటల్ హెల్త్ కోసం ప్రత్యేకంగా రూపొందించబడిన ఒక ప్రముఖ ఇన్సూరెన్స్ రైడర్. ఈ ప్రత్యేక పరిష్కారం అధునాతన ఇన్-యుటెరో విధానాలు మరియు సాంప్రదాయక మెటర్నిటీ ఇన్సూరెన్స్ పరిధిలో లేని అధిక రిస్క్ ఉన్న గర్భధారణల కోసం ఆర్థిక సహాయాన్ని అందిస్తుంది. రైడర్ వారి ఫ్లాగ్షిప్ ప్రోడక్టులు అయిన "మై హెల్త్ కేర్ ప్లాను మరియు "హెల్త్ గార్డు తో పాటు అందించబడుతుంది.ఫీటల్ ఫ్లారిష్ ప్రీనేటల్ కేర్లో క్లిష్టమైన అవసరాన్ని పరిష్కరించడానికి వైద్య నైపుణ్యం మరియు ఇన్సూరెన్స్ డిజైన్ను కలిపి అందిస్తుంది. ప్రసూతి ప్రోడక్టులు సాంప్రదాయకంగా డెలివరీ మరియు ప్రసవానంతర చికిత్సపై దృష్టి పెడుతున్నప్పటికీ, ఈ రైడర్ గర్భం లోపల అత్యంత సున్నితమైన దశలో పుట్టబోయే బిడ్డ రక్షణపై దృష్టి పెడుతుంది.

లాంచ్ గురించి బజాజ్ జనరల్ ఇన్సూరెన్స్ ఎండి మరియు సిఇఒ డాక్టర్ తపన్ సింఘేల్ మాట్లాడుతూ, "గర్భధారణ అనేది ప్రతి కుటుంబానికి భావోద్వేగ వ్యక్తిగత ప్రయాణం, ఇది ఆశ, నిరీక్షణ మరియు బిడ్డకు ఏది ఉత్తమమో అది చేయాలనే కోరికతో రూపొందించబడింది. వైద్య సమస్యలు తలెత్తినప్పుడు, కుటుంబాలు ప్రారంభ దశలోనే క్లిష్టమైన నిర్ణయాలు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఫీటల్ కేర్లో వచ్చిన నూతన సాంకేతిక పురోగతులు ముందస్తు చికిత్సకు మార్గం తెరిచాయి, కానీ దాని ఖర్చు కుటుంబాలకు అదనపు ఒత్తిడిని కలిగిస్తుంది. ఫీటల్ ఫ్లారిష్ రైడర్తో, అవసరమైన విధానాలకు మద్దతు ఇవ్వడం ద్వారా మేము ఈ భారాన్ని తగ్గించడానికి ప్రయత్నించామన్నారు.

## జీప్ 'కాన్ఫిడెన్స్ 7'ను ఆవిష్కరించిన జీప్ ఇండియా




పూణే, : జీప్ ఇండియా జీప్ కాన్ఫిడెన్స్ 7ను ప్రారంభించినట్లుప్రకటించింది, ఇది భారతదేశంలో దీర్ఘకాలిక ఎస్‌యువి యాజమాన్యాన్ని పునర్నిర్వచించ టానికి రూపొందించబడిన సమగ్ర ప్రీమియం యాజమాన్య కార్యక్రమం. జీప్ మెరిడియన్ మరియు జీప్ కంపాస్ కోసం ప్రత్యేకంగా రూపొందించబడిన ఈ కార్యక్రమం, ప్రపంచ స్థాయి నాణ్యత, విశ్వసనీ యత మరియు పూర్తి కస్టమర్ హామీని అందించడం లో జీప్ యొక్క నిబద్ధతను బలోపేతం చేస్తుంది---కొనుగోలు పాయింట్‌కు మించి. ఎనిమిది దశాబ్దాలకు పైగా, జీప్ బ్రాండ్ నమ్మకం, ఓర్పు మరియు అన్ని భూభాగాల సామర్థ్యాన్ని ప్రతిబింబిస్తుంది. జీప్ కాన్ఫిడెన్స్ 7తో, అదే పురాణ విశ్వాసం ఇప్పుడు కస్టమర్ యాజమాన్య ప్రయాణంలోని ప్రతి దశలోనూ విస్తరించింది.కొత్త ప్రోగ్రామ్ పనితీరు మరియు ప్రీమియం హస్తకళను మాత్రమే కాకుండా - దీర్ఘకాలిక హామీ, అంచనా వేయదగిన ఖర్చులు మరియు ఆందోళన లేని సేవా అనుభవాలను కూడా ప్రాధాన్యతనిచ్చే వివేకవంతమైన ఎస్‌యువి కొనుగోలుదారుల అంచనాలకు ప్రతిస్పందిస్తుంది. ప్రోగ్రామ్ యొక్క గుండె వద్ద 7 సంవత్సరాల వరకు పొడిగించిన వారంటీ మరియు నిర్వహణ ప్యాకేజీ ఉంది, ఇది ఊహించదగిన, ఇబ్బంది లేని యాజమాన్యాన్ని నిర్ధారిస్తుంది. కస్టమర్లు అష్యూర్డ్ బైబ్యాక్ నుండి కూడా ప్రయోజనం పొందుతారు, వారి వాహనాన్ని అప్‌గ్రేడ్ చేసేటప్పుడు లేదా తిరిగి విక్రయించేటప్పుడు అదనపు విశ్వాసాన్ని అందిస్తారు-జీప్ యాజమాన్యాన్ని భరోసాతో పాటు బహుమతి గా చేస్తుంది. ఈ ఆఫర్‌లు కలిసి, కంపాస్ కోసం రూ 41,926 నుండి మరియు మెరిడియన్ కోసం రూ 47,024 నుండి ప్రారంభమయ్యే ధరలతో దీర్ఘకాలిక వాహన విలువను పెంచుతూ, సజావుగా, ప్రీమియం మరియు సౌకర్యవంతమైన సేవా అనుభవాన్ని సృష్టిస్తాయి.

కొత్త కార్యక్రమాన్ని , స్టెల్లాంటిస్ ఇండియా ఆటోమోటివ్ బ్రాండ్స్ బిజినెస్ హెడ్ మరియు డైరెక్టర్ కుమార్ ప్రియేష్ ప్రకటిస్తూ "జీప్ కాన్ఫిడెన్స్ 7 మా కస్టమర్లకు మా అచంచలమైన వాగ్దానాన్ని ప్రతిబింబిస్తుంది జీప్ బ్రాండ్ నమ్మక వారసత్వానికి నిజమైనదిగా నిలిచే ఉన్నతమైన, నమ్మదగిన యాజమాన్య అనుభవం. నేడు కస్టమర్లు పారదర్శకత, దీర్ఘకాలిక విలువ మరియు శ్రమలేని సేవా నిశ్చితార్థాన్ని కోరుకుంటున్నారు. జీప్ కాన్ఫిడెన్స్ 7తో, మేము హామీ, సౌలభ్యం మరియు మనశ్శాంతిని విస్తరిస్తున్నాము, ప్రతి జీప్ కస్టమర్ వారి మొత్తం ప్రయాణంలో మద్దతు పొందుతున్నట్లు నిర్ధారిస్తాము." అన్నారు.

## ఎస్‌బీఐ లైఫ్-స్మార్ట్ ప్లాటినా అడ్వాంటేజర్

దీర్ఘకాలిక గ్యారంటీడ్ సేవింగ్స్ పథకంగా తీర్చిదిద్దబడిన ఎస్‌బీఐ లైఫ్ - స్మార్ట్ ప్లాటినా అడ్వాంటేజ్ అనేది జీవితంలో ప్రతి దశలోనూ ఆర్థిక సన్నద్ధత కలిగి ఉంటూ, మార్కెట్ ఒడిదుడుకుల నడు మ స్థిరత్వాన్ని కోరుకునే వ్యక్తులకు అనువుగా ఉంటుంది. జీవిత బీమా భద్రతను కచ్చితమైన పొదుపుతో మేళవించడం ద్వారా వ్యక్తులు క్రమశిక్షణ మరియు విశ్వసనీయమైన విధానంతో తమ దీర్ఘకాలిక లక్ష్యాల సాధనకు కట్టుబడి ఉండేలా ఈ ప్రోడక్టు తోడ్పడుతుంది.

"ప్రస్తుత అనిశ్చితి సమయాల్లో వినియోగదారులు, కచ్చితత్వం, క్రమశిక్షణ, విశ్వసనీయమైన ఫలితాలను అందించే సొల్యూషన్స్ కోసం అన్వేషిస్తున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకునే, ఎస్‌బీఐ లైఫ్ -- స్మార్ట్ ప్లాటినా అడ్వాంటేజ్ అనేది జీవిత బీమా భద్రతను మార్కెట్ హెచ్చుతగ్గులతో సంబంధం లేకుండా, కస్టమర్లు విశ్వసించతగిన విధంగా కచ్చితమైన ప్రయోజనాలతో మేళవించే విధంగా తీర్చిదిద్దబడింది. ఆర్థిక ప్రణాళిక పరిధులు విస్తరించే కొద్దీ పరిమిత కాలం పాటు ప్రీమియంలను చెల్లించి దీర్ఘకాలికంగా గ్యారంటీతో కూడుకున్న ప్రయోజనాలను పొందడంలో వ్యక్తులకు వెసులుబాటు కల్పించాలనే మా లక్ష్యానికి అనుగుణంగా, ఇది ఆత్మ విశ్వాసం మరియు నిశ్చింతతో ప్రణాళికలు వేసుకోవడంలో వ్యక్తులకు సాధికారత కల్పిస్తుంది. పారదర్శకమైన, నిశ్చితత్వంతో కూడుకున్న బీమా సాధనాల ద్వారా దేశవ్యాప్తంగా వ్యక్తులు, కుటుంబాలకు ఆర్థిక స్థితిస్థాపకతను అందించడంపై ఎస్‌బీఐ లైఫ్‌కి గల నిబద్ధతను ఇది సూచిస్తుంది" అని ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రెసిడెంట్ & చీఫ్ డిస్ట్రిబ్యూషన్ ఆఫీసర్ ఎం. ఆనంద్ తెలిపారు.

తమకు, తమకెంతో ప్రియమైన వారికి భద్రత కల్పిస్తూనే దీర్ఘకాలిక ఆర్థిక బాధ్యతలను తీర్చుకోవ డానికి మద్దతుగా నిల్చే నిర్మాణాత్మకమైన పొదుపు సాధనాన్ని కోరుకుంటున్న వ్యక్తులకు ఎస్‌బీఐ లైఫ్- స్మార్ట్ ప్లాటినా అడ్వాంటేజ్ అనువుగా ఉంటుంది. సెటిల్మెంట్ ఆప్షన్లు, అప్షనల్ రైడర్లులాంటి ఫీచర్లతో ఈ ప్లాన్ దీర్ఘకాలికంగా కచ్చితమైన విలువను అందిస్తూ, మారే ఆర్థిక అవసరాలను పరిష్కరించుకునేందుకు వెసులుబాటు కల్పిస్తుంది. ఈ ఆవిష్కరణ ద్వారా 'అప్నే లియే, అప్నోం కే లియే' (మన కోసం, మనవారి కోసం) హామీని నిలబెట్టుకోవడాన్ని ఎస్‌బీఐ లైఫ్ కొనసాగిస్తోంది. మానసిక ప్రశాంతత పొందడంలో, కచ్చితమైన పొదుపు మొత్తాలను నిర్మించుకోవడంలో, తమకు మరియు తమ కుటుంబాలకు జీవితకాల భద్రతను ఏర్పర్చుకోవడంలో కస్టమర్లకు సహాయపడే ఒక విశ్వసనీయమైన భాగస్వామి పాత్రను పోషిస్తోంది.

## ఢిల్లీ - గౌహతి లో మొట్టమొదటి కోక్ స్టూడియో



ఢిల్లీ - గౌహతి లో మొట్టమొదటి కోక్ స్టూడియో జనవరి 16, 2025: కోకా-కోలా తన ప్రసిద్ధ సంగీత వేదికను తొలిసారిగా తెరపై నుండి వేదికపైకి తీసుకువస్తూ, మొట్టమొదటి కోక్ స్టూడియో భారత్ లైవ్‌ను ప్రారంభించడం ద్వారా భారతదేశ సాంస్కృతిక ప్రస్థానంలో ఒక మైలురాయిని నెలకొల్పింది. ఈ భారీ స్థాయి ప్రత్యక్ష అనుభవం కళాకారులను, ప్రేక్షకులను మరియు సమాజాలను ఏకం చేసి, మరచిపోలేని ఉమ్మడి క్షణాల ద్వారా భారతదేశ విభిన్న సంగీత స్వరాలను వేడుకగా జరుపుకుంది---ఇది కేవలం కోక్ మాత్రమే అందించగల అనుభవం.కోకా-కోలా ఇండియా మరియు సౌత్ వెస్ట్ ఆసియాకు చెందిన ఇంటిగ్రేటెడ్ మార్కెటింగ్ ఎక్స్‌పీరియన్స్ డ్ శాంతను గంగానే మాట్లాడుతూ, "కోక్ స్టూడియో భారత్ లైవ్ అనేది ఆ ప్లాట్‌ఫామ్ తెర నుండి వేదికపైకి వేసిన మొదటి అడుగు, ఇది సంగీతం, ఆహారం మరియు క్రీడలను ఒకచోట చేర్చింది. ఢిల్లీ మరియు గౌహతిలో, అభిమానులు కేవలం చూసి ఊరుకోలేదు---వారు ప్రదర్శనలో భాగమయ్యారు. కళాకారులు కలిసి ప్రదర్శనలు ఇవ్వడం మరియు కొత్త పాటలను ముందుగానే వినిపించడం నుండి అభిమానులు వారితో పాటు వేదికపై చేరడం వరకు, ఆ రెండు రోజులు నిజమైన, ప్రత్యక్ష సంబంధాలను సృష్టించాయి. ప్రజలు కోక్ స్టూడియో భారత్‌ను కలిసి అనుభవించడానికి ఎంతగా ఇష్టపడతారో ఈ స్పందన చాటి చెప్పింది."

ఆదిత్య రిఖారి విడుదల కాని కోక్ స్టూడియో భారత్ పాటను వేదికపై ప్రత్యక్షంగా ప్రదర్శించి అభిమానులకు ప్రత్యేక విందు ఇచ్చారు, వారికి మొదటిసారి ప్రత్యేకంగా వినడానికి అవకాశం కల్పించారు. ఢిల్లీ షో శక్తివంతమైన ముగింపుతో ముగిసింది, శ్రేయ ఘోషల్ రష్మీత్ కౌర్, ఆదిత్య రిఖారి, దివ్యం మరియు ఖ్వాబ్‌లతో కలిసి ప్రసిద్ధ కోక్ స్టూడియో భారత్ పాటల మిశ్రమాన్ని పాడటానికి వెళ్ళాడు. ఆధునిక సంగీతం ప్రాంతీయ ఆత్మతో మిళితమైన స్థలాన్ని సృష్టించాయి మరియు ప్రేక్షకులు ఉమ్మడి భావోద్వేగాల ద్వారా కనెక్ట్ అయ్యారు. అందరు కళాకారులు కలిసి 'అర్జ్ కియా హై' ప్రదర్శించడం, ఎంపిక చేసిన అభిమానులను వేదికపైకి మరియు తరువాత ఒక చిన్న అన్‌ప్లగ్డ్ బ్యాక్‌స్టేజ్ సెషన్‌లోకి ఆహ్వానించడం ఈ ప్రదర్శన యొక్క ముఖ్యాంశం. అభిమానులను సోషల్ మీడియా మరియు ఆన్-గ్రౌండ్ కార్యకలాపాల ద్వారా ఎంపిక చేశారు, సంగీతం పట్ల వారికున్న ప్రేమను మరపురాని ప్రత్యక్ష అనుభవాలుగా మార్చారు.

## విప్రో త్రైమాసిక ఫలితా లు

డిసెంబర్ ముప్పై ఒకటి రెండువేల ఇరవై ఐదు నాటికి ముగిసిన త్రైమాసికంలో విప్రో సంస్థ స్థిరమైన వృద్ధిని నమోదు చేసింది. ఐటి సేవల ఆదాయం త్రైమాసిక ప్రాతిపదికన పెరుగుదల చూపగా, నిర్వహణ లాభ మార్జిన్ గణనీయంగా మెరుగుపడి గత కొన్ని సంవత్సరాలలో ఉత్తమ స్థాయికి చేరుకుంది. మొత్తం ఒప్పందాల విలువ బలంగా ఉండగా, పెద్ద ఒప్పందాలు కూడా మంచి వాటాను అందించాయి. నికర లాభం స్వల్పంగా తగ్గినప్పటికీ, కార్మిక చట్టాల ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకుంటే లాభాలు మెరుగ్గా ఉన్నాయి. ఆపరేటింగ్ నగదు ప్రవాహం నికర ఆదాయాన్ని మించడంతో సంస్థ ఆర్థిక క్రమశిక్షణను ప్రతిబింబించింది. కృత్రిమ మేధస్సు ఆధారిత పరిష్కారాలు, నవీన వేదికల వినియోగం మరియు ప్రపంచవ్యాప్తంగా విస్తరించిన ఆవిష్కరణలతో భవిష్యత్ త్రైమాసికానికి స్థిరమైన ఆదాయ మార్గదర్శకాన్ని సంస్థ ప్రకటించింది.

## మద్యం పరిశ్రమకు ప్రభుత్వ బకాయిలపై ఆందోళన



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మద్యం పానీయాల పరిశ్రమకు చెల్లించాల్సిన నాలుగు వేల కోట్ల రూపాయలకు పైగా బకాయిలను ఇంకా పరిష్కరించకపోవడంపై పరిశ్రమ సంఘాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. ఏడాదికి పైగా పెండింగ్‌లో ఉన్న పెద్ద మొత్తాల వల్ల సరఫరా వ్యవస్థకు అంతరాయం, ఉపాధిపై ప్రభావం మరియు పెట్టుబడిదారుల విశ్వాసానికి భంగం కలగవచ్చని హెచ్చరించాయి. రాష్ట్రానికి నెలకు వేల కోట్ల రూపాయల పన్ను ఆదాయం అందించే ఈ రంగం ద్వారా వేలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తోంది. ఇటీవలి కాలంలో రాష్ట్ర ఆదాయం చరిత్రలో ఎన్నడూ లేనంతగా పెరిగినా, పరిశ్రమకు చెల్లింపులు ఆలస్యం కావడం రాష్ట్ర వ్యాపార ప్రతిష్ఠను దెబ్బతీస్తోందని సంఘాలు పేర్కొన్నాయి. అంతర్జాతీయ పెట్టుబడి సమావేశాల ముందు ప్రభుత్వం తన ఒప్పంద బాధ్యతలను గౌరవిస్తూ బకాయిలను వెంటనే చెల్లిస్తేనే పెట్టుబడిదారుల నమ్మకం పునరుద్ధరించబడుతుందని అవి స్పష్టం చేశాయి.

## తెలంగాణలో సీగ్రామ్ ఎక్స్‌క్లమేషన్ బ్రాండ్ ఆవిష్కరణ




పెర్నోడ్ రికార్డ్ ఇండియా సంస్థ తెలంగాణలో సీగ్రామ్ ఎక్స్‌క్లమేషన్ పేరుతో కొత్త మద్యం బ్రాండ్‌ను ప్రవేశపెట్టింది. ముప్పై సంవత్సరాల తర్వాత సంస్థ తీసుకువచ్చిన ఈ వినూత్న ప్రయత్నంలో విస్కీ, వోడ్కా, జిన్, రమ్, బ్రాండీ అనే ఐదు రకాల మద్యాలను ఒకే బ్రాండ్ కింద ఒకే ధరలో అందిస్తున్నారు. యువ వినియోగదారుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, మిశ్రమ సామాజిక సమావేశాలకు అనుకూలంగా ఈ బ్రాండ్‌ను రూపొందించారు. నాణ్యతతో కూడిన ప్రీమియం అనుభూతిని అందుబాటు ధరలో ఇవ్వడమే లక్ష్యంగా ఈ ఉత్పత్తులు రూపొందించబడ్డాయి. భారతదేశంలో ప్రతి సంవత్సరం మద్యపాన చట్టబద్ధ వయస్సుకు చేరుతున్న కోట్లాది యువతను ఆకర్షించగల సామర్థ్యం ఈ బ్రాండ్‌కు ఉందని సంస్థ పేర్కొంది. ప్రత్యేక రుచి, వినూత్న రూపకల్పన మరియు ధైర్యమైన గుర్తింపుతో ఈ బ్రాండ్ కొత్త తరం వినియోగదారులకు ప్రత్యేక అనుభూతిని అందించనుంది.

## డిజిటల్ సార్వభౌమత్వానికి ఐబిఎం కొత్త సాఫ్ట్‌వేర్

డిజిటల్ సార్వభౌమత్వ అవసరాలు పెరుగుతున్న నేపథ్యంలో ఐబిఎం సంస్థ సార్వభౌమ కోర్ అనే కొత్త సాఫ్ట్‌వేర్‌ను పరిచయం చేసింది. ఇది ప్రభుత్వాలు, సంస్థలు తమ స్వంత నియంత్రణలో భద్రమైన, నియమావళులకు అనుగుణమైన కృత్రిమ మేధస్సు వాతావరణాలను నిర్మించుకోవడానికి సహాయపడుతుంది. డేటా ఎక్కడ నిల్వ ఉంటుంది అనే అంశాన్ని మించి, సాంకేతిక వ్యవస్థలపై పూర్తి నియంత్రణ, పరిపాలన, పర్యవేక్షణను కల్పించడం దీని ప్రధాన లక్ష్యం. ఓపెన్ మూల సాంకేతికత ఆధారంగా రూపొందిన ఈ పరిష్కారం ద్వారా సంస్థలు తమ పరిధిలోనే గుర్తింపు, భద్రత, ఆడిట్ ప్రక్రియలు నిర్వహించగలుగుతాయి. కృత్రిమ మేధస్సు వినియోగం వేగంగా పెరుగుతున్న తరుణంలో నియంత్రణ, అనుసరణ మరియు స్వయం నిర్ణయాధికారాన్ని సమతుల్యం చేస్తూ, భవిష్యత్ అవసరాలకు అనుగుణమైన నమ్మకమైన డిజిటల్ వాతావరణాన్ని ఈ సాఫ్ట్‌వేర్ అందిస్తుందని ఐబిఎం పేర్కొంది.

## బోసుటినిబ్ మాత్రలకు అలెంబిక్ అనుమతి

అలెంబిక్ ఫార్మాస్యూటికల్స్ సంస్థ బోసుటినిబ్ నాలుగు వందల మిల్లిగ్రాముల మాత్రలకు అమెరికా ఔషధ నియంత్రణ సంస్థ నుంచి తాత్కాలిక అనుమతిని పొందింది. ఈ ఔషధం దీర్ఘకాలిక రక్త క్యాన్సర్‌తో బాధపడుతున్న పెద్దల చికిత్సలో ఉపయోగపడుతుంది, ముఖ్యంగా గత చికిత్సలకు స్పందించని లేదా తట్టుకోలేని రోగులకు ఇది సహాయకారిగా ఉంటుంది. ఇప్పటికే ఈ సంస్థ అదే ఔషధానికి ఇతర మోతాదుల్లో పూర్తి అనుమతులు పొందింది. ఈ కొత్త అనుమతితో సంస్థ ఉత్పత్తుల పరిధి మరింత విస్తరించనుందని, అంతర్జాతీయ మార్కెట్లో సంస్థ స్థితి బలపడుతుందని పేర్కొంది. ఇప్పటివరకు అలెంబిక్ సంస్థకు అమెరికా నియంత్రణ సంస్థ నుంచి వందల సంఖ్యలో ఔషధ అనుమతులు లభించడం సంస్థ విశ్వసనీయతకు నిదర్శనంగా నిలుస్తోంది.

## పిల్లల భవిష్యత్తుకు ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ కొత్త పథకం

పిల్లల జీవితంలోని ముఖ్యమైన దశలకు ఆర్థిక భద్రత కల్పించే లక్ష్యంతో ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ కొత్త దీర్ఘకాలిక పొదుపు పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకం ద్వారా తల్లిదండ్రులు క్రమబద్ధంగా పొదుపు చేస్తూ, చదువు, ఉన్నత విద్య వంటి కీలక దశల సమయంలో ముందుగా నిర్ణయించిన నగదు చెల్లింపులను పొందవచ్చు. పాలసీదారుడు అనుకోకుండా మరణించిన సందర్భంలో కూడా ప్రీమియం మినహాయింపు, ప్రయోజనాల కొనసాగింపు ద్వారా పిల్లల లక్ష్యాలు అంతరాయం లేకుండా కొనసాగుతాయి. పాలసీ కాలం ముగిసినప్పుడు ఒకేసారి హామీగా ఇచ్చే మొత్తం పిల్లల ప్రౌఢ దశలో అవసరాలకు తోడ్పడుతుంది. పొదుపు, రక్షణ, హామీ లాభాలను సమ్మిళితం చేసిన ఈ పథకం ద్వారా తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తును ధైర్యంగా ప్రణాళిక చేయగలుగుతారని సంస్థ తెలిపింది.ఐసిఐసిఐ ప్రూ స్మార్ట్‌కిడ్ 360, ఒక నాన్-పార్టిసిపేటింగ్, దీర్ఘకాలిక పొదుపు పథకం యొక్క ప్రారంభానికి కంపెనీ డిజిటల్ సామర్థ్యాలు మద్దతు ఇస్తున్నాయి, ఇది ఇబ్బంది లేని కొనుగోలు ప్రక్రియ, అనుకూలమైన స్వీయ-సేవా ఎంపికలు మరియు కంపెనీ యొక్క శీఘ్ర క్లెయిమ్‌ల పరిష్కార ప్రక్రియను అనుమతిస్తుంది, ఇది కస్టమర్‌లు మరియు వారి కుటుంబాలకు సకాలంలో మరియు నమ్మదగిన మద్దతును అందించే సామర్థ్యాన్ని ప్రతిబింబిస్తుంది.2026 ఆర్థిక సంవత్సరం మొదటి అర్ధభాగంలో 99.3% పరిశ్రమ-అగ్రగామి క్లెయిమ్స్ సెటిల్‌మెంట్ నిష్పత్తిని సాధించింది, మరియు విచారణ అవసరం లేని క్లెయిమ్‌ల కోసం సగటు క్లెయిమ్ సెటిల్‌మెంట్ సమయం 1.1 రోజులుగా ఉంది. అంతేకాకుండా, కంపెనీ తన పొదుపు పాలసీలలో సుమారు 50% అదే రోజున జారీ చేసింది.

## ఆస్తి ప్రదర్శనకు బ్యాంక్ బరోడా భాగస్వామ్యం

హైదరాబాద్‌లో జరగనున్న ఆస్తి ప్రదర్శనకు ప్రభుత్వ రంగ బ్యాంకు ఒకటి ప్రముఖ రియల్ ఎస్టేట్ అభివృద్ధిదారుల సంఘంతో కలిసి భాగస్వామ్యాన్ని ప్రకటించింది. ఫిబ్రవరి నెలలో మూడు రోజుల పాటు నిర్వహించే ఈ ప్రదర్శనలో నగరంలోని ప్రముఖ నిర్మాణ సంస్థల ఆమోదిత నివాస ప్రాజెక్టులు ప్రదర్శించబడతాయి. ఇల్లు కొనుగోలు చేయదలచిన వారికి ఒకే వేదికపై విస్తృత ఎంపికలు లభించడమే కాకుండా, సులభమైన రుణ సదుపాయాలు, తక్షణ అంగీకారాలు మరియు ప్రత్యేక ఆర్థిక ప్రయోజనాలు అందించనున్నారు. పారదర్శకత, నమ్మకం మరియు వినియోగదారుల విశ్వాసాన్ని పెంపొందించే లక్ష్యంతో ఈ కార్యక్రమం నిర్వహించబడుతుందని నిర్వాహకులు తెలిపారు. నగర అభివృద్ధికి తోడ్పడుతూ, ఇల్లు కల అనే లక్ష్యాన్ని మరింత సులభతరం చేయడమే ఈ భాగస్వామ్య ఉద్దేశమని బ్యాంకు ప్రతినిధులు పేర్కొన్నారు.

## జేఎస్‌పీ హ్యుందాయ్ గ్రీన్ ఇనిషియేటివ్



పర్యావరణ హిత భవిత దిశగా జెఎస్‌పి హ్యుండాయ్, నూరీ ట్రావెల్స్ తో భాగస్వామ్యాన్ని ఏర్పరచుకుంది. ఇందులో భాగంగా కార్పొరేట్ , లాజిస్టిక్స్ రంగాల కోసం హ్యుందాయ్ ప్రైమ్ ఎస్‌డీ, ప్రైమ్ హెచ్‌బీ సీఎన్‌జీ వాహనాల ఫ్లీట్‌ను హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో ని జెఎస్‌పి హ్యుండాయ్ లో శుక్రవారం హ్యుందాయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ తెలంగాణ , ఏపీ రీజనల్ సేల్స్ హెడ్ అమిత్ కుమార్ సింగ్, నూరీ ట్రావెల్స్ మేనేజింగ్ డైరెక్టర్ నబీల్, జెఎస్‌పి హ్యుందాయ్ మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీ రెడ్డి కలిసి సీఎన్‌జీ వాహనాల ఫ్లీట్‌ను ప్రారంభించారు. హ్యుందాయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ రీజనల్ సేల్స్ హెడ్ అమిత్ కుమార్ మాట్లాడుతూ సీఎన్‌జీ వాహనాలు ఇంధన వ్యయం తగ్గించడమే కాకుండా, కాలుష్య నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు.. ఈ కార్యక్రమం ద్వారా కార్బన్ ఉద్గారాలను తగ్గించి, కార్పొరేట్ రంగంలో పర్యావరణ రహిత సియన్ జి వాహనాలను వినియోగించేలా దోహదపడుతుందన్నారు.

## ఘనంగా భారతీ ఎయిర్‌టెల్ కాన్వోకే 2025



భారతీ ఎంటర్‌ప్రైజెస్ యొక్క దాతృత్వ విభాగమైన భారతీ ఎయిర్‌టెల్ ఫౌండేషన్, కాన్స్టిట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియాలో ఉపాధ్యాయుల కోసం దాని ప్రధాన జాతీయ పరిశోధన సింపోజియం అయిన కాన్వోకే 2025 ను నిర్వహించింది. జాతీయ విద్యా విధానం 2020 దార్శనికతకు అనుగుణంగా, తరగతి గది ఆధారిత పరిశోధన మరియు ఆవిష్కరణలు మెరుగైన బోధనా పద్ధతులు మరియు మెరుగైన అభ్యాస ఫలితాలకు ఎలా దారితీస్తాయో ప్రదర్శించడానికి దేశవ్యాప్తంగా ఉన్న ఉపాధ్యాయులు, శిక్షణ పొందిన ఉపాధ్యాయులు, విధాన నిర్ణేతలు, విద్యా రంగ నిపుణులు మరియు భాగస్వాములను ఈ సింపోజియం ఒకచోట చేర్చింది. ఈ కార్యక్రమంలో భారతీ ఎయిర్‌టెల్ ఫౌండేషన్ డిజిటల్ ప్లాట్‌ఫామ్ అయిన ది టీచర్ యాప్ లో టీఎల్ఎం లీగ్ అవార్డుల ప్రదానం కూడా జరిగాయి. భారతీ ఎంటర్‌ప్రైజెస్ వైస్-చైర్మన్ మరియు భారతీ ఎయిర్‌టెల్ ఫౌండేషన్ కో-చైర్మన్ శ్రీ రాకేష్ భారతీ మిట్టల్ మాట్లాడుతూ , "నేటి ఉపాధ్యాయులను శక్తివంతం చేయడం 2047 నాటికి విక్షిత్ భారత్‌ను నిర్మించడానికి చాలా కీలకం, ఇక్కడ విద్య దేశ పురోగతి మరియు శ్రేయస్సుకు పునాది వేస్తుంది అనా అన్నారు.

## రాజస్థాన్‌లో స్టోరీ కాసిల్ కనోటా ప్రారంభం



భారతదేశంలోని వారసత్వ అతిథి సత్కార రంగంలో ఐటీసీ హోటల్స్ సంస్థ మరో మైలురాయిని సాధిస్తూ రాజస్థాన్‌లో స్టోరీ కాసిల్ కనోటా హోటల్‌ను ప్రారంభించింది. నూట యాభై సంవత్సరాల చరిత్ర కలిగిన కనోటా రాజవంశీయ నివాసంతో భాగస్వామ్యంగా ఏర్పడిన ఈ హోటల్ సంప్రదాయం, సంస్కృతి మరియు బాధ్యతాయుత అతిథి సేవలను ప్రతిబింబిస్తుంది. చారిత్రక నిర్మాణ శైలి, కుటుంబ వారసత్వం మరియు స్థానిక జీవన విధానాన్ని కాపాడుతూ ఆధునిక సౌకర్యాలను అతిథులకు అందించడమే దీని ప్రత్యేకత. తరతరాలుగా కొనసాగుతున్న కుటుంబ విలువలు, ఆచారాలు, వంటకాలు మరియు కథల ద్వారా రాజస్థాన్ జీవ వారసత్వాన్ని ప్రత్యక్షంగా అనుభవించే అవకాశం ఈ హోటల్ కల్పిస్తుంది. ప్రత్యేకత గల గమ్యస్థానాలను ప్రతిబింబించే స్టోరీ శ్రేణిని మరింత బలోపేతం చేస్తూ, ఆత్మీయతతో కూడిన సాంస్కృతిక అనుభూతిని అందించడమే ఈ ప్రారంభం లక్ష్యమని సంస్థ తెలిపింది.

## ఆమెజాన్ రిపబ్లిక్ డే సేల్: 50% డిస్కౌంట్



సెన్నహైజర్, ప్రీమియం ఆడియో ఉత్పత్తులపై 50% వరకు తగ్గింపుతో ఆతిథ్యాన్ని ప్రకటించింది. 2026 జనవరి 16 నుంచి ప్రారంభమైన ఈ సేల్, ప్రైమ్ మరియు నాన్-ప్రైమ్ సభ్యుల కోసం అందుబాటులో ఉంది. ప్రైమ్ సభ్యులకు 15 జనవరి రాత్రి 12 గంటల నుంచి ముందస్తు యాక్సెస్ లభిస్తుంది. సెన్నహైజర్ యొక్క ప్రముఖ ఉత్పత్తులపై అదనపు తగ్గింపులు మరియు 24 నెలల నో కోస్ట్ ఈఎంఐ సౌకర్యం అందించబడుతోంది. ఈ ఆఫర్లు ప్రముఖ ప్రోడక్టులైన ప్రొఫైల్ వైర్‌లెస్ మైక్రోఫోన్, ఎండి 421 కొంపాక్ట్, న్యూమాన్ టిఎల్ఎం 102, హెచ్‌డి 630విబి, మొమెంటం 4 వైర్‌లెస్ హెడ్‌ఫోన్‌లు మరియు మొమెంటం ట్రూ వైర్‌లెస్ 4 ఇయర్బడ్స్ పై అందుబాటులో ఉన్నాయి. కస్టమర్లు ఎంపిక చేసిన బ్యాంక్ కార్డ్‌లపై అదనపు డిస్కౌంట్లు కూడా పొందవచ్చు. సెన్‌హైజర్ ప్రొఫైల్ వైర్‌లెస్, మొమెంటం 4, హెచ్‌డి 630విబి వంటి ప్రొడక్టులు రూ. 21,990 నుండి రూ. 56,990 వరకు అందుబాటులో ఉన్నాయి.

## మారుతి సుజుకి 'అక్రాస బ్యాడ్జ్ విక్టోరిస్ ఎగుమతులు



విక్టోరిస్‌ను 100 కంటే ఎక్కువ దేశాలు మరియు ప్రాంతాలకు ఎగుమతి చేయాలని ప్రణాళిక చేయబడింది. ఎగుమతికి ముఖ్యమైన ప్రాంతాలలో లాటిన్ అమెరికా, మిడిల్ ఈస్ట్ మరియు ఆఫ్రికా ఉన్నాయి.విక్టోరిస్‌ను ప్రపంచవ్యాప్తంగా 'అక్రాస్‌గా విక్రయించనున్నారు.మారుతి సుజుకి ఇండియా లిమిటెడ్ ("మారుతి సుజుకి") ఈరోజు తన ప్రీమియం ఎస్‌యూవీ, విక్టోరిస్‌ను ఎగుమతుల కోసం రవాణా ప్రారంభించినట్లు ప్రకటించింది. ప్రపంచ మార్కెట్ల కోసం 450 కి పైగా వాహనాలు ముంద్రా మరియు పిపావావ్ ఓడరేవుల నుండి బయలుదేరాయి. బ్రాండ్ యొక్క 'గాట్ ఇట్ ఆల్ల తత్వాన్ని కలిగి ఉన్న ఈ ఎస్‌యూవీ, ప్రపంచవ్యాప్తంగా 'అక్రాస్‌గా విక్రయించబడుతుంది. దీనితో పాటు, జపాన్ మొబిలిటీ షో 2025లో మేడ్-ఇన్-ఇండియా ఎస్‌యూవీని అంతర్జాతీయ ప్రేక్షకులకు ప్రదర్శించారు.ఈ సందర్భంగా మారుతి సుజుకి ఇండియా లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ & సీఈఓ శ్రీ హిసాషి టకేయుచి మాట్లాడుతూ, "మారుతి సుజుకి ఎగుమతి ప్రయాణం మేక్ ఇన్ ఇండియా, మేక్ ఫర్ ది వరల్డ్ అనే దార్శనికత ద్వారా మార్గనిర్దేశం చేయబడింది. 2025 క్యాలెండర్ సంవత్సరంలో, 3.9 లక్షలకు పైగా వాహనాల ఎగుమతులతో, మేము వరుసగా ఐదవ సంవత్సరం భారతదేశపు నంబర్ వన్ ప్యాసింజర్ వాహన ఎగుమతిదారుగా అవతరించాము. ఈ సంవత్సరం మా మొదటి బ్యాటరీ ఎలక్ట్రిక్ వాహనం, ఇ విటారా ఎగుమతుల ప్రారంభంతో యూరప్‌లోకి మా పునఃప్రవేశాన్ని కూడా సూచిస్తుంది."




# స్టార్టప్ ఇండియా' విప్లవంగా మారింది

● కంఫర్ట్ జోన్‌లో జీవించే ఆలోచన భారతీయ యువతకు లేదు ●రాబోయే పదేళ్లలో స్టార్టప్స్, టెక్‌లో అగ్రగామిగా భారత్
● భారతీయ స్టార్టప్‌ల వైవిధ్యంపై నాకు విశ్వాసముంది ● రిస్క్ తీసుకొని వ్యాపారం పెట్టడం ఇప్పుడొక ఫ్యాషన్
● 'నేషనల్ స్టార్టప్ డే' కార్యక్రమంలో ప్రధాని మోదీ వ్యాఖ్యలు





న్యూఢిల్లీ : రాబోయే పదేళ్లలో స్టార్టప్స్, టెక్ విభాగాల్లో ప్రపంచ అగ్రగామిగా భారత్ను నిలపడమే లక్ష్యమని ప్రధాని మోదీ వెల్లడించారు. ఈ లక్ష్యం దిశగా భారతీయ స్టార్టప్ల వైవిధ్యంతో, సాహసోపేతంగా పురోగమిస్తాయనే పూర్తి విశ్వాసం తనకు ఉందన్నారు. ప్రస్తుత తరుణంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీపై భవిష్యత్ వ్యూహాన్ని కలిగిన దేశాలకే ఎక్కువ ప్రయోజనాలు లభిస్తాయని ఆయన పేర్కొన్నారు. 'నేషనల్ స్టార్టప్ డే' సందర్భంగా శుక్రవారం దిల్లీలోని భారత్ మండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధాని మోదీ ప్రసంగించారు. 2014లో దేశంలో 4 యూనికార్న్లే ఉండగా, ఇప్పుడు వాటి సంఖ్య 125కు చేరిందన్నారు. పదేళ్ల క్రితం 500 స్టార్టప్లే ఉండగా, ఇప్పుడు వాటి సంఖ్య 2 లక్షలు దాటిందన్నారు. ఒక్క 2025 సంవత్సరంలోనే 44వేల స్టార్టప్లు రిజిస్టర్ అయ్యాయని ఆయన తెలిపారు. ప్రస్తుతం ప్రపంచంలో మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థ భారత్లోనే ఉందన్నారు. 'నేషనల్ స్టార్టప్ డే' వేడుకకు హాజరైన స్టార్టప్ల వ్యవస్థాపకులను చూస్తుంటే, తనకు నవ్య భారత్, వికసిత భారత్ కనిపిస్తోందని మోదీ వ్యాఖ్యానించారు.

**కంఫర్ట్ జోన్లో జీవించే ఆలోచన యువతకు లేదు!**

"స్టార్టప్ ఇండియా మిషన్ వేగాన్ని పుంజుకుంటోంది. అదొక విప్లవంగా మారింది. ఇక కంఫర్ట్ జోన్లో జీవించే ఉద్దేశం భారతీయ యువతకు లేనే లేదు. నూతన లక్ష్యాలతో సరికొత్త ఎత్తులకు ఎదగాలని వారు కోరుకుంటున్నారు. అసలైన సమస్యల పరిష్కారంపై భారతీయ యువత, ఎంట్రప్రెన్యూర్లు ఫోకస్ పెట్టారు. టైర్-2, టైర్-3 నగరాలతో పాటు గ్రామీణ ప్రాంతాల యువత కూడా సొంతంగా వ్యాపారాలను ప్రారంభిస్తున్నారు. స్టార్టప్ ఇండియా కార్యక్రమం వల్ల భారత్లో ఏర్పడిన ఎన్నో యూనికార్న్లు స్టాక్ మార్కెట్లో ఐపీఓలకు వస్తున్నాయి. ఎంతోమందికి ఉద్యోగాలను ఇస్తున్నాయి. 45 శాతం భారతీయ స్టార్టప్లలో సగటున ఒక మహిళా డైరెక్టర్ లేదా పార్ట్నర్ ఉన్నారు. మహిళల సారథ్యంలో ఏర్పాటయ్యే స్టార్టప్లకు ఫండింగ్ను అందించే విషయంలో ప్రపంచంలో రెండో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థగా భారత్ ఎదిగింది. స్టార్టప్ ఇండియా కార్యక్రమాన్ని ప్రారంభించక ముందు నేను దిల్లీలోని విజ్ఞాన్ భవన్లో ఓ కార్యక్రమానికి హాజరయ్యాను. అందులో ఓ మహిళా స్టార్టప్ ఆవేదనను విన్నాను. ఉద్యోగాన్ని వదిలేసి స్టార్టప్ను పెడతాను అన్నందుకు తన తల్లి తీవ్ర భయాందోళనకు గురైందని ఆ మహిళ గోడును వెళ్లబోసుకుంది. కానీ ఇప్పుడు పరిస్థితి మారిపోయింది" అని ప్రధాని మోదీ తెలిపారు.

**నెలవారీ శాలరీని మించి ఆలోచించే వాళ్లను గౌరవిస్తున్నారు!**

"గతంలో సొంత వ్యాపారం ప్రారంభించడాన్ని రిస్క్గా భావించేవారు. రిస్క్ పేరు చెప్పి యువతను నిరుత్సాహపరిచేవారు. కానీ ఇప్పుడు రిస్క్ తీసుకొని వ్యాపారాలను మొదలుపెట్టడమే భారతీయ యువతకు ప్రధాన పనిగా మారిపోయింది. భారతీయ స్టార్టప్ల వ్యవస్థాపకుల అత్యద్భుత విశ్వాసం, గొప్ప ఆశయాలను చూసి నేను మంత్రముగ్ధుడిని అయ్యాను. ఒకప్పుడు సొంత వ్యాపారం పెట్టడం అనేది కెరీర్లో చిట్టచివరి ఆప్షన్గా ఉండేది. కానీ ఇప్పుడది ఒక ఫ్యాషన్గా మారిపోయింది. నెలవారీ శాలరీని మించి ఆలోచించే వాళ్లను ఇప్పుడు అందరూ స్వాగతిస్తున్నారు, గౌరవిస్తున్నారు" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

కొత్త వ్యాపార అవకాశాలతో అన్ని రంగాలకు కనెక్టివిటీ

"స్టార్టప్ ఇండియా అనేది ఒక స్కీం మాత్రమే కాదు. దానికి ఇంద్ర ధనుస్సు లాంటి పెద్ద విజన్ ఉంది. కొత్త వ్యాపార అవకాశాలతో దేశంలోని అన్ని రంగాలను కనెక్ట్ చేయడమే దీని లక్ష్యం. భారతీయ స్టార్టప్లు తయారీ రంగం, పరిశోధనలపైనా ఫోకస్ పెట్టాల్సిన సమయం వచ్చేసింది. ఈ రోజు చేసే పరిశోధనే రేపటి ఇంటలెక్చువల్ ప్రాపర్టీగా మారుతుంది. స్టార్టప్లకు సీడ్ ఫండ్ను అందించడానికి మేం చాలా స్కీంలను అమల్లోకి తెచ్చాం. కాలం చెల్లిన రూల్స్ అన్నీ తొలగించాం. స్టార్టప్ల వ్యవస్థాపకుల ఐడియాలను మేం బలంగా నమ్మాం. ఈ ఏడాదితో స్టార్టప్ ఇండియా కార్యక్రమం పదేళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకుంది. దీనివల్ల మేం వేలాది మందికి కలలు కనే ధైర్యాన్ని ఇచ్చాం. ఎంతోమంది వారి వ్యాపార కలలను సాకారం చేసుకున్నారు. ఈ శుభ సందర్భంగా ప్రతీ ఒక్క స్టార్టప్ అని ప్రధాని మోదీ తెలిపారు.

# మా ప్రభుత్వంపై బిజేపీ కుట్రలు

● ప్రత్యేక సవరణ ప్రక్రియతో ఓట్ల తొలగింపు
● వలస కూలీల కుటుంబాలకు అండగా ఉంటాం
● పశ్చిమబెంగాల్ సిఎం మమతా బెనర్జీ



కోల్కతాః పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ భారత ఎన్నికల సంఘం పనితీరుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు, రాష్ట్రంలో ప్రస్తుతం కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో మైనారిటీలు , వెనుకబడిన వర్గాలను లక్ష్యంగా చేసుకుని వివక్ష చూపుతున్నారని ఆమె సంచలన ఆరోపణలు చేశారు. కోల్కతా విమానాశ్రయం వద్ద మీడియాతో మాట్లాడిన ఆమె, ఎన్నికల సంఘం ఉద్దేశపూర్వకంగానే మైనారిటీ ఓటర్ల పేర్లను జాబితా నుండి తొలగిస్తోందని, దీనివల్ల వేలాది మంది ప్రజలు తమ ప్రాథమిక ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా మైనారిటీ ప్రాబల్యం ఎక్కువగా ఉన్న మాల్దా జిల్లాలో ఒక్కసారిగా సుమారు 90,000 మంది ఓటర్ల పేర్లను తొలగించడానికి సన్నాహాలు చేస్తున్నారని, ఇది ప్రజాస్వామ్య విలువలకే విరుద్ధమని ఆమె పేర్కొన్నారు. కేవలం మైనారిటీలే కాకుండా మతువా, రాజ్బంశీ , గిరిజన సామాజిక వర్గాలకు చెందిన వారిని కూడా ఈ జాబితా సవరణ పేరుతో వేధిస్తున్నారని, చివరికి అమర్త్య సేన్ వంటి మేధావులను కూడా ఈ ప్రక్రియలో విడిచిపెట్టడం లేదని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని రాజకీయ పరిణామాలను వివరిస్తూ, పశ్చిమ బెంగాల్లో అశాంతిని సృష్టించడానికి భారతీయ జనతా పార్టీ కుట్రలు పన్నుతోందని మమతా బెనర్జీ ఆరోపించారు. ముర్షిదాబాద్లోని బెల్డంగాలో చోటుచేసుకున్న ఉద్రిక్త పరిస్థితులపై స్పందిస్తూ, ప్రజలు ఎవరూ కూడా రెచ్చగొట్టే చర్యలకు లోనుకావద్దని , శాంతిని కాపాడాలని ఆమె విజ్ఞప్తి చేశారు. కేంద్ర దర్యాప్తు సంస్థలను ఉపయోగించుకుని రాష్ట్ర యంత్రాంగాన్ని ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారని, అదే సమయంలో బీజేపీ పాలిత రాష్ట్రాల్లో బెంగాల్కు చెందిన వలస కూలీలపై దాడులు జరుగుతున్నా కేంద్రం పట్టించుకోవడం లేదని ఆమె విమర్శించారు. తన ప్రభుత్వం ఎల్లప్పుడూ వలస కూలీల కుటుంబాలకు అండగా ఉంటుందని భరోసా ఇస్తూనే, కేంద్ర సంస్థల జోక్యంపై సుప్రీంకోర్టులో జరుగుతున్న పరిణామాలను కూడా ఆమె పరోక్షంగా ప్రస్తావించారు. మొత్తంమీద, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పారదర్శకంగా జరగడం లేదని, ఇది ఒక నిర్దిష్ట వర్గాన్ని రాజకీయంగా బలహీనపరిచే చర్య అని ఆమె తన ప్రసంగంలో స్పష్టం చేశారు.

# పాక్‌ను అడ్డుకోవాల్సిందే

●'విభజన అజెండా' కోసం ●ఐరాస వేదికలన్నీ పాక్ దుర్వినియోగం చేస్తోంది ●విభజన అజెండాతో విషం కక్కుతోంది
●ఐరాసలో జమ్ము కశ్మీర్ గురించి మాట్లాడటం సరికాదు ● భారత శాశ్వత మిషన్ కౌన్సెలర్ మ్యాథ్యూ పున్నూస్ వ్యాఖ్యలు



వాఃషింగ్టన్ : విభజన అజెండా కోసం ఐక్యరాజ్యసమితి(ఐరాస) వేదికలను పాకిస్థాన్ దుర్వినియోగం చేస్తోందని భారత్ మండిపడింది. ఐరాస ఛార్టర్ ప్రకారం లభించిన స్వీయ నిర్ణయ హక్కును పాక్ దుర్వినియోగం చేయకుండా అడ్డుకోవాలని పిలుపునిచ్చింది. స్వీయ నిర్ణయ హక్కును వాడుకొని మతపరమైన వైవిధ్యం కలిగిన ప్రజాస్వామిక దేశాల్లో విభజనవాదాన్ని ప్రోత్సహించేలా మాట్లాడకుండా పాక్ను నిరోధించాలని కోరింది. ఐరాసలోని భారత శాశ్వత మిషన్ కౌన్సెలర్ ఎల్డోస్ మ్యాథ్యూ పున్నూస్ ఈ మేరకు పలు వ్యాఖ్యలు చేశారు. 2025లో ఐరాస కార్యకలాపాలపై సెక్రెటరీ జనరల్ విడుదల చేసిన వార్షిక నివేదికపై అమెరికాలోని న్యూయార్క్లో ఉన్న ఐరాస జనరల్ అసెంబ్లీలో చర్చ జరిగింది. ఈ సందర్భంగా మ్యాథ్యూ పున్నూస్ ప్రసంగించారు.

కశ్మీర్ గురించి మాట్లాడే హక్కు పాక్కు లేదు : ప్రపంచ దేశాలన్నీ సంకుచిత ఆలోచనా దృక్పథం నుంచి బయటికొచ్చి మాట్లాడుతుంటే, పాక్ మాత్రమే విభజన అజెండాతో విషం కక్కుతోందని మ్యాథ్యూ పున్నూస్ మండిపడ్డారు. భారత్లో ఒక భాగమైన కేంద్రపాలిత ప్రాంతం జమ్మూకశ్మీరు గురించి మాట్లాడేందుకు ఐరాసను పాక్ వేదికగా చేసుకోవడం సరికాదన్నారు. మరో దేశానికి చెందిన భూభాగం గురించి మాట్లాడే హక్కు ముమ్మాటికీ పాక్కు లేదన్నారు. 1948 ఏప్రిల్ 21న ఐరాస భద్రతా మండలి చేసిన తీర్మానం ప్రకారం జమ్మూకశ్మీరు నుంచి సేనలను పాక్ వెనక్కి తీసుకున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. నాటి నుంచి జమ్మూకశ్మీరు ప్రజలు స్వేచ్ఛగా ఎన్నికలలో ఓట్లు వేస్తూ, తమ ప్రతినిధులను చట్టసభలకు పంపుతున్నారని మ్యాథ్యూ పున్నూస్ తెలిపారు. ఈవిధంగా తాము భారతదేశ పక్షమే అనే సందేశాన్ని జమ్మూకశ్మీరు ప్రజలు ఇచ్చారని స్పష్టం చేశారు. పాక్ ప్రతినిధి ఆసిమ్ ఇఫ్తిఖార్ అహ్మద్ ఈ ఐరాస సెషన్లో జమ్మూకశ్మీరు అంశాన్ని లేవనెత్తడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు.

పాక్కు అలవాటుగా మారిపోయింది : "విభజనవాద అజెండాను అన్ని వేదికల్లో ప్రమోట్ చేయడం పాకిస్థాన్కు అలవాటుగా మారిపోయింది. ఆ అలవాటునే ఇప్పుడు పాక్ కొనసాగిస్తోంది. మేం పాక్ వాదనకు కౌంటర్ ఇవ్వక తప్పదు. ఒకవేళ పాక్ నిరాధార ఆరోపణలు, అవాస్తవాలను మేం ఎప్పటికప్పుడు తిప్పి కొట్టకుంటే, అది వాస్తవ విరుద్ధ అంశాలను ఇలాగే చెబుతుంటుంది. మేం ఐరాసకు చెందిన అన్ని వేదికల్లో వాస్తవాలను తెలియజేస్తున్నాం. పాక్ను నిలువరించాల్సిన అవసరం ఉంది" అని మ్యాథ్యూ పున్నూస్ పేర్కొన్నారు.

ప్రపంచ శాంతిపై ఐరాస గళం విప్పాలి

"గ్లోబల్ సౌత్ దేశాల సెంటిమెంట్ను ఐరాస గౌరవించాలి. ఆ దిశగా నిర్దిష్ట చర్యలను చేపట్టాలి. దశాబ్దాల కిందటి సమీకరణాల ప్రకారం ప్రస్తుతం ఐరాసలో ప్రపంచ దేశాలకు ప్రాధాన్యతలు ఉన్నాయి. ఈ పరిస్థితి మారాలి. తాజా సమీకరణాల ప్రకారం ప్రపంచ దేశాలకు ప్రాధాన్యతలు దక్కాలి. ప్రపంచంలోనే అతిపెద్ద బహుళ పక్ష సంస్థ ఐరాస ప్రస్తుత సందర్భానికి అనుగుణంగా మారాలి. ప్రస్తుతం చాలా సంక్లిష్టమైన దశను ఐరాస చవిచూస్తోంది. క్లిష్టమైన సవాళ్లను అది ఎదుర్కొంటోంది. శాంతి, భద్రత, వికాసం - మానవ హక్కులపై ఐరాస గళం విప్పాలని ప్రపంచ పౌరులు ఆశాభావంతో ఎదురు చూస్తున్నారు. అంతర్జాతీయ సమాజానికి సంబంధించిన కీలకమైన విధులను నిర్వర్తించలేని స్థితికి ఐరాస చేరడం అనేది దాని ప్రభావశీలత, ధర్మబద్ధత, విశ్వసనీయతలను ప్రశ్నార్థకంగా మార్చింది. ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో సంక్షోభాలు చోటుచేసుకుంటున్న ప్రస్తుత తరుణంలో, ఆయా చోట్ల మనుషుల బాధలను తొలగించేలా ఐరాస మాట్లాడుతుందని ప్రపంచం ఆశిస్తోంది" అని మ్యాథ్యూ పున్నూస్ వ్యాఖ్యానించారు.

ఇరాన్ అంతర్గత విషయాల్లో ఎవరూ జోక్యం చేసుకోకూడదు : పాక్ "ఇరాన్ అంతర్గత విషయాల్లో ఎవరూ జోక్యం చేసుకోకూడదు. ఈ విషయంలో అన్ని పక్షాలూ సంయమనంతో వ్యవహరించాలి. అమెరికా - ఇరాన్ ఉద్రిక్తతలను తగ్గించడమే ప్రాంతీయ సుస్థిరతకు దోహదం చేస్తుంది. ఈ అంశాన్ని పాక్ నిశితంగా పరిశీలిస్తోంది. ప్రాంతీయ శాంతి, సుస్థిరతలకు కొత్త ముప్పులు ఏర్పడటం ఆందోళన రేకెత్తిస్తోంది" అని ఐరాస సెషన్లో పాక్ ప్రతినిధి ఆసిమ్ ఇఫ్తిఖార్ అహ్మద్ పేర్కొన్నారు.

# మహారాష్ట్ర మున్సిపల్ పోల్స్‌లో 'మహాయుతి' హవా

● ముంబయి, థానే, పుణె, నాగ్‌పూర్‌లలో కమలం ఆధిక్యం
● ఓటర్లపై ఈసీ గ్యాస్ లైటింగ్ చేస్తోందంటూ రాహుల్ గాంధీ ఆరోపణలు




ముంబై: ఓ వైపు ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల కౌంటింగ్లో అధికార మహాయుతి కూటమి ఆధిక్యంలో దూసుకుపోతుంటే, మరోవైపు ఎన్నికల ప్రక్రియపై విపక్షాలు విమర్శనాస్త్రాలను ఎక్కుపెట్టాయి. ఎన్నికల సంఘం గ్యాస్ లైటింగ్ చేస్తూ దేశ పౌరులను మానసిక గందరగోళంలోకి నెడుతోందని ఆరోపిస్తూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ట్వీట్ చేశారు. ఈసీ చేష్టల వల్ల భారత ప్రజాస్వామ్యంపై ప్రజలు విశ్వాస భావనను కోల్పోయారని విమర్శించారు. ఓట్లచోరీకి పాల్పడటం దేశ వ్యతిరేక చర్య అని ఆయన వ్యాఖ్యానించారు. పోలింగ్లో నాసి రకం ఇంకుతో కూడిన మార్కర్లను వినియోగించడంపై విపక్షాలు, ఓటర్లు ఆందోళన వ్యక్తం చేశారంటూ ప్రచురితమైన ఓ వార్తా కథనం క్లిప్పింగ్ను తన ట్వీట్లో రాహుల్గాంధీ షేర్ చేశారు. ఇక రాహుల్కు వెంటనే బీజేపీ బలమైన కౌంటర్ ఇచ్చింది.

ఓడిపోతున్నారనే నిరాశావాదంలో రాహుల్ ఇలా మాట్లాడారు : బీజేపీ స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ఓడిపోతున్నారనే నిరాశావాదంలో రాహుల్ గాంధీ ఇలా మాట్లాడుతున్నారని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి సీఆర్ కేశవన్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఘోర వైఫల్యం నుంచి ప్రజల చూపును మరల్చడానికి ఇలాంటి వ్యాఖ్యలను రాహుల్ చేస్తుంటారని విమర్శించారు. రాహుల్ గాంధీకి ప్రజల్లో విశ్వసనీయత లేదని, లోక్సభ విపక్ష నేత హోదాలో ఉన్న ఆయన ప్రచార నేతగా మారిపోయారని సీఆర్ కేశవన్ ఎద్దేవా చేశారు. అప్రజాస్వామికంగా వ్యవహరించే రాహుల్ గాంధీ చాతుర్యం గురించి ప్రజలకు బాగా తెలుసన్నారు. ఎన్నికల్లో ఓడిపోయినప్పుడల్లా కుట్ర సిద్ధాంతాలను తెరపైకి తెచ్చి ప్రజలను గందరగోళంలోకి నెట్టడం రాహుల్ గాంధీకి అలవాటుగా మారిందని ఆయన ధ్వజమెత్తారు. మహారాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ఇండియా కూటమి ఏమీ చేయలేకపోయిందన్నారు. ఎన్నికల సంఘాన్ని విమర్శించడం ద్వారా రాహుల్ గాంధీలోని పిల్లల తరహా మానసిక స్థితి మరోసారి బయటపడిందని సీఆర్ కేశవన్ పేర్కొన్నారు.

# 20వ తేదీన బీజేపీ జాతీయ అధ్యక్షుడి ఎన్నిక

## నితిన్ నబీన్ ఎన్నిక లాంఛనమే!



న్యూఢిల్లీ : నూతన జాతీయ అధ్యక్షుడిని భారతీయ జనతా పార్టీ ఈనెల 20న ప్రకటించనుంది. ఈ మేరకు పార్టీ నూతన అధ్యక్షుడి ఎన్నిక షెడ్యూల్ను విడుదల చేసింది. ఈ పదవి కోసం ఈ నెల 19న నామినేషన్లు స్వీకరిస్తామని తెలిపింది. జనవరి 20న కొత్త అధ్యక్షుడి పేరును ప్రకటించనున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు బీజేపీ రిటర్నింగ్ అధికారి కె.లక్ష్మణ్ ఎన్నికల షెడ్యూల్ను ప్రకటించారు. ఈనెల19న మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల మధ్య అభ్యర్థులు తమ నామినేషన్లు సమర్పించవచ్చని లక్ష్మణ్ తెలిపారు. తర్వాత నామినేషన్ల పరిశీలన చేపడతామన్నారు. అదేరోజు సాయంత్రం 5 నుంచి 6 గంటల మధ్య నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంటుందన్నారు. ఎక్కువ మంది అభ్యర్థులు ఉండి ఎన్నిక జరపాల్సి వస్తే జనవరి 20న పోలింగ్ నిర్వహించి విజేతను ప్రకటిస్తామని వివరించారు. ఈ ప్రక్రియంతా దిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో జరగనుందని తెలిపారు.

నితిన్ నబీన్ ఏకగ్రీవం?

బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా ఇటీవల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్గా నియమితులైన నితిన్ నబీన్ ఎన్నిక లాంఛనమే అన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రస్తుతం బీజేపీ అధ్యక్షుడిగా ఉన్న జేపీ నడ్డా స్థానంలో నబీన్ బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉన్నట్లు సమాచారం. యువ నాయకత్వాన్ని తయారు చేసుకోవడడంలో భాగంగా నబీన్కు పార్టీ సారథ్య బాధ్యతలు అప్పగించే అవకాశాలు కన్పిస్తున్నాయి. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షా వంటి అగ్రనేతల మద్దతు నితిన్ నబీన్కు ఉన్నట్లు తెలుస్తోంది.

ఐదుసార్లు ఎమ్మెల్యేగా : 1980 మే 23న రాంచీలో జన్మించిన నబీన్ జన్మించారు. నబీన్సిన్హా విద్యాభ్యాసం దిల్లీలో పూర్తయింది. కాయస్థ సామాజికవర్గానికి చెందిన నబీన్ సిన్హాకు ఆర్ఎస్ఎస్ నేపథ్యం ఉంది. ఆయన తండ్రి నబీన్కిశోర్ ప్రసాద్ సిన్హా కూడా బిహార్లో సీనియర్ బీజేపీ నేతగా గుర్తింపు పొందారు. 2005లో తండ్రి ఆకస్మిక మరణంతో నితిన్ 26 ఏళ్ల వయసులో రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చారు. 2006లో జరిగిన ఉప ఎన్నికలో ఎమ్మెల్యేగా గెలిచారు. ఇక ఆ తర్వాత నుంచి ఓటమి చవిచూడలేదు. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఛత్తీస్గఢ్ వ్యవహారాల ఇన్చార్జిగా పనిచేశారు. అక్కడ బీజేపీని అధికారంలోకి తేవడంలో కీలకంగా వ్యవహరించారు. గతేడాది జరిగిన బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో బాంకీపుర్ నుంచి ఐదోసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. నీతీశ్ సర్కార్లో రెండు సార్లు మంత్రిగా కూడా పని చేశారు. బిహార్ నుంచి పార్టీలో ఆ స్థాయికి చేరిన తొలినేతగా నబీన్ గుర్తింపు సాధించారు. 2025 డిసెంబర్ 14న బీజేపీ వర్కింగ్ ప్రెసిడెంట్గా నియమితులయ్యారు.

ఎన్నికలే లక్ష్యం : ఇదిలా ఉండగా కొత్త అధ్యక్షుడి పదవీ కాలం, భవిష్యత్ కార్యాచరణపై కూడా స్పష్టత వచ్చింది. సాధారణంగా అధ్యక్ష పదవీ కాలం మూడేళ్లు ఉంటుంది. దీని ప్రకారం, నితిన్ నబిన్ పదవీ కాలం జనవరి 2026 నుంచి ప్రారంభమై జనవరి 2029 వరకు ఉంటుంది. అయితే 2029లో లోక్ సభ ఎన్నికలు జరగనున్నాయి. ఆ ఎన్నికల దృష్ట్యా, ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు ఆయన పదవీ కాలాన్ని 2029 తర్వాత కూడా పొడిగించే అవకాశం ఉన్నట్లుగా తెలుస్తోంది. మరోవైపు ఈ ఏడాది బంగాల్, తమిళనాడు, కేరళ, అసోం, పుదుచ్చేరిలో ఎన్నికలు జరగనున్నాయి. ఇప్పటికే రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు పార్టీ సన్నాహాల్లో నబిన్ నిమగ్నమై ఉన్నారు. తమిళనాడు అధికార పార్టీ డీఎంకేను ఎదుర్కొనేందుకు పార్టీ చేస్తున్న సన్నాహాలను సమీక్షించడానికి రాష్ట్రంలో కూడా సందర్శించారు. కాంగ్రెస్ నుంచి గట్టిపోటీని ఎదుర్కొనున్న అసోంలో కూడా పర్యటించారు. వచ్చే ఏడాదిలో ఉత్తర్ప్రదేశ్, మణిపుర్, పంజాబ్, గోవా, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, గుజరాత్లో ఎన్నికలు జరుగుతాయి.

# మావోయిస్ట్ పార్టీకి బిగ్ షాక్..

## మరో 52 మంది సరెండర్

బీజాపూర్ః ప్రజా యుద్ధం, సాయుధ పోరాటం అంటూ దశాబ్దాలుగా అడవుల్లో సాగుతున్న మావోయిస్టు ఉద్యమానికి ఛత్తీస్గఢ్లో భారీ విఘాతం కలిగింది. వరుస ఎన్కౌంటర్లు, కీలక నేతల అరెస్టులతో ఇప్పటికే కకావికలమవుతున్న మావోయిస్టు పార్టీకి మరో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఛత్తీస్గఢ్లోని బీజాపూర్ జిల్లాలో ఏకంగా 52 మంది మావోయిస్టులు గురువారం పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఒకేసారి ఇంత పెద్ద సంఖ్యలో కేడర్ జనజీవన స్రవంతిలోకి రావడం మావోయిస్టు శ్రేణుల్లో ఆందోళన కలిగిస్తోంది.

పోలీసుల సమక్షంలో లొంగుబాటు : బీజాపూర్ జిల్లా ఎస్పీ డాక్టర్ జితేంద్ర కుమార్ యాదవ్, సీఆర్పీఎఫ్ ఉన్నతాధికారుల సమక్షంలో ఈ లొంగుబాటు ప్రక్రియ జరిగింది. సరెండర్ అయిన వారిలో 21 మంది మహిళలు, 31 మంది పురుషులు ఉన్నారు. వీరంతా దండకారణ్యం, ఏవోబీ (ఆంధ్ర-ఒడిశా బోర్డర్), మహారాష్ట్రలోని భామ్రాఘర్ ఏరియా కమిటీలకు చెందిన కీలక సభ్యులుగా పోలీసులు గుర్తించారు. ప్రభుత్వం ప్రకటించిన పునరావాస పథకాల పట్ల ఆకర్షితులై, హింసా మార్గాన్ని వీడి శాంతియుత జీవనం గడపాలని వీరు నిర్ణయించుకున్నారు.

1.41 కోట్ల రూపాయల భారీ రివార్డు : లొంగిపోయిన వారి నేపథ్యం పరిశీలిస్తే, వీరిలో అత్యధికులు కీలకమైన ఆపరేషన్లలో పాల్గొన్నవారే. మొత్తం 52 మందిలో 49 మంది మావోయిస్టులపై ప్రభుత్వం గతంలోనే భారీ రివార్డులను ప్రకటించింది. వీరిపై ఉన్న మొత్తం రివార్డు విలువ దాదాపు 1.41 కోట్ల రూపాయలు ఉంటుందని ఎస్పీ జితేంద్ర కుమార్ యాదవ్ వెల్లడించారు. అనేక హింసాత్మక ఘటనలు, ఐఈడీ దాడులు, పోలీసులపై మెరుపు దాడుల్లో వీరికి ప్రమేయం ఉన్నట్లు రికార్డులు చెబుతున్నాయి. కాలం చెల్లిన సిద్ధాంతాలు వద్దు.. ఎస్పీ పిలుపు ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. మావోయిస్టు పార్టీ అనుసరిస్తున్న సిద్ధాంతాలకు కాలం చెల్లిందని అభిప్రాయపడ్డారు. అభివృద్ధికి ఆటంకం కలిగిస్తూ, అమాయక గిరిజనులను బలి చేస్తున్న హింసా మార్గాన్ని వీడాలని ఆయన కోరారు.

# ఎయిర్ ఇండియా విమానానికి తప్పిన ప్రమాదం


● ఇరాన్ గగనతలం మూసివేతతో వెనక్కి..
● ఇంజిన్ దెబ్బతిందన్న అధికార వర్గాలు




న్యూఢిల్లీ : ఢిల్లీ నుంచి న్యూయార్క్ బయలుదేరిన ఎయిర్ ఇండియా విమానం ఊహించని పరిణామాల మధ్య తిరిగి ఢిల్లీ విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండ్ అయింది. ఇరాన్ గగనతలం అకస్మాత్తుగా మూతపడటంతో, ముందుగా నిర్ణయించిన మార్గంలో ప్రయాణించడం సాధ్యం కాక పైలట్లు విమానాన్ని వెనక్కి మళ్లించారు. అయితే, ఢిల్లీలో ల్యాండ్ అయిన తర్వాత దట్టమైన మంచు కారణంగా ట్యాక్సీ వేపై ప్రయాణిస్తుండగా, విమానం ఇంజిన్లోకి ఒక అపరిచిత వస్తువు వెళ్లడంతో కుడివైపు ఇంజిన్ తీవ్రంగా దెబ్బతింది. అదృష్టవశాత్తూ, ప్రయాణికులు సిబ్బంది అందరూ సురక్షితంగా ఉన్నారని, విమానాన్ని కేటాయించిన పార్కింగ్ స్టాండ్కు తరలించినట్లు ఎయిర్ ఇండియా ప్రతినిధి తెలిపారు. తాజా ఘటనపై ఎయిర్ ఇండియా స్పందిస్తూ..ఈ ప్రమాదం జరిగిన సమయంలో విమానంలో ప్రయాణిస్తున్న ఒక ప్రయాణికుడు తీసిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అందులో విమానం రన్వేపై నిలిచి ఉండటం, సిబ్బంది దెబ్బతిన్న ఇంజిన్ను పరిశీలించడం కనిపిస్తోంది. అదృష్టవశాత్తూ, ప్రయాణికులు సిబ్బంది అందరూ సురక్షితంగా ఉన్నారని, విమానాన్ని కేటాయించిన పార్కింగ్ స్టాండ్కు తరలించినట్లు ఎయిర్ ఇండియా ప్రతినిధి తెలిపారు. తాజా ఘటనపై ఎయిర్ ఇండియా స్పందిస్తూ.. ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి విచారం వ్యక్తం చేసింది. బాధితులకు ప్రత్యామ్నాయ ప్రయాణ ఏర్పాట్లు లేదా రీఫండ్ అందజేస్తున్నట్లు ప్రకటించింది. భద్రతే తమ మొదటి ప్రాధాన్యతని ఎయిర్ ఇండియా స్పష్టం చేసింది.

# ఆర్టికల్ 32 దుర్వినియోగమవుతోంది

●ఆర్టికల్ 32 కింద దాఖలు అయిన పిటిషన్లపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు
●ఒక్క వాయిదా పడినా వచ్చేస్తున్నారు ● హైకోర్టులో పెండింగ్లో ఉన్న వాటిపై మళ్లీ మాదగ్గరకెందుకు : సుప్రీంకోర్టు ఆగ్రహం



న్యూఢిల్లీ : ప్రాథమిక హక్కుల పరిరక్షణ కోసం భారత రాజ్యాంగంలో అత్యంత కీలకమైన ఆర్టికల్ 32ను దుర్వినియోగం చేస్తున్నారంటూ సుప్రీంకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. హైకోర్టుల్లో కేసులు పెండింగ్లో ఉండగానే, నేరుగా సుప్రీంకోర్టును ఆశ్రయించే అలవాటు ఎక్కువవుతోందని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ విషయంలో స్పష్టమైన హెచ్చరిక చేస్తూ, ఇలాంటి చర్యలు కోర్టు ప్రక్రియకు విరుద్ధమని తేల్చి చెప్పింది. శుక్రవారం నాడు జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్తో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. బాంబే హైకోర్టులో ఇదే అంశంపై ఇప్పటికే పిటిషన్ విచారణలో ఉండగానే, అదే విషయాన్ని ప్రస్తావిస్తూ ఒక వ్యక్తి నేరుగా సుప్రీంకోర్టులో ఆర్టికల్ 32 కింద పిటిషన్ దాఖలు చేయడాన్ని ధర్మాసనం తీవ్రంగా తప్పుబట్టింది. ఈ పిటిషన్ను కోర్టు ప్రక్రియను, చట్టాన్ని తీవ్రంగా దుర్వినియోగం చేసిన చర్యగా పేర్కొంటూ, వెంటనే కొట్టివేసింది.

హైకోర్టులో ఒక్క వాయిదా పడితే చాలు!

ఈ సందర్భంగా ధర్మాసనం తీవ్ర వ్యాఖ్యలు చేసింది. "ఆర్టికల్ 32ను స్పష్టంగా దుర్వినియోగం చేస్తున్నారు. ఈ ఆర్టికల్ కింద దాఖలయ్యే పిటిషన్ల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ప్రతి చిన్న విషయానికీ, హైకోర్టులో ఒక్క వాయిదా పడితే చాలు, ఇక్కడికి వచ్చి ఆర్టికల్ 32 కింద పిటిషన్ వేస్తున్నారు. ముఖ్యంగా దిల్లీ చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ఇలాంటి పిటిషన్లు ఎక్కువగా వస్తున్నాయి. ఇది ఏమిటి? ఇది పూర్తిగా దుర్వినియోగమే" అంటూ అసహనం వ్యక్తం చేసింది.

ప్రతి సందర్భంలోనూ వినియోగించుకోవడం సరికాదు!

ఆర్టికల్ 32 అనేది పౌరుల ప్రాథమిక హక్కుల ఉల్లంఘన జరిగినప్పుడు, నేరుగా సుప్రీంకోర్టును ఆశ్రయించే హక్కును కల్పిస్తుంది. దీనిని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగానికి హృదయం, ఆత్మగా అభివర్ణించారు. ఈ ఆర్టికల్ ద్వారా పౌరులు తమ హక్కులకు తక్షణ న్యాయ పరిరక్షణ పొందే అవకాశం ఉంది. అయితే, ఈ హక్కును ప్రతి సందర్భంలోనూ వినియోగించుకోవడం సరికాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. వేగంగా ఉపశమనం పొందేందుకు ఉపయోగించకూడదు ప్రత్యేకంగా, హైకోర్టులు ఇప్పటికే ఆ విషయాన్ని విచారిస్తున్నప్పుడు, లేదా హైకోర్టును ఆశ్రయించే అవకాశం ఉన్నప్పుడు, నేరుగా సుప్రీంకోర్టుకు రావడం సరికాదని ధర్మాసనం తేల్చి చెప్పింది. అలాంటి సందర్భాల్లో ఆర్టికల్ 226 కింద హైకోర్టులను ఆశ్రయించాల్సిన అవసరం ఉందని గుర్తు చేసింది. ఆర్టికల్ 32ను హైకోర్టులను దాటవేసేందుకు లేదా వేగంగా ఉపశమనం పొందేందుకు ఉపయోగించకూడదని స్పష్టంగా హెచ్చరించింది. పిటిషన్ దాఖలు చేయడం అనవసరం ఈ కేసులో, బాంబే హైకోర్టులో సంబంధిత పిటిషన్ ఇప్పటికే పెండింగ్లో ఉండగా, అదే అంశంపై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేయడం అనవసరమని ధర్మాసనం అభిప్రాయపడింది. ఇది న్యాయవ్యవస్థలో గందరగోళం సృష్టించడమే కాకుండా, అత్యున్నత న్యాయస్థాన సమయాన్ని వృథా చేయడమేనని వ్యాఖ్యానించింది. సుప్రీంకోర్టు గతంలోనూ పలుమార్లు ఇదే అంశంపై స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసింది.

హైకోర్టుల్లో సరైన పరిష్కారం లభించని సందర్భాల్లోనే!

ఆర్టికల్ 32ను అత్యవసర పరిస్థితుల్లో, నిజంగా ప్రాథమిక హక్కుల ఉల్లంఘన జరిగినప్పుడు మాత్రమే వినియోగించాల్సిన అవసరం ఉందని మరోసారి స్పష్టం చేసింది. హైకోర్టుల్లో సరైన పరిష్కారం లభించని సందర్భాల్లోనే సుప్రీంకోర్టును ఆశ్రయించాలని సూచించింది. మొత్తంగా, ఆర్టికల్ 32 కింద దాఖలైన ఈ పిటిషన్ను కోర్టు ప్రక్రియకు, చట్టానికి స్పష్టమైన దుర్వినియోగంగా అభివర్ణించిన ధర్మాసనం, దానిని పూర్తిగా కొట్టివేసింది. కఠినంగా వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.




## బీఆర్ఎస్ ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు

# సుప్రీం కోర్టులో విచారణ వాయిదా

**రెండు వారాల తర్వాత స్పీకర్ తన నిర్ణయాన్ని కోర్టుకు తెలపాలని ధర్మాసనం ఆదేశం**



తెలంగాణ బ్యూరో ప్రతినిధిః బీఆర్ఎస్ పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసుపై సుప్రీం కోర్టులో విచారణ వాయిదా పడింది. రెండు వారాల తరువాత ముగ్గురు ఎమ్మెల్యేల అనర్హతపై తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ చేపట్టిన ప్రక్రియపై అఫిడవిట్ దాఖలు చేయాలని ధర్మాసనం ఆదేశించింది. అయితే నాలుగు వారాల సమయం కావాలని స్పీకర్ తరఫు న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ న్యాయస్థానాన్ని కోరారు. ఈ కేసులో పురోగతిని పరిశీలించి అవసరమైతే మరో రెండు వారాల గడువు పెంచుతామని ధర్మాసనం స్పష్టం చేసింది. శుక్రవారం ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసుపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ అగస్టిన్ జార్జ్‌ల ధర్మాసనం ముందు ఈ కేసు విచారణకు వచ్చింది. బీఆర్ఎస్ నుంచి ఫిరాయించిన 10 మంది ఎమ్మెల్యేలలో ఇప్పటికే ఏడుగురు ఎమ్మెల్యేల అనర్హతపై తెలంగాణ స్పీకర్ నిర్ణయం తీసుకున్నారని.. మిగతా ముగ్గురు ఎమ్మెల్యేలపై నిర్ణయానికి కొంత సమయం కావాలని స్పీకర్ తరఫు న్యాయవాది కోరారు. స్పీకర్‌కు కంటి శస్త్ర చికిత్స జరగడంతో ఆస్పత్రిలో ఉన్నారని, కొత్త అసెంబ్లీ సెక్రటరీ జనరల్ వచ్చినందున ప్రక్రియ ఆలస్యమైందని న్యాయవాది అభిషేక్ మనుసింఘ్వీ కోర్టుకు నివేదించారు. ఇప్పటివరకు స్పీకర్ తీసుకున్న నిర్ణయాలను నివేదిక రూపంలో ఆయన కోర్టుకు సమర్పించారు. మిగతా ముగ్గురు సభ్యులపై నిర్ణయం తీసుకునేందుకు నాలుగు వారాల సమయం కావాలని ధర్మాసనానికి స్పీకర్ తరఫు న్యాయవాది విజ్ఞప్తి చేశారు. గత ఏడాదిగా ఇదే చెబుతున్నారని బీఆర్ఎస్ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. గతంలో మూడు నెలల్లోనే ఫిరాయింపు ఎమ్మెల్యేలపై నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశించినా పట్టించుకోలేదని పాడి కౌశిక్ రెడ్డి తరఫు న్యాయవాది శేషాద్రి నాయుడు న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చారు. ఏడుగురు ఎమ్మెల్యేల అనర్హతపై స్పీకర్ నిర్ణయం తీసుకున్నారని, మిగిలిన ముగ్గురిపై నిర్ణయం తీసుకునేందుకు సమయం కావాలని స్పీకర్ తరఫు న్యాయవాది అభిషేక్ మనుసింఘ్వీ కోర్టును కోరారు. అయితే రెండు వారాలు సమయం ఇస్తున్నామని.. రెండు వారాల్లో స్పీకర్ ఎలాంటి నిర్ణయం తీసుకున్నారో కోర్టుకు చెప్పాలని ధర్మాసనం ఆదేశించింది. ఆ తరువాత అవసరం అయితే మరో రెండు వారాలు సమయం ఇస్తామని సుప్రీం కోర్టు ధర్మాసనం చెబుతూ.. తదుపరి విచారణను వాయిదా వేసింది.

# విజయవంతంగా ట్రెజర్ హంట్ 2026

- సంస్కృతి, సంప్రదాయాలకు భారీ స్పందన!
- హైదరాబాద్ రన్నర్స్ సొసైటీ హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్ ఆధ్వర్యంలో నిర్వహణ



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : హైదరాబాద్ రన్నర్స్ సొసైటీ హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్ (హెచ్ఎల్ఎఫ్)తో కలిసి ట్రెజర్ హంట్ 2026ను విజయవంతంగా నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ఫిట్‌నెస్, సంస్కృతి, సంప్రదాయాలు, విద్య సహకారాన్ని ఒకే వేదికపైకి తీసుకొచ్చింది. ఈ కార్యక్రమంలో మొత్తం 30 జట్లు పాల్గొనగా, ప్రతి జట్టులో నలుగురు సభ్యులు ఉండేలా మొత్తం 120 మంది ఈ ట్రెజర్ హంట్‌లో భాగమయ్యారు. ప్రతి జట్టులో కనీసం ఒక మహిళ మరియు 14 నుండి 18 సంవత్సరాల మధ్య వయస్సు గల ఒక బాలుడు లేదా బాలిక ఉండేలా కార్యక్రమాన్ని నిర్వహించారు. పాల్గొన్న జట్లు నగర కేంద్రంలో 4.5 కిలోమీటర్ల పరిధిలో ఏర్పాటు చేసిన ఐదు ప్రత్యేక క్లూల ద్వారా రన్నింగ్ లో పాల్గొన్నారు. సినిమా, ఆహారం, కరెన్సీ, విద్య, రాజకీయాలు ఆధారంగా ఈ కార్యక్రమం ముగింపులో పాల్గొన్నారు. ఈ మూడు జట్లు విజేతలుగా నిలిచి, వరుసగా రూ.5,000, రూ.4,000 మరియు రూ.3,000 విలువైన బహుమతులు ఇచ్చారు. ఇది హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్ యొక్క సాహిత్య ఆత్మకు అనుగుణంగా ఉండటం విశేషం. ఈ కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించేందుకు తమ ప్రాంగణాలను అందించి సహకరించిన ప్రసాద్స్ ఐమ్యాక్స్, పారడైస్ బిర్యానీ మరియు విద్యారణ్య స్కూల్‌కు హైదరాబాద్ రన్నర్స్ సొసైటీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసింది. ట్రెజర్ హంట్ 2026 అనేది అన్వేషణ, అధ్యయనం, జట్టు పని మరియు సమాజ భాగస్వామ్యానికి ప్రతీకగా నిలిచింది. శారీరక చురుకుదనం మరియు సాంస్కృతిక అన్వేషణను సమన్వయం చేస్తూ, హైదరాబాద్ రన్నర్స్ సొసైటీ మరియు హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్ ప్రోత్సహించే విలువలను ప్రతిబింబించింది. "సాహిత్యం పుస్తకాలకే పరిమితం కాకుండా, కదలిక, జిజ్ఞాస మరియు పంచుకున్న అనుభవాల ద్వారా ప్రజలతో ఎలా అనుసంధానమవుతుందో చూపించే అద్భుత ఉదాహరణ ఈ ట్రెజర్ హంట్. ఇలాంటి భాగస్వామ్యాలు హైదరాబాద్ ఆత్మను నిజంగా జరుపుకుంటాయి,"

## రూ.3,900 కోట్ల పెండింగ్ బకాయిలు తక్షణం చెల్లించాలి

**ప్రభుత్వానికి ఆల్కోబెవ్ పరిశ్రమ వినతి**

తెలంగాణ బ్యూరో ప్రతినిధి : తమకు బాకీ ఉన్న రూ.3,900 కోట్ల పెండింగ్ బకాయిలు తక్షణం చెల్లించాలని బ్రూవర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బీఏఐ) డైరెక్టర్ జనరల్ వినోద్ గిరి, ఇంటర్నేషనల్ స్పిరిట్స్ అండ్ వైన్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఐఎస్డబ్ల్యుఏఐ) సీఈఓ సంజిత్ పాధి, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఆల్కహాలిక్ బేవరేజ్ కంపెనీస్ (సీఐఏబీసీ) డైరెక్టర్ జనరల్ అనంత్ అయ్యర్ ప్రభుత్వానికి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఈనెల చివరలో జరగనున్న ప్రపంచ ఆర్థిక వేదిక (వరల్డ్ ఎకనామిక్ ఫోరం) 56వ వార్షిక సమావేశం నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం ఆల్కహాలిక్ బేవరేజెస్ (ఆల్కోబెవ్) రంగానికి సంబంధించిన దీర్ఘకాలిక బకాయిలు చెల్లించాలని కోరారు. చెల్లింపుల ఆలస్యం అయితే సరఫరా వ్యవస్థలు దెబ్బతినడమే కాకుండా ఎక్సైజ్ ఆదాయాలపై ప్రభావం చూపుతాయన్నారు. పెట్టుబడిదారుల విశ్వాసాన్ని కూడా దెబ్బ తీస్తుందని హెచ్చరించారు. తెలంగాణ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ ద్వారా ఆల్కోబెవ్ సరఫరాదారులకు చెల్లించాల్సిన బకాయిలు రూ.3,900 కోట్లు దాటాయన్నారు. వీటిలో సుమారు రూ.900 కోట్లు ఏడాది కాలంగా పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. గత దశాబ్దంలో రాష్ట్ర ఎక్సైజ్ ఆదాయం నాలుగు రెట్లు పెరిగిందన్నారు. 2014లో సుమారు రూ.9,000 కోట్ల నుంచి 2023--24 ఆర్థిక సంవత్సరంలో దాదాపు రూ.38,000 కోట్లకు చేరుకుందన్నారు. అక్టోబర్ 2025లో మాత్రమే మద్యం రిటైల్ లైసెన్స్ దరఖాస్తు ఫీజుల ద్వారా రాష్ట్రానికి రూ.3,000 కోట్లకు పైగా ఆదాయం లభించిందన్నారు. డిసెంబర్ 2025లో కూడా ఆదాయ టర్నోవర్ చరిత్రలోనే అత్యధిక స్థాయికి చేరుకున్నట్లు వెల్లడైందన్నారు. తెలంగాణ రాష్ట్రానికి ఆల్కోబెవ్ రంగం పన్ను ఆదాయాల్లో మూడో వంతుకు పైగా వాటా అందిస్తోందన్నారు. దేశంలోని రాష్ట్రాల్లో ఇదే అత్యధికమన్నారు. ఈ రంగం ప్రతి నెలా సుమారు రూ.2,300 నుంచి రూ.2,600 కోట్ల వరకు ఆదాయాన్ని సృష్టిస్తోందన్నారు. బ్రూవరీలు, డిస్టిలరీలు, ప్యాకేజింగ్, లాజిస్టిక్స్, రిటైల్ వంటి విస్తృత ఎకోసిస్టమ్‌కు ఇది ఆధారంగా నిలుస్తోందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 70,000 ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలను కల్పిస్తోందన్నారు. రాష్ట్రంలో పారిశ్రామిక పెట్టుబడులు తగ్గుముఖం పట్టాయన్నారు. టీజీ-ఐపాస్ ఆమోదాలు 50 శాతానికి పైగా తగ్గాయన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో రూ.28,100 కోట్లుగా ఉన్న పెట్టుబడులు 2024--25 ఆర్థిక సంవత్సరంలో రూ.13,730 కోట్లకు పడిపోయాయని పేర్కొన్నారు. దావోస్‌లో జరగనున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరం సమావేశంలో తెలంగాణ రాష్ట్రం తనను తాను ఒక ప్రాధాన్య పెట్టుబడి గమ్యంగా ప్రదర్శించేందుకు సిద్ధమవుతున్న తరుణంలో ఇప్పటికే ఉన్న బాధ్యతలను ప్రభుత్వం గౌరవించడం అత్యంత కీలకమన్నారు. ఈ స్థాయిలో చెల్లింపుల ఆలస్యం జరిగితే పెట్టుబడులను ఆకర్షించే విషయంలో రాష్ట్ర విశ్వసనీయత, ప్రతిష్ట తీవ్రంగా దెబ్బతింటుందని హెచ్చరించారు. ఆల్కోబెవ్ రంగం రాష్ట్ర ఖజానాకు పెద్ద ఎత్తున ఆదాయం అందిస్తుందన్నారు. బకాయిలను క్లియర్ చేయడం, 45 రోజుల ఒప్పంద చెల్లింపును పునరుద్ధరించడం ఆర్థికంగా వివేకవంతమైనదన్నారు.

# మెట్రో రెండో దశ పనుల పురోగతి ఎందాక?

## సీఎం రేవంత్‌రెడ్డికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి లేఖ



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి శుక్రవారం లేఖ రాశారు. ఈ లేఖలో హైదరాబాద్ మెట్రో రెండో దశ పనుల పురోగతి గురించి ప్రస్తావించారు. అలాగే హైదరాబాద్ నగరంలో ఎదురవుతున్న ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి, రవాణా సౌకర్యాలను మెరుగుపరచడంలో భాగంగా నగరంలో మెట్రో రెండో దశ పనులు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ అనుమతి కోరిందని గుర్తుచేశారు. ఇప్పటికే అమలు జరుగుతున్న మొదటి దశ మెట్రోను ఎల్ అండ్ టీ నుంచి రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకుని, తామే నిర్వహిస్తామని ప్రకటించిందని ప్రస్తావించారు. తాను కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌ని కలిసి మెట్రో రెండో దశ నిర్మాణం గురించి చర్చించానని వివరించారు కిషన్‌రెడ్డి.

లావాదేవీలు పూర్తి చేయాలి..

ముందుగా మెట్రో మొదటి దశను ఎల్ అండ్ టీ నుంచి రాష్ట్ర ప్రభుత్వం టేకోవర్ చేసుకోవాలని.. అందుకు అన్ని ఒప్పందాలు, నిర్ణయాలు, లావాదేవీలు పూర్తి చేయాలని సూచించారు. లావాదేవీలు పూర్తయిన తర్వాత రెండో దశ నిర్మాణంపై కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే హైదరాబాద్ మెట్రో రెండో దశ నిర్మాణానికి అంగీకరించిందనీ కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ గుర్తు చేశారని అన్నారు. మెట్రో మొదటి దశను రాష్ట్ర ప్రభుత్వం ఎల్ అండ్ టీ నుంచి తీసుకోవడం, రెండో దశకు సన్నాహాల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి సంయుక్తంగా కమిటీ ఏర్పాటు చేయడంపై సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి నిర్ణయించారని కూడా ఖట్టర్ తనకు తెలిపారని పేర్కొన్నారు కిషన్‌రెడ్డి.

అధికారుల పేర్లను పంపించాలి..

ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున ఇద్దరు, కేంద్ర ప్రభుత్వం తరపున మరో ఇద్దరు అధికారులతో కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు కిషన్ రెడ్డి వెల్లడించారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఇద్దరు అధికారుల పేర్లను పంపాలని కోరినట్లు కూడా వివరించారు. కానీ, ఇంతవరకు రాష్ట్ర ప్రభుత్వం అధికారుల పేర్లను ఎందుకు ప్రతిపాదించలేదని ప్రశ్నించారు. కావున సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే ఇద్దరు అధికారుల పేర్లను పంపి సమావేశ నిర్వహణకు ప్రయత్నం చేయాలని సూచించారు. అదే విధంగా.. వేగవంతంగా ఎల్ అండ్ టీ నుంచి మెట్రో నెట్‌వర్క్‌ను రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకుని, ఆ తర్వాత మెట్రో రెండో దశ నిర్మాణానికి కావాల్సిన ప్రతిపాదనలు కేంద్ర ప్రభుత్వానికి పంపాలని విజ్ఞప్తి చేశారు. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని కిషన్‌రెడ్డి కోరారు.

# సంక్రాంతి రిటర్న్ జర్నీకి పోలీసుల ప్రత్యేక చర్యలు



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : సంక్రాంతి రిటర్న్ జర్నీకి నల్గొండ జిల్లా పోలీసులు ప్రత్యేక జాగ్రత్తలు చేపట్టారు. హైదరాబాద్ వెళ్లే వాహనాల రద్దీని నియంత్రించేందుకు జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆధ్వర్యంలో కీలక నిర్ణయం తీసుకున్నారు. ట్రాఫిక్ కంట్రోల్‌లో భాగంగా వాహనాలను దారి మళ్లించాలని డిసైడ్ అయ్యారు. 65వ జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో చిట్యాల, పెద్దకాపర్తిలో బ్లాక్ స్పాట్స్ వద్ద నిర్మాణ పనులతో ట్రాఫిక్ జామ్ అయ్యే అవకాశం ఉందని.. ఈ కారణంగా ఆయా రూట్లలో వాహనాలను దారి మళ్లించనున్నట్లు పోలీసులు ప్రకటించారు. సొంతూళ్ల నుంచి తిరిగి హైదరాబాద్ చేరుకునే ప్రయాణికులు సురక్షితంగా, సాఫీగా ప్రయాణించాలనే లక్ష్యంతో ఈ చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ పవార్ వెల్లడించారు.

**ప్రత్యామ్నాయ మార్గాలు:** గుంటూరు -- మిర్యాలగూడ -- హాలియా -- చింతపల్లి -- మాల్ మీదుగా హైదరాబాద్

మాచర్ల -- నాగార్జునసాగర్ -- పెద్దఊర -- చింతపల్లి -- మాల్ మీదుగా హైదరాబాద్

నల్లగొండ -- మర్రిగూడ బైపాస్ -- మునుగోడు -- నారాయణపూర్ -- చౌటుప్పల్(ఎన్‌హెచ్-65) మీదుగా హైదరాబాద్

**విజయవాడ నుంచి..:** కోదాడ -- హుజూర్‌నగర్ -- మిర్యాలగూడ -- హాలియా -- చింతపల్లి -- మాల్ మీదుగా హైదరాబాద్

ట్రాఫిక్ జామ్ ఏర్పడితే చిట్యాల నుంచి భువనగిరి మీదుగా వాహనాలను మళ్లించే ఏర్పాట్లు చేశారు.

కాగా.. సంక్రాంతి పండుగ సందర్భంగా హైదరాబాద్‌లోని ప్రజలు తమ తమ స్వగ్రామాలకు వెళ్లిపోయారు. దీంతో టోల్‌ప్లాజాల వద్ద ట్రాఫిక్ రద్దీ పెరిగింది. హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారిపై పంతంగి టోల్ ప్లాజా వంటి చోట్ల భారీ రద్దీ నెలకొంది. కేవలం 5 రోజుల్లోనే 3 లక్షలకు పైగా వాహనాలు హైవే మీదుగా ప్రయాణించాయి. అందులో హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు సుమారు 2.04 లక్షల వాహనాలు ప్రయాణించాయి. గత శనివారం ఒక్కరోజులోనే 71 వేలకు పైగా వాహనాలు ఆ మార్గం గుండా వెళ్లాయి. పంతంగి టోల్ ప్లాజా వద్ద కిలోమీటర్ల మేర వాహనాలు బారులు తీరినప్పటికీ.. ఫాస్టాగ్ స్కానింగ్ వేగవంతం చేయడం, అదనపు కౌంటర్లు ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్ సాఫీగా సాగింది.

# మావోయిస్టులపై చివరి యుద్ధానికి కౌంట్‌డౌన్

- మరో కీలక నేతనే టార్గెట్
- దండకారణ్యంలో మావోయిస్టులు వందమందికి పైగా ఉన్నట్లు గుర్తించిన భద్రతా బలగాలు
- వీరిలో అత్యంత కీలకమైన నాయకుడిగా పశ్చిమ బస్తర్ డివిజన్ కార్యదర్శి పాపారావు
- పాపారావుపై రూ. 50 లక్షల రివార్డు



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : కేంద్రం మావోయిస్టులపై చివరి యుద్ధానికి కౌంట్డౌన్ మొదలు పెట్టింది. దేశంలోని మావోయిస్టులకు పెట్టని కోటగా రూపొందిన ఛత్తీస్గఢ్లోని మరో కీలక నేతపై కన్నేసింది. ఉద్యమంలోని కీలక నేతల్లో ఒకరైన సున్నం చంద్రయ్య ఎలియాస్ మంగు ఎలియస్ 'పాపారావు' లక్ష్యంగా కేంద్ర బలగాలు వేటకు సిద్ధమవుతున్నాయి.

**పశ్చిమ బస్తర్ డివిజన్కు కార్యదర్శిగా :** సుక్మా జిల్లా నిమ్మలగూడెం (భద్రాద్రి జిల్లా చర్ల మండలం శివారు 24 కిలోమీటర్ల దూరం) గ్రామానికి చెందిన పాపారావు డీకేఎస్జడ్సీఎం (దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు) నుంచి పశ్చిమ బస్తర్ డివిజన్కు కార్యదర్శిగా ఎదిగాడు. నక్సల్స్ వ్యతిరేక ఆపరేషన్లో కీలకంగా వ్యవహరించే డీఆర్జీ (డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్) పాపారావును లక్ష్యంగా ఎంచుకుంది. పార్టీలో అత్యంత కీలకమైన బార్సె దేవా సహా అనేకమంది మావోయిస్టులు లొంగిపోయిన విషయం తెలిసిందే. అయినా మావోయిస్టు పార్టీకి చివరి అస్త్రంగా, వెన్నుదన్నుగా నిలుస్తున్న పాపారావుపైనే పడింది.

పశ్చిమ బస్తర్ డివిజన్ కార్యదర్శి పాపారావు

**నిఘా వర్గాల అంచనా ప్రకారం :** ఛత్తీస్గఢ్ అడవుల్లో మావోయిస్టులు సంచరించే బీజాపూర్ జిల్లాలో ఇప్పటి వరకు యుద్ధ తంత్రంలో ఆరితేరినవారు సుమారు వంద మందికి పైగా చురుకైన మావోయిస్టులు ఉన్నట్లు నిఘా వర్గాలు అంచనా వేస్తున్నాయి. వీరిలో పాపారావు అత్యంత కీలకమైన నాయకుడు. ఈయనను అత్యంత ప్రమాదకరమైన, ప్రతిభావంతమైన వ్యక్తిగా పరిగణిస్తున్నాయి. బలగాలతో దాగుడు మూతలు ఆడుతూ దట్టమైన అడవులు, స్థానిక నెట్వర్క్, తన పదునైన వ్యూహాలతో పాపారావు నిత్యం తప్పించుకుంటున్నాడు.

**ప్రధాన దాడుల్లో సూత్రధారి :** అతడిని బంధించేందుకు బలగాలు ఉన్నతస్థాయి వ్యూహాలతో అడుగులు వేస్తున్నాయి. దశాబ్దాలుగా మావోయిస్టులకు పెట్టని కోటగా మారిన బీజాపూర్ జిల్లాలో ఇతడు చురుగ్గా ఉన్నాడని, అనేక ప్రధాన దాడుల్లో సూత్రధారి అని చెబుతున్నాయి. కుత్రు - బెద్రే రోడ్డులో జరిగిన ఐఈడీ పేలుడుకు ప్లాన్ చేసింది పాపారావు అని పేర్కొంటున్నాయి. అనేక మంది జవాన్ల మృతికి కారకుడు అని స్పష్టం చేస్తున్నాయి. ఇతడిపై రూ. 50 లక్షల రివార్డు ప్రకటించారు.

**ఈ నెల 31 వరకే గడువు :** పాపారావు లొంగిపోవడానికి భద్రతా బలగాలు ఈ నెల 31 వరకు గడువును నిర్దేశించినట్లుగా తెలుస్తోంది. ఈలోగా లొంగిపోకుండా ఉంటే సంయుక్త ఆపరేషన్ తప్పదనే సంకేతాలు ఇస్తున్నాయి. బలగాలు నిర్దేశించిన గడువు మరో 16 రోజుల్లో ముగుస్తుంది. మావోయిస్టు పార్టీ చీఫ్ దేవ్జీ, మల్లా రాజిరెడ్డి ఎలియాస్ సంగ్రామ్, గణపతి వంటి వారి లొంగుబాటు లేదా ఎన్కౌంటర్లతో బస్తర్ను నక్సల్స్ రహితంగా ప్రకటించేలా భద్రతా బలగాలు సన్నాహాలు చేస్తున్నాయి.

**అజ్ఞాతంలో 52 మంది :** కాగా ఈ ఉద్యమంలో చేరి వివిధ కారణాలతో అజ్ఞాతంలోకి వెళ్లిన మావోయిస్టు కేడర్ ఆచూకి ఇప్పటికీ దొరకలేదు. ఒక్క మన రాష్ట్రం నుంచే ఇలా 35 మంది జాడ తెలియకుండా పోయింది. పక్కా సమచారంతో నిఘా వర్గాలు ఈ లెక్కను తేల్చాయి. ఉద్యమంలో వివిధ హోదాల్లో పని చేసిన వీరందరినీ ఇప్పటి వరకూ ఎక్కడున్నారనే విషయంపై స్పష్టత లేకుండా పోయింది. ఏదైనా బలమన కారణంతో అజ్ఞాతంలోకి వెళ్లడం వేరు. కానీ అజ్ఞాతంలో ఉంటూ ఆచూకీ లేకుండా పోవడం మాత్రం అరుదైన అంశమే. మావోయిస్టుల లొంగుబాట్ల నేపథ్యంలో కీలక నేతలు అజ్ఞాతంలోకి వెళ్లడం ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. మన రాష్ట్రం నుంచి 52 మంది ప్రస్తుతం అజ్ఞాతంలో ఉన్నట్లు తెలంగాణ నిఘావర్గాలు పేర్కొన్నాయి. వీరిలో 17 మంది మాత్రం ఇప్పటికీ మావోయిస్టు పార్టీ కార్యకలాపాల్లో చురుగ్గా ఉన్నట్లు గుర్తించినా, మిగిలిన 35 మంది ఆచూకీపై స్పష్టత లేనట్లు వెల్లడైంది. తాజాగా లొంగిపోయిన మావోయిస్టులను ప్రశ్నించిన అనంతరం నిఘా వర్గాలు ఈ నిర్ధారణకు వచ్చాయి. ఆపరేషన్ కగార్ అంతిమ దశకు చేరుకుంటున్న నేపథ్యంలో అలాంటి వారి వివరాలతో కూడిన నివేదికను తాజాగా నిఘా వర్గాలు రూపొందించాయి.

# బడి పిల్లల కంటి రక్షణ భేష్!

- రాష్ట్ర ఆరోగ్య శాఖకు జాతీయ స్థాయి గుర్తింపు
- లక్ష్యాన్ని 90 వేల నుంచి 2.50 లక్షల విద్యార్థులకు పెంచిన కేంద్రం
- అధికారులకు మంత్రి సత్యకుమార్ యాదవ్ అభినందనలు

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : పాఠశాల విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు, కంటి అద్దాల పంపిణీలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ గత రెండు సంవత్సరాలుగా అమలు చేస్తున్న విధానాలకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. 2024--25, 2025--26 విద్యా సంవత్సరాల్లో కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించడంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చూపుతున్న చొరవ ఇతర రాష్ట్రాలకు స్ఫూర్తిగా నిలుస్తోందని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ (జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమం)తాజా నివేదికలో ప్రశంసించింది. రాష్ట్రంలో అమలవుతున్న ఉత్తమ విధానాల(బెస్ట్ ప్రాక్టీసెస్)ను ఇతర రాష్ట్రాల్లో కూడా అమలుచేసేందుకు త్వరలోనే మార్గదర్శకాలు జారీ చేస్తామని కేంద్రం వెల్లడించింది. ఈ నేపథ్యంలో 2026--27 విద్యా సంవత్సరానికి సంబంధించి రాష్ట్రానికి కేటాయించిన కంటి అద్దాల పంపిణీ వార్షిక లక్ష్యాన్ని 90 వేల నుంచి ఏకంగా 2.50 లక్షలకు కేంద్రం పెంచడం విశేషం. రాష్ట్రానికి జాతీయ స్థాయిలో ఈ గుర్తింపు లభించడంపై అధికారులను వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అభినందించారు. ఇదే స్ఫూర్తిని ఇకమీదట కూడా కొనసాగిశీ చాలని మంత్రి పిలుపునిచ్చారని వైద్య, ఆరోగ్య శాఖ ఫ్రైడే ఓ ప్రకటనలో తెలిపిశీది.

కంటి పరీక్షలు, అద్దాల పంపిణీకి పకడ్బందీ ప్రణాళిక

జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి కంటి అద్దాలు పంపిణీ చేస్తున్నారు. సంబంధించిన వ్యయంగా రూ.3 కోట్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తిలో భరిస్తున్నాయి. ప్రతి కంటి అద్దానికి గరిష్ఠంగా రూ.280 వరకు వ్యయం అవుతోంది.

ఆరు నుంచి పద్దెనిమిది ఏళ్లలోపు వయస్సు గల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పారా మెడికల్ ఆఫ్తాల్మిక్ ఆఫీసర్లు / పారా మెడికల్ ఆఫ్తాల్మిక్ అసిస్టెంట్ల ద్వారా కంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు.

# సైబర్ నేరాల బాధితులకు బిగ్ రిలీఫ్

**ఆన్‌లైన్ ఆర్థిక మోసాల బాధితులకు త్వరితగతిన సహాయం అందించేందుకు కేంద్ర హోం శాఖ చర్యలు**




తెలంగాణ బ్యూరో ప్రతినిధి : సైబర్ నేరాలపై స్పందనను మరింత బలోపేతం చేయడంతో పాటు, ఆన్‌లైన్ ఆర్థిక మోసాల బాధితులకు త్వరితగతిన సహాయం అందించేందుకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ కీలక నిర్ణయం తీసుకున్నది. ఈ మేరకు జాతీయ సైబర్ నేర నివేదిక పోర్టల్ లోని సైబర్ ఫైనాన్షియల్ క్రైమ్ రిపోర్టింగ్ అండ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ కోసం స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ కు ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వంటి డిజిటల్ వినియోగం అధికంగా ఉన్న రాష్ట్రాల పౌరులకు ఎంతో ప్రయోజనం చేకూర్చనుంది. కొత్త ఎస్ఓపీ ప్రకారం.. రూ.50 వేల కంటే తక్కువ మొత్తంతో జరిగిన చిన్నస్థాయి సైబర్ మోసాల విషయంలో కోర్టు ఆదేశం లేకుండానే బాధితులకు రీఫండ్ అందే అవకాశం ఉంది. కోర్టు లేదా రిస్టోరేషన్ ఆర్డర్ లేని సందర్భాల్లో, ఆ మొత్తాలపై బ్యాంకులు విధించిన 'హోల్డ్'లను 90 రోజుల్లోగా తొలగించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. దీనివల్ల జాప్యం తగ్గి బాధితులపై ఆర్థిక భారం తగ్గనుంది. డిజిటల్ చెల్లింపులు, ఆన్‌లైన్ బ్యాంకింగ్, ఈ-కామర్స్ వినియోగం పెరిగిన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు ఈ నిర్ణయం ప్రత్యేకంగా ప్రాధాన్యత కలిగి ఉంది. హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ వంటి నగరాల్లో డిజిటల్ లావాదేవీలు పెరిగిన కొద్దీ సైబర్ మోసాల ఫిర్యాదులు కూడా పెరుగుతున్నాయి. హోం మంత్రిత్వ శాఖకు చెందిన ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (×4సీ) సేకరించిన డేటా ప్రకారం, గత ఆరు సంవత్సరాల్లో భారత్‌లో మోసం, చీటింగ్ కేసుల వల్ల ప్రజలు రూ.52,976 కోట్లకు పైగా నష్టపోయారు. ఈ గణాంకాలు సమస్య తీవ్రతను స్పష్టం చేస్తున్నాయి. ప్రభుత్వం తీసుకున్న ఈ చర్యను పరిశ్రమ నిపుణులు స్వాగతిస్తున్నారు. జియోటస్.కామ్ సీఈవో విక్రమ్ సుబ్బురాజ్ మాట్లాడుతూ.. ఫైనాన్షియల్ టెక్నాలజీ రంగం మొత్తానికి అంటే ఎక్స్ఛేంజీలు, పేమెంట్ ప్లాట్‌ఫారమ్‌లు, డిజిటల్ అసెట్ మధ్యవర్తులు సహా ఈ ఎస్ఓపీ లో పేర్కొన్న ఏకరీతి ఫిర్యాదు పరిష్కార, నిధుల పునరుద్ధరణ వ్యవస్థ అనిశ్చితిని తగ్గిస్తుందని తెలిపారు. ఇది భాగస్వాముల బాధ్యతలను సమన్వయం చేసి, విశ్వాసాన్ని పెంపొందిస్తుంది. మధ్యవర్తులు, చట్ట అమలు సంస్థల మధ్య సమన్వయంతో కూడిన ఎస్కలేషన్ నిర్మాణం.. నిజమైన ఖాతాలపై అనవసర ఫ్రీజ్‌లను తగ్గించడంతో పాటు, నిర్ధారిత మోసాలపై వేగవంతమైన చర్యలకు దోహదపడుతుందని పేర్కొన్నారు.

**మూడు స్టేజీల ఎస్కలేషన్ విధానం.. :** కొత్తగా ఆమోదించబడిన ఎస్ఓపీ ద్వారా బ్యాంకులు, పేమెంట్ అగ్రిగేటర్లు, నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలు ఈ-కామర్స్ ప్లాట్‌ఫారమ్‌లు, స్టాక్ ట్రేడింగ్ యాప్‌లు, మ్యూచువల్ ఫండ్ సంస్థలు సైబర్ నేర ఫిర్యాదు నమోదైనప్పుడు అనుసరించాల్సిన నిర్దిష్ట కాలపరిమితితో కూడిన ప్రక్రియను ఏర్పాటు చేశాయి. అలాగే, ఫ్రీజ్ అయిన ఖాతాలు లేదా నిధులకు సంబంధించిన కేసుల వేగవంతమైన పరిష్కారం కోసం మూడు స్థాయిల ఎస్కలేషన్ విధానాన్ని ప్రవేశపెట్టారు. ఎస్ఓపీలో విధానపరమైన ఏకరీతికి ఇచ్చిన ప్రాధాన్యత వేగంగా డిజిటల్ వైపు దూసుకెళ్తున్న భారత ఆర్థిక వ్యవస్థకు ఎంతో ఉపయోగకరంగా ఉండనుంది. ఇది సురక్షితమైన, నమ్మదగిన డిజిటల్ ఫైనాన్స్ అనే ప్రభుత్వ విస్తృత లక్ష్యానికి మద్దతునిస్తూ వినియోగదారుల ఇబ్బందులను తగ్గిస్తుందని విక్రమ్ సుబ్బురాజ్ పేర్కొన్నారు. ×4సీ ఆధ్వర్యంలో 2021లో ప్రారంభమైన సీఎఫ్‌సీఎఫ్ఆర్ఎం ఎస్ ద్వారా ఆర్థిక మోసాలను వెంటనే నివేదించే అవకాశం లభించడంతో పాటు, మోసగాళ్లు నిధులను తరలించకుండా అడ్డుకోవచ్చు. గతేడాది అక్టోబర్ 31 నాటికి, ఈ ప్లాట్‌ఫారమ్‌లో నమోదైన 23 లక్షలకు పైగా ఫిర్యాదుల ద్వారా రూ.7,130 కోట్లకు పైగా సొమ్మును కాపాడగలిగారు.

# అగ్నిప్రమాదాలు జరగకుండా అటవీ శాఖ చర్యలు

- వేసవి కాలం ప్రారంభం నుంచి ఫైర్లైన్స్ నిర్మాణాలు
- ఫైర్లైన్స్ నిర్వహణకు ప్రత్యేక కార్యాచరణ చేపడుతున్న అటవీ శాఖాధికారులు
- అటవీ సంపదకు నష్టం జరగకుండా చర్యలు - శాటిలైట్ సమాచారంతో అప్రమత్తం అవ్వనున్న అటవీ శాఖ



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : ఆకురాలు కాలంలో అటవీ ప్రాంతాల్లో ఉన్న చెట్లన్నీ ఆకులను రాలుస్తాయి. ఇలా అనుకోకుండా పలు ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలు జరిగితే రాలిన ఆకులతో పాటు మొక్కలు, వృక్షాలు భారీ మొత్తంలో కాలి పోతాయి. ఎక్కువగా వేసవి కాలంలో అగ్ని ప్రమాదాలు అవుతుంటాయి. ఇకపై ఈ ప్రమాదాలు జరగకుండా అటవీ శాఖాధికారులు ఫైర్లైన్స్ నిర్వహణకు ప్రత్యేక కార్యాచరణ చేపడుతున్నారు. అనుకోకుండా ప్రమాదాలు సంభవిస్తే విలువైన అటవీ సంపదకు నష్టం జరగకుండా చర్యలు చేపడుతున్నారు.

**ఇలా నిర్మాణం :** ఎండ కాలంలో చెట్ల ఆకులు రాలిపోయి పేరుకుపోతాయి. ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం జరిగి విలువైన అటవీ సంపద బూడిద అవుతుంది. దీనిని కట్టడి చేయడానికి అధికారులు వేసవి కాలం ప్రారంభం నుంచే ఫైర్లైన్స్ నిర్మాణాలు చేపడతారు. నిజామాబాద్ జిల్లా డివిజన్లో 53 వేల హెక్టార్లు, ఆర్మూర్ డివిజన్లో 33 వేల హెక్టార్ల అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. 2023-24లో ఆర్మూర్ డివిజన్లో 7.25 కిలోమీటర్లు, నిజామాబాద్ డివిజన్లో 6.03 కిలోమీటర్ల వరకు కొత్త ఫైర్లైన్స్ ఏర్పాటు చేశారు.

2024-25కి సంబంధించి కొత్తవి కాకుండా ఉన్న వాటినే నిర్వహణ చేపట్టారు. ఈ సంవత్సరంలో కొత్తవి నిర్మించే అవకాశం ఉంది. అలాగే అటవీ రహదారులు, సరిహద్దుల వెంట 5 మీటర్ల వెడల్పుతో ఫైర్లైన్స్ ఉంటాయి. ప్రమాదవశాత్తు మంటలు విస్తరిస్తే సమాచారం అందుకున్న అటవీశాఖ సిబ్బంది బ్లోయర్ల సహాయంతో మంటలు ఆర్పేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

శాటిలైట్ సమాచారంతో అటవీ శాఖ అప్రమత్తం : అడవుల్లో అగ్ని ప్రమాదాలను నియంత్రించడానికి అటవీ శాఖ అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. అగ్ని ప్రమాదాలు జరిగిన చోటును తెలుసుకోవడానికి శాటిలైట్ పద్ధతిని వినియోగిస్తుంది. ఇలా చేయడం ద్వారా ఎక్కడ ప్రమాదం జరిగినా వెంటనే సంబంధిత బీట్, సెక్షన్, రేంజ్ అధికారులు సెల్ఫోన్కు సమాచారంతో పాటు అటవీ కంపార్ట్మెంట్ నెంబర్ల వివరాలు అందుతాయి. జీపీఎస్ ఆధారంగా అటవీ సిబ్బంది ఆ ప్రాంతానికి చేరుకొని మంటలను బ్లోయర్ల సహాయంతో ఆర్పేస్తారు. వేసవిలో ఎక్కువ అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఏ ప్రాంతంలో ఉన్నాయో ముందుగానే హెచ్చరికలు జారీ చేస్తారు. నిజామాబాద్ జిల్లాలో కమ్మర్పల్లి, వర్ని, సిరికొండ, ఇందల్వాయి, నిజామాబాద్ సౌత్ రేంజ్ల పరిధిలో ఎక్కువగా అగ్ని ప్రమాదాలు జరుగుతుంటాయి.

**మానవ తప్పిదాలతోనే :** అటవీ ప్రాంతంలో అగ్ని ప్రమాదాలు సహజ సిద్ధంగా, మరి కొన్ని సమయాల్లో మానవ తప్పిదాలతో జరుగుతుంటాయి. పశువుల కాపరులు బీడీలు తాగి నిర్లక్ష్యంగా పారవేసినప్పుడు, వ్యవసాయ భూముల్లో నిప్పంటించిన సందర్భాల్లో మంటలు వ్యాపించే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో అడవికి దగ్గరగా ఉన్న గ్రామాల్లో ఫారెస్టు అధికారులు అవగాహన కార్యక్రమాలు ఈ నెలలో ప్రారంభించి ఏప్రిల్ వరకు కొనసాగించనున్నామని నిజామాబాద్ నార్త్ రేంజ్ అధికారి సంజయ్గౌడ్ తెలిపారు.

**ఈ జాగ్రత్తలు మేలు :** అడవిలో మంటలు వ్యాపించకుండా అగ్గిరేఖలు ఏర్పాటు చేయాలి. అటవీ ప్రాంత గొర్రెలు, పశువుల కాపరులకు అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించాలి. వారు అగ్గిపెట్టెలు అడవుల్లోకి తీసుకెళ్లకుండా చూడాలి. కొందరు గిరిజనులు ఇప్పపువ్వు సేకరించి చెట్ల కింద నిప్పుపెడుతుంటారు. అటవీ సిబ్బంది ముందస్తు జాగ్రత్తగా బ్లోయర్ల సాయంతో శుభ్రం చేయాలి. పోడు రైతులు పత్తి, కంది పంటల సాగుతర్వాత వ్యర్థాలకు నిప్పుపెట్టకుండా అవగాహన కల్పించాలి. తునికాకు సేకరణలో భాగంగా ప్రూనింగ్కు నిప్పుపెడుతున్నారు. ఈ చర్యలకు అడ్డుకట్ట వేయాలి. అగ్గితో చేసే చిన్న నిర్లక్ష్యం అడవులను హరిస్తుందని, అడవులను కాపాడటం మనందరి బాధ్యత అని సమీప గ్రామాల్లో కళాజాతలు, ప్రదర్శనలు చేపట్టాలి. జాగ్రత్తలపై ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలి. చిన్న ప్రమాదం జరిగినా వెంటనే స్థానిక అధికారులకు తెలిపేలా జన జాగృత్తం చేయాలి.

# సంక్రాంతికి వీడుకోలు

# ముక్కనుమ

## బంధుమిత్రులను సాదరంగా సాగనంపే తీరు

## దక్షిణాయణానికి ఆత్మీయ ఆహ్వానం



**సంక్రాంతి అంటే నాలుగురోజుల పండుగ అని అందరికీ తెలిసిందే! ఇందులో తొలి మూడు రోజులకీ ఏదో ఒక పరమార్థం ఉంది. కానీ నాలుగోరోజున ఫలానా విధులు నిర్వహించాలి అంటూ ఎక్కడా కనిపించదు. ముక్కనుమ ఓ పండుగలా కాకుండా సంక్రాంతి సంబరాలకు ముగింపులా తోస్తుంది.**

– సంక్రాంతిలో తొలిరోజైన భోగిన కీడుపండుగగానూ, రెండో రోజైన సంక్రాంతిని పెద్దల పండుగగానూ, మూడోరోజైన కనుమను పశువుల పండుగగానూ చేసుకునే జనం నాలుగో రోజున గ్రామదేవతలను తల్చుకుంటూ మాంసాహారాన్ని వండుకునే సంప్రదాయం కనిపిస్తుంది. అందుకనే ముక్కనుమను ముక్కల పండుగగా కూడా పిల్చుకోవడం రివాజు.

సంక్రాంతి అంటే నాలుగు రోజుల పండుగ. ఇందులో తొలి మూడు రోజులకు ఏదో ఒక పరమార్థం ఉంది. కానీ నాలుగో రోజున ఫలానా విధులు నిర్వహించాలి అంటూ ఎక్కడా కనిపించదు. ముక్కనుమ ఓ పండుగలా కాకుండా సంక్రాంతి సంబరాలకు ముగింపులా తోస్తుంది. ఈ సందర్భంగా ముక్కనుమ విశిష్టత ఏంటి? ఈ పండుగ ఎలా జరుపుకోవాలి అనే విషయాలు ఈ కథనంలో తెలుసుకుందాం. ఈ సంక్రాంతి పండుగలో నాల్గవరోజును ముక్కనుమ అంటారు. ముక్కనుమ నాడు సాధారణంగా మాంసాహార ప్రియులు తాము ఇష్టపడే వివిధ మాంసాహార వంటకాలను వండుకుని కుటుంబ, బంధు, మిత్రులతో కలిసి తిని ఆనందిస్తారు. పండుగలోని మొదటి మూడు రోజులు కేవలం శాఖహారమే భుజించాలి. ఇది శాస్త్రీయమైన సాంప్రదాయం, ఆరోగ్యసూత్రం. మాంసాహారం తినకూడదు. ప్రకృతిలోని మార్పు వలన సప్త ధాతువుల మిలితమైన మానవ శరీరంలో కూడ మార్పు చోటు చేసుకుంటుంది. అది మానవ శరీరానికి హాని చేయకుండా ఉండేందుకే ఎక్కువ నువ్వులతో ముడిపడిన పిండి వంటకాలను ఏర్పాటు చేసారు.

**సంక్రాంతి పండుగకు ముగింపు :** కనుమ మరుసటి రోజు ముక్కనుమగా వ్యవహరిస్తారు. ఏడాది మొత్తం కళ్లు కాయలు కాసేలా ఎదురు చూసే సంక్రాంతి వేడుకలకు ముగింపు పలికేది ముక్కనుమ పండుగ. ఈ రోజున ఎవరైతే ఆనవాయితీ ప్రకారం భోగి నాడు గౌరీ దేవి రూపంలో గొబ్బెమ్మను పెట్టుకుంటారో– వారు తమ సమీపంలోని నదులు, చెరువుల వద్దకు వెళ్లి, గొబ్బెమ్మలను నిమజ్జనం చేసి, అక్కడే బంధు మిత్రులతో కలిసి గొబ్బెమ్మకు నైవేద్యం పెట్టిన వంటకాలను భుజిస్తారు. పెద్దలు పిల్లలు భేదం లేకుండా అక్కడే అందరూ కలిసి గాలిపటాలు ఎగుర వేస్తారు.

**గ్రామదేవతల పండుగ :** సంక్రాంతిలో తొలి రోజైన భోగిన కీడు పోగొట్టే పండుగగానూ, రెండో రోజైన సంక్రాంతిని పెద్దల పండుగగానూ, మూడో రోజైన కనుమను పశువుల పండుగగానూ చేసుకునే జనం నాలుగో రోజున గ్రామదేవతలను తల్చుకుంటూ మాంసాహారాన్ని వండుకునే సంప్రదాయం కనిపిస్తుంది. అందుకనే ముక్కనుమను ముక్కల పండుగగా వ్యవహరిస్తారు.

### ముక్కనుమ రోజు ఏం చేస్తారంటే

నిజానికి కనుమ రోజు కూడా మాంసాహారాన్ని ముట్టుకోవద్దని కొంతమంది పండుతులు చెబుతున్నారు. ముక్కనుమతో సంక్రాంతి పండగ ముగుస్తుంది. ఈరోజున గ్రామదేవతలకు పసుపు కుంకుమ ఇచ్చి పూజలు చేస్తారు. అందువల్ల మాంసాహారాన్ని ఇష్టపడేవాళ్ళు తమకు ఇష్టమైన వంటకాలను చేసుకుని తింటారు. అందుకే ముక్కల కనుమ, ముక్కనుమ అన్న పేరు వచ్చిందని కొందరి అభిప్రాయం. ముక్కనుమ రోజు వాకిట్లో రథం ముగ్గు వేస్తారు. దాన్ని పక్కింటి వారి వాకిట్లో రథం ముగ్గుతో కలిపేస్తూ ఊరు మొత్తాన్ని కలిపేస్తారు.

**ఆడపడుచులకు వీడ్కోలు :** సంక్రాంతిలో మూడోరోజైన కనుమనాడు పొలిమేర దాటకూడదన్న నియమం ఉంది. పండగకు ఇంటికి వచ్చిన ఆడపడుచులను సత్కరించుకుని, మనసారా కానుకలు ఇచ్చుకుని ముక్కనుమ నాడు వీడ్కోలు పలుకుతారు. కొంతమంది ముక్కనుమను కూడా పండుగగా భావించి, ఆరోజు కూడా బయల్దేరకూడదని చెబుతుంటారు. కానీ ఈ విషయమై శాస్త్ర పరంగా ఎలాంటి నియమం లేదు.

**బంధుమిత్రుల కలయిక :** ఈరోజున గ్రామదేవతలకు పసుపు కుంకుమ ఇచ్చి పూజలు చేస్తారు. అందువల్ల మాంసాహారాన్ని ఇష్టపడేవాళ్ళు తమకు ఇష్ట మైన వంటకాలను చేసుకుని తింటారు. అందుకే ముక్కల కనుమ, ముక్కనుమ అన్న పేరు వచ్చిందని కొందరి అభిప్రాయం. ముక్కనుమ నాడు సావిత్రి గౌరి వ్రతం చేసే మహిళలకు దీర్ఘ సుమంగళీ ప్రాప్తం చేకూరుతుందని విశ్వా సం. వివాహం కావలసిన కన్నెపిల్లలు కూడా ఈ బొమ్మలనోములో పాల్గొంటూ వుం టారు. ముత్తయిదువులను పేరంటానికి పిలిచి, మట్టిబొమ్మల మధ్య పసుపు గౌరీదేవిని వుంచి పూజిస్తారు. అమ్మవారికి వివిధ రకాల నైవేద్యాలను సమర్పి స్తూ ముత్తయిదువులకు పండ్లు, తాంబూలం వాయనంగా ఇస్తారు. అలాగే ముక్క నుమ రోజు చుట్టాలను, బంధువులను కలుసుకుంటే మంచిదని చెబు తారు. ా బంధుత్వాలను కలుపుకునేందుకు, సంబంధీకుల మంచి చెడులను పరామర్శించేందుకు ప్రాముఖ్యం ఇస్తారన్నమాట. అంతేకాదు, ఈ రోజున కుటుంబ సమేతంగా వనభోజనాలకు వెళ్లే ఆనవాయితీ కూడా ఉంది.

**తమిళనాట ఘనంగా...** ముక్కనమను తమిళులు ఘనంగా జరుపుకుం టారు. ఈ రోజును కరినాళ్ అని పిలుస్తారు. బంధువులను కలిస్తే మంచి దని చెబుతారు. కొత్త సంబంధాలు కలుపుకునేందుకు, మంచి చెడులకు సంబంధిం చి బంధువులను పరామర్శించేందుకు ఈ రోజు మంచిరోజుగా భావిస్తారు. అందుకే సుకుటుంబ,సపరివార సమేతంగా వనభోజనాలు కూడా చేస్తారట.

**ముక్కులు కుట్టే పండుగ :** ముక్కనుమ రోజు చిన్నపిల్లలకు ముక్కులు కుట్టేవారని ముక్కు కుట్టడం అనేది చిన్న పిల్లలకు ఓ పండగ వాతావరణం లో చేసేవారని అంటున్నారు. సంవత్సరంలో ఒకసారి మాత్రమే ఈ పనులు చేసే వారని సంవత్సరం మధ్యలో ఎప్పుడు కూడా ముక్కులు కుట్టేవారు కాదని అంటున్నారు. భోగి, సంక్రాంతి, కనుమ, ముక్కనుమ పూర్వం రోజుల్లో ఎంతో తొందరగా ఉండేవని అంటున్నారు. నేటి రోజులో ఇవన్నీ కనుమరుగైపో యాయి. సంస్కృతి సాంప్రదాయాలు నేటి తరం యువత పట్టించుకోవడం లేదని అంటున్నారు.

**ముక్కనుమ అనేది శాస్త్రాల్లో లేదని:** అసలు ముక్కనుమ అనేది శాస్త్రాల్లో లేదని..ఎవరో తీసుకువచ్చి కనుమకు అతికించారని అలా అలా ప్రచారంలోకి వచ్చిందని అంటారు. మరో వాదన ప్రకారం ముక్కనుమ అనేది ఉందంటారు. ఈ రెండు వివాదాల మధ్య ఈ పండగ కొన్ని చోట్ల జరుపుతున్నారు, మరికొన్ని చోట్ల వదిలేస్తున్నారు. అయితే పండుగలకు సంబంధించి అనవసర వివాదాలు, వాదనలు పెట్టుకునే కన్నా మీరు విశ్వసిస్తే జరుపుకోండి లేదంటే వదిలేయండి..అంతే కానీ మనకు తెలిసింది మాత్రమే వాస్తవం అన్నట్టు వాదనకు దిగడం ఎంతమాత్రం సమర్ధనీయం కాదన్నది తెలుసుకోండి అంటారు పండితులు. – సంక్రాంతిలో మూడోరోజైన కనుమనాడు పొలిమేర దాటకూడదన్న నియమం ఉంది. కాబట్టి ఇంటికి వచ్చిన ఆడపడుచులని సత్కరించుకుని, మనసారా బహుమతులు ఇచ్చుకుని ముక్కనుమనాడు వీడ్కోలు పలుకుతారు. కొంతమంది ముక్కనుమను ాడా పండుగగా భావించి, ముక్కనుమనాడు కూడా బయల్దేరకూడదని చెబుతుంటారు. కానీ ఈ విషయమై శాస్త్రపరంగా ఎలాంటి నియమమూ లేదు.

**రదం ముగ్గుతో వీడుకోలు :** కనుమనాడు రథం ముగ్గు వేయడం మనకి తెలిసిందే! కొందరు ముక్కనుమ రోజున కూడా రథం ముగ్గు వేస్తుంటారు. సంకురుడు ఉత్తరాయణం వైపుగా ప్రయాణం అయ్యే ఈ సందర్భాన్ని పుర స్కరించుకుని ఆయనను సాగనంపేందుకు అన్నట్లుగా ఇలా రథం ముగ్గుని వేయడం ఆచారం. సంకురుమయ్య ఉత్తరాయణం వైపుగా మరలే ఈ సంద ర్భాన్ని పురస్కరించుకుని ఆయనను సాగనంపేందుకు అన్నట్లుగా ఇలా రథం ముగ్గుని వేయడం ఆచారం. ఈ ముగ్గుకి ఉన్న కొసను మాత్రం ఇంటి బయటకు వెళ్లేలా దిద్దుతారు. –

వెంకటేశ్వర దాస్
సూర్యకల్చ రల్ రిపోర్టర్ – విశాఖపట్నం
99892 65111

### సావిత్రి గౌరీ వ్రతం



ముక్కనుమ రోజున కొత్తగా పెళ్లైన నూతన వధువులు 'సావిత్రి గౌరీవ్రతం' అనే వ్రతాన్ని పట్టడం కూడా కనిపిస్తుంది. వట సావిత్రి వ్రతానికో ప్రత్యేకత ఉంది. ఈ వ్రతాన్ని వటవృక్షాన్ని పూజ చేయడం ద్వారా జరుపుకుంటారు. జీవన విధానంలో సకల సౌభాగ్యాలను ప్రసాదించడంతో పాటూ వైధవ్యం నుంచి కాపాడేవ్రతంగా 'వటసావిత్రీ వ్రతం'ను చెప్పుకొచ్చు.

**పురాణగాథ** ఈ వ్రతం వెనుక ఉన్న సావిత్రి, సత్యవంతుల కథ ఉంది. ఈ వ్రతం ఆచరించే సావిత్రీ తన భర్త సత్యవంతుని మృత్యువు నుంచి కాపాడుకోగలిగింది.

**వ్రత విధానము :** ఈ వ్రతాన్ని చేసే వారు ముందురోజు రాత్రి ఉపవాసం ఉండాలి. వ్రతం రోజు తెల్లవారుజామున నిద్రలేచి తలంటు స్నానం చేసి, దేవుడిని స్మరించుకుంటూ మర్రి చెట్టు వద్దకు వెళ్లి, మర్రి చెట్టు వద్ద అలికి ముగ్గులు వేయాలి. అక్కడ సావిత్రి, సత్యవంతుల బొమ్మలు ప్రతిష్టించాలి. వారి చిత్ర పటాలు దొరకకపోతే పసుపుతో చేసిన బొమ్మలు ప్రతిష్టించుకుని **మనువైధవ్యాధి సకల దోష పరిహారార్ధం./ బ్రహ్మ సావిత్రీ ప్రీత్యర్థం/ సత్యవత్సావిత్రీ ప్రీత్యర్ధంచ/ వట సావిత్రీ వ్రతం కరి ష్యే** ..అనే శ్లోకాన్ని పఠించాలి. ఈ విధంగా మర్రిచెట్టును పూజిస్తే త్రిమూర్తులను పూజించిన ఫలం కలుగుతుంది. పూజానంతరం నమో వైవస్వతాయ అనే మంత్రాన్ని పఠిస్తూ మర్రిచెట్టుకు 108 సార్లు ప్రదక్షిణ చేసి, నైవేద్యం సమర్పించి, బ్రాహ్మణులు, ముత్తైదువలకు దక్షిణ తాంబూలాదులు సమర్పించాలి. ఇలా చేస్తే భర్త దీర్ఘాయుర్దాయం పొందుతాడు. పూజ పూర్తయ్యాక ప్రతి స్త్రీ, ఐదుగురు సుమంగళుల నొసట బొట్టు పెట్టి గౌరవించాలి. ఇలా చేస్తే స్త్రీలకు ఐదవతనంతో పాటు అష్టైశ్వర్యాలు, సుఖసంతోషాలు చేకూరుతాయి. ఈ వ్రతాన్ని భక్తి శ్రద్ధలతో ఆచరించిన వారికి సకల సౌభాగ్యాలు లభించడంతోపాటు రకరకాల దోషాలు, పాపాలు, కష్టనష్టాల నుంచి విముక్తిని పొందుతారు.

ఇందుకోసం మట్టి ప్రతిమలను ప్రతిష్టించుకుని, వాటికి తొమ్మిది రోజుల పాటు తొమ్మిది రకాల పిండి వంటలు నివేదనం చేస్తారు. చివరకు ఆ బొమ్మలను నీటిలో నిమజ్జనం చేస్తారు. బొమ్మలతో చేసే వ్రతం కాబట్టి దీనిని బొమ్మల నోము అని కూడా పిలుస్తా

### మౌని అమావాస్య

***సంక్రాంతి, కనుమ, ముక్కనుమ తర్వాత వచ్చేది మౌని అమావాస్య. అదీకాక ఈ మౌని అమావాస్య.. ఆదివారం (18-01-2025) వచ్చింది. ఆదివారం అమావాస్య అంటే ఆ రోజు మంచిదేనా అంటూ అందరు పలు సందేహాలు వ్యక్తం చేస్తారు. ఇంతకీ ఈ అమావాస్య మంచిదా? కాదా?. మంచిది అయితే అసలు ఆ రోజు ఏం చేయాలి అనే సందేహాలు వ్యక్తమవుతాయి. ఈ రోజు చాలా పుణ్య తిథి.. పుణ్య నదుల్లో స్నానం ఆచరించి పితృదేవతలకు తర్పణాలు వదిలితే వారికి సద్గతులు సంప్రాప్తిస్తాయని పురణాలు చెబుతున్నాయి.***

**ఇంతకీ మౌని అమావాస్య ఎప్పుడు?**

ఈ ఏడాది జనవరి18వ తేదీన ఈ అమావాస్య వస్తుంది. ఆ రోజు అమావాస్య జనవరి 18వ తేదీ ఉదయం 12.03 గంటలకు ప్రారంభమవుతుంది. ఇది జనవరి 19వ తేదీ తెల్లవారుజామున 1.21 గంటల వరకు ఉంటుంది. సూర్యోదయం ఏ తిథి ఉంటుందో దానినే హిందూ సంప్రదాయం ప్రకారం అనుసరిస్తారు. అందువల్ల మౌని అమావాస్య.. జనవరి 18వ తేదీన వస్తుంది.

**ఈ రోజు ఏం చేయాలి..**

బ్రహ్మముహూర్తంలో నిద్ర లేచి.. భూమాతకు నమస్కారించాలి. పుణ్య స్నానం ఆచరించాలి. స్నానం అనంతరం సూర్య నమస్కారం చేయాలి. ప్రత్యక్ష నారాయణుడు సూర్య భగవానుడికి అర్ఘ్యం సమర్పించాలి.శ్రీహరి, మహాలక్ష్మీ, గంగామాతను పూజించాలి. ఆవు నెయ్యితో దీపారాధన చేయాలి. శివాలయానికి వెళ్లి నవగ్రహాలకు ప్రదక్షిన చేసి.. శివుడికి రుద్రాభిషేకం చేయించాలి. కాలభైరవుడిని పూజించాలి. మౌన వ్రతం చేయడం వల్ల శక్తి పెరుగుతుంది. ఈ అమావాస్య రోజు.. మౌన వ్రతం పాటించడం వల్ల పుణ్యం లభిస్తుంది. మనస్సులో భగవంతుడి నామస్మరణ చేసుకోవడం వల్ల శక్తి అధికమవుతుంది. ఈ రోజు మీ ఇంటికి ఎవరైనా బిక్షాటనకు వస్తే.. వారిని ఖాళీ చేతులతో తిరిగి పంపకూడదు. మీ సామర్థ్యం మేరకు ఎంతో కొంత దానం చేయాలి.పితృదేవతల పేర్లు చదువుతూ మూడుసార్లు నువ్వులు, నీళ్లు కలిపి తర్పణాలు వదలాలి. ఓం పితృ దేవతాయై నమః అనే మంత్రాన్ని 11 సార్లు జపించాలి. ఉపవాస దీక్ష ఆచరించినా మంచిదే. బ్రాహ్మణులకు స్వయంపాకం ఇవ్వాలి. శక్తిని బట్టి దానం ఇవ్వాలి. ఈ రోజు సాయంత్రం తులసి మొక్క వద్ద ఆవు నెయ్యితో దీపం వెలిగించాలి. ఈ అమావాస్య రోజు.. చేయకూడని పనులు ఈ రోజు స్నానం చేసేంత వరకు ఎవరితోనూ మాట్లాడకూడదు. మౌని అంటే మౌనం అని అర్థం. సూర్యోదయానికి ముందే నిద్రలేవాలి. కాలకృత్యాలు తీర్చుకొని స్నానం చేసి.. సంకల్పం చెప్పుకోవాలి. ఈ రోజు శాంతంగా ఉండాలి. ఎవరితోనూ దురుసుగా ప్రవర్తించకూడదు. ఎవరితో వాదన పెట్టుకోకూడదు. అనవసరంగా మాట్లాడకూడదు.

పేదలు, నిస్సహాయంగా ఉన్న వారిని అవమానించవద్దు. ఇలా చేయడం వల్ల భగవంతుని ఆగ్రహానికి గురవుతారు. మౌని అమావాస్య రోజు.. నిర్జన ప్రదేశాలు, స్మశానవాటికల వైపు వెళ్లవద్దు. అలాగే మర్రి చెట్టు వద్దకు వెళ్లవద్దు. ఎందుకంటే ఆ చెట్టు వద్ద ప్రతికూలశక్తులు ఉంటాయి. ఈ మౌని అమావాస్య రోజు.. పొరపాటున ఎవ్వరినీ మోసం చేయవద్దు. ఈ రోజు మీరు ఏదైనా తప్పు చేస్తే.. పాపాల్లో భాగస్వామి కావాల్సి వస్తుంది.





# హెనిల్ 5 వికెట్లు, భారత్ గెలుపు



భారత అండర్-19 క్రికెట్ జట్టు అండర్-19 ప్రపంచ కప్లో తమ ప్రచారాన్ని అమెరికాపై ఆరు వికెట్ల తేడాతో ఘన విజయంతో ప్రారంభించింది. లక్ష్య ఛేదనలో ప్రారంభంలోనే మూడు వికెట్లు కోల్పోయి భారత జట్టు స్వల్ప ఆందోళనకు గురైనప్పటికీ, చివరికి బులవాయోలోని క్వీన్స్ స్పోర్ట్స్ క్లబ్లో డీఎల్ఎస్ పద్ధతి ద్వారా ఆరు వికెట్ల తేడాతో మ్యాచ్ను గెలవడంలో విజయం సాధించింది. హెనిల్ పటేల్ ఐదు వికెట్లు పడగొట్టగా, అభిజ్ఞాన్ కుందు భారత జట్టు తరఫున అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలిచాడు. అమెరికా 107 పరుగులకే ఆలౌట్ టాస్ గెలిచిన భారత అండర్-19 జట్టు బౌలింగ్ ఎంచుకుంది, మరియు వారి బౌలర్లు ప్రారంభం నుంచే అద్భుతంగా బౌలింగ్ చేశారు. అమెరికా బ్యాటర్లలో ఏ ఒక్కరూ క్రీజులో నిలదొక్కుకోలేకపోయారు, మరియు వారిలో కేవలం నలుగురు మాత్రమే రెండంకెల స్కోరు చేయగలిగారు. పేసర్ హెనిల్ పటేల్ ఐదు వికెట్లు పడగొట్టి బౌలర్లలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచాడు మరియు అమెరికాను స్వల్ప స్కోరుకే ఆలౌట్ చేయడంలో కీలక పాత్ర పోషించాడు. దీపేష్ దేవేంద్రన్, ఆర్ఎస్ అంబరీష్, ఖిలాన్ పటేల్ మరియు వైభవ్ సూర్యవంశీ తలో ఒక వికెట్ పడగొట్టారు. చివరికి అమెరికా 107 పరుగులకే ఆలౌట్ అయింది, నితీష్ సుడిని 36 పరుగుల ఇన్నింగ్స్తో కొంత ప్రతిఘటన చూపాడు. అద్నిత్ ఝాంబ (18), సాహిల్ గార్గ్ (16) మరియు అర్జున్ మహేష్ (16) రెండంకెల స్కోరు చేసిన ఇతర బ్యాటర్లు. భారత్ సులభంగా లక్ష్యాన్ని ఛేదించింది వర్షం కారణంగా రెండో ఇన్నింగ్స్ను 37 ఓవర్లకు కుదించారు, మరియు డీఎల్ఎస్ పద్ధతి ద్వారా లక్ష్యాన్ని 96 పరుగులకు సవరించారు. లక్ష్యం సులభమైనదే అయినప్పటికీ, జట్టు ప్రారంభంలోనే కొన్ని ఎదురుదెబ్బలు తగిలాయి, మరియు వారు 25/3 స్కోరుకు పడిపోయారు. అయితే, అభిజ్ఞాన్ కుందు మరియు విహాన్ మల్హోత్రా (18) నాలుగో వికెట్కు 45 పరుగుల భాగస్వామ్యంతో జట్టును ఆదుకున్నారు. కుందు 41 బంతుల్లో అజేయంగా 42 పరుగులు చేశాడు. తదుపరి మ్యాచ్ బంగ్లాదేశ్తో భారత అండర్-19 జట్టు తమ తదుపరి మ్యాచ్ను జనవరి 17, శనివారం బులవాయోలోని క్వీన్స్ స్పోర్ట్స్ క్లబ్లో బంగ్లాదేశ్తో ఆడనుంది. భారత్ చివరిసారిగా 2022లో ఈ టోర్నమెంట్ను గెలుచుకుంది మరియు మరోసారి ట్రోఫీని గెలవాలని లక్ష్యంగా పెట్టుకుంది.




# ఎంఐ పై యుపి వారియర్స్ విజయం




నవీ ముంబైలోని డాక్టర్ డివై పాటిల్ స్పోర్ట్స్ అకాడమీలో జరిగిన 8వ మ్యాచ్లో ముంబై ఇండియన్స్ను ఏడు వికెట్ల తేడాతో విజయం సాధించి యూపీ వారియర్జ్ (ఖూఔ) ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ 2026లో తమ తొలి విజయాన్ని నమోదు చేసుకుంది. హర్లీన్ డియోల్ అజేయంగా 64 పరుగులు చేసి బ్యాటింగ్లో రాణించగా, బౌలింగ్ విభాగం సమష్టిగా రాణించింది. హర్లీన్ డియోల్ యూపీ వారియర్జ్ను విజయతీరాలకు చేర్చింది 162 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో, మెగ్ లానింగ్ (25) మరియు కిరణ్ నవ్గిరే (10) వికెట్లను కోల్పోయి యూపీ వారియర్జ్ 45/2 స్కోరుతో కష్టాల్లో పడింది. నాల్గవ స్థానంలో బ్యాటింగ్కు వచ్చిన హర్లీన్ డియోల్, ఫోబ్ లిచ్ఫీల్డ్ (25)తో కలిసి మూడవ వికెట్కు కేవలం 49 బంతుల్లోనే 73 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. ఆ తర్వాత హర్లీన్, క్లో ట్రయాన్ (11 బంతుల్లో అజేయంగా 27 పరుగులు)తో కలిసి నాల్గవ వికెట్కు 19 బంతుల్లోనే 44 పరుగుల మెరుపు భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. హర్లీన్ బ్యాటింగ్లో అద్భుతంగా రాణించి, 12 బౌండరీలతో 39 బంతుల్లో అజేయంగా 64 పరుగులు చేసింది. ఆమె ఇన్నింగ్స్ జట్టుకు 11 బంతులు మిగిలి ఉండగానే లక్ష్యాన్ని ఛేదించడంలో సహాయపడింది. మిపై యుపి తరఫున నాట్ స్కివర్-బ్రంట్ రెండు వికెట్లు పడగొట్టింది. నాట్ స్కివర్-బ్రంట్ అర్ధ సెంచరీతో వీ× స్కోరు 161/5 యూపీ వారియర్జ్ టాస్ గెలిచి ముంబై ఇండియన్స్ను మొదట బ్యాటింగ్కు ఆహ్వానించింది. వారి జట్టులో ఇద్దరు బ్యాటర్లు అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. నాట్ స్కివర్-బ్రంట్ 43 బంతుల్లో తొమ్మిది బౌండరీలు, ఒక సిక్సర్తో సహా 65 పరుగులు చేసి రాణించింది. అలాగే, నికోలా క్యారీ దిగువ వరుసలో 20 బంతుల్లో అజేయంగా 32 పరుగులు చేసింది. మధ్య ఓవర్లలో బ్రంట్ అర్ధ సెంచరీ, చివర్లో క్యారీ మెరుపు ఇన్నింగ్స్ జట్టు స్కోరును 161/5కి చేర్చాయి, కానీ చివరికి ఆ స్కోరు విజయం సాధించడానికి సరిపోలేదు. వీ× రెండో స్థానంలో, ఖూఔ ఐదో స్థానంలో పాయింట్ల పట్టికలో ముంబై ఇండియన్స్ రెండో స్థానంలో ఉంది, ప్రస్తుతం ఆడిన నాలుగు మ్యాచ్లలో రెండు గెలిచి, రెండింటిలో ఓడిపోయింది. మరోవైపు, యూపీ వారియర్జ్ నాలుగు మ్యాచ్లలో ఒక విజయం, మూడు ఓటములతో పట్టికలో అట్టడుగున ఐదవ స్థానంలో ఉంది.

# విశ్వనాథన్ ఆనంద్ తర్వాత మరో ఆశాకిరణం

- ప్రపంచచెస్ రారాజు స్థానమే లక్ష్యమంటున్న తెలుగుతేజం
- భారత చెస్‌లో మార్మోగుతున్న అర్జున్ ఇరిగేశి పేరు
- ర్యాపిడ్, బ్లిట్జ్ ఛాంపియన్ షిప్‌లో సంచలన ప్రదర్శన
- ఆనంద్ తర్వాత ఒకేసారి 2పతకాలు గెలిచిన అర్జున్
- ఛాంపియన్ మాగ్నస్ కార్ల్ సన్‌ను ఓడించిన యువకెరటం





తెలంగాణ బ్యూరో ప్రతినిధి : చిన్నవయస్సుకే గ్రాండ్ మాస్టర్ హోదా! తనకంటే మెరుగైన రేటింగ్ గల ఆటగాళ్లు, దిగ్గజాలపై సంచలన విజయాలు పదుల సంఖ్యలో జాతీయ, అంతర్జాతీయ టైటిళ్లు 64 గడుల ఆటలో అడుగు పెట్టిన అనతికాలంలోనే అనేక మైలురాళ్లు అందుకున్నాడు. అద్భుత ప్రతిభ, తిరుగులేని వ్యూహాలతో రారాజు స్థానం వైపు వడివడిగా అడుగులు వేశాడు. అతడే తెలుగుతేజం అర్జున్ ఇరిగేశి. చెస్ ప్రపంచంలో అంచెలంచెలుగా ఎదుగుతున్న ఈ తెలంగాణ కుర్రాడు ఇటీవల ప్రపంచ ర్యాపిడ్, బ్లిట్జ్ ఛాంపియన్షిప్లో సంచలన ప్రదర్శనతో అందరి దృష్టి తనవైపు తిప్పుకున్నాడు. ఆ విజయ పరంపర కొనసాగిస్తునే ఉన్నాడు. అతడి స్ఫూర్తిదాయక ప్రస్థానం నేటి యువ ప్రత్యేక కథనం. భారత, ప్రపంచ చెస్లోమార్మోగుతున్న పేరు అర్జున్ ఇరిగేశి. అంచెలంచెలుగా ఎదుగుతున్న ఈ తెలంగాణ కుర్రాడు తాజాగా ప్రపంచ ర్యాపిడ్, బ్లిట్జ్ ఛాంపియన్షిప్లో సంచలన ప్రదర్శన చేశాడు. ఆనంద్ తర్వాత ఈ ఛాంపియన్షిప్లో ఒకేసారి 2 పతకాలు గెలిచిన భారత క్రీడాకారుడిగా రికార్డు నెలకొల్పాడు. ఈ క్రమంలో ప్రపంచ నంబర్వన్, 5సార్లు ప్రపంచ ఛాంపియన్ మాగ్నస్ కార్ల్సన్ను సైతం అర్జున్ ఓడించాడు. 2026ను టైటిల్స్ వేటతోనే ప్రారంభించి న అర్జున్ టాటా స్టీల్ చెస్ టోర్నీ బ్లిట్జ్ విభాగంలోనూ కాంస్యం అందుకున్నాడు.

"ఖవాా : విశ్వనాథన్ ఆనంద్ తర్వాత మరో ఆశాకిరణం - ప్రపంచచెస్ రారాజు స్థానమే లక్ష్యమంటున్న తెలుగుతేజం (జుఎ)

ప్రపంచానికి గట్టిగా పరిచయం చేసింది : 2024లో జరిగిన ప్రతిష్ఠాత్మక చెస్ ఒలంపియాడ్లో అసాధారణ విజయాలతో అందరి దృష్టిఆకర్షించాడు అర్జున్. దశాబ్దాల కల నెరవేర్చుతూ పురుషులు , మహిళల 2 జట్లూ స్వర్ణాలు అందుకున్నాయి. నాడు అన్ని గేమ్లు ఆడడమే కాదు. 11 గేమ్లో 9 విజయాలు, 2 డ్రాలతో అసాధారణ ప్రదర్శన చేశాడు. 190 దేశాలు తలపడిన ఆ పోటీల్లో భారత చెస్ జట్టు విజయం సాధించడం మాత్రమే కాదు ఆద్యంతం పూర్తి ఆధిపత్యం చెలాయించింది. ఒకరకంగా మన యువ బలగం బలాన్ని ప్రపంచానికి గట్టిగా పరిచయం చేసింది నాటి ప్రదర్శన.

తల్లిదండ్రుల ప్రోత్సాహం, కోచ్ల శిక్షణలో : అంతర్జాతీయ చెస్లో స్థిరమైన ప్రదర్శన చేస్తున్న అర్జున్ ఇరిగేశి 2003 సెప్టెంబర్ 3న హనుమకొండలో సాధారణ మధ్యతరగతి కుటుంబంలో జన్మించాడు. అక్కడి నుంచి ఈ స్థాయికి రావడానికి బాటలు వేసినవి కృషి, పట్టుదలలే. తండ్రి శ్రీనివాసరావు డాక్టర్. తల్లి గృహిణి. అలా చెస్ నేపథ్యం లేని కుటుంబం నుంచి 8 ఏళ్ల ప్రాయంలోనే సరదాగా ఇటువైపు అడుగులు వేశాడు. స్కూల్ టీచర్ తన ప్రతిభ గుర్తించడం, తల్లిదండ్రుల ప్రోత్సాహం, అక్కతో కలిసి ప్రాక్టీస్, కోచ్ల శిక్షణలో రాటుదేలడం అన్ని అర్జున్ను ఈ రోజు ఇలా నిలిపాయి. 14 ఏళ్ల 11 నెలలకే గ్రాండ్ మాస్టర్ హోదా : చాలావేగంగా అంతర్జాతీయస్థాయికి ఎదిగిన అర్జున్ మెరుగైన ర్యాంకులతో ముందున్న ఆటగాళ్లను ఓడించడం అలవాటుగా మార్చుకున్నాడు. ఈ క్రమంలో దేశంలో 14 ఏళ్ల 11 నెలలకే గ్రాండ్ మాస్టర్ హోదా సాధించి రికార్డు సృష్టించాడు. 2021లో గట్టి పోటీని దాటి టాటా స్టీల్ ఇండియా ర్యాపిడ్ ఛాంపియన్షిప్ సొంతం చేసుకున్నాడు. ఆ టైటిల్ సొంతం చేసుకున్న తొలి భారతీయుడిగా నిలిచాడు. 2022 ప్రారంభంలోనే టాటా స్టీల్ చెస్ టోర్నమెంట్ ఛాలెంజర్స్ కేటగిరీలో అర్జున్ తిరుగులేని ప్రదర్శన చేశాడు.

పలు టైటిల్స్తో చరిత్ర సృష్టించి : అదే 2022లో ఇండియన్ నేషనల్ సీనియర్ ఛాంపియన్షిప్ కైవసం చేసుకున్నాడు అర్జున్ ఇరిగేశి. అబుదాబీ ఇంటర్నేషనల్ చెస్ ఫెస్టివల్, టాటా స్టీల్ చెస్ ఇండియా బ్లిట్జ్ టైటిల్స్, జూనియర్ స్పీడ్ చెస్ ఛాంపియన్షిప్ల గెలుచుకున్నాడు. 2022 అక్టోబర్లోనే కార్ల్సన్పై తన తొలి విజయం నమోదు చేసుకున్నాడు. కొద్ది రోజుల్లోనే అర్జున్కు ఆర్థికంగా అండగా నిలిచేందుకు క్వాంట్బాక్స్ సాన్సర్షిప్ ఒప్పందం చేసుకుంది. తర్వాత తను వెనుదిరిగి చూడలేదు. 2023లో షార్జా మాస్టర్స్ టైటిల్ అందుకున్నాడు. ఫిడే ప్రపంచకప్లో క్వార్టర్ ఫైనల్ వరకు చేరుకున్నాడు. 19వ ఆసియా క్రీడల్లో భారత పురుషుల జట్టు తరఫున రజతం గెలుచుకున్నాడు. 2024లో పలు టైటిల్స్తో పాటు 2800 లైవ్ రేటింగ్తో చరిత్ర సృష్టించాడు.

చిన్నవయస్సులోనే ఆ ఘనత : 2800 ఎలో రేటింగ్ దాటడం చాలా తక్కువ మందికి సాధ్యమైన ఫీట్. ఎవరూ ఊహించని విధంగా అర్జున్ ఆ ఘనతను చిన్నవయస్సుకే సాధించాడు. తద్వారా గ్యారీ కాస్పరోవ్, క్రామ్నిక్, అలెంగ్జాండర్ గ్రిషుక్, కార్ల్సన్, కరువానా, షికారు నకమ్నురా తదితర ప్రముఖుల జాబితాలో సగౌవరంగా చోటు దక్కించుకున్నాడు. దశాబ్దాల సుదీర్ఘ చరిత్ర కలిగిన భారత చెస్లో విశ్వనాథన్ ఆనంద్ 2011 మార్చిలో అత్యధికంగా 2817 ఎలో రేటింగ్ అందుకున్నా రు. 2025ప్రపంచ ర్యాపిడ్, బ్లిట్జ్ ఛాంపియన్షిప్లో అర్జున్ ప్రదర్శన పెద్దటోర్నీల్లో తడబడతాడన్న అపవాదుని చెరిపేసింది.

జైత్రయాత్రలో తల్లి పాత్ర ప్రత్యేకం : ప్రపంచచెస్లో అర్జున్ ఇరిగేశి జైత్రయాత్రలో తల్లి పాత్ర గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. తండ్రి వైద్యవృత్తిలో బిజీగా ఉండటంతో ఆమే వెన్నంటి ఉండి నడిపించేవారు. పోటీ సమయంలో ఒత్తిడిని అధిగమించి, ఆత్మవిశ్వాసంతో ఆడేలా నిరంతరం ప్రేరణనిచ్చే వారు. ఓటమికి కుంగి పోవద్దు గెలుపోటములు ఆటలో భాగమే అని నేర్పారు. ఆమె ఇచ్చిన ఆత్మవిశ్వాసమే నేడు అర్జున్ను ప్రపంచ వేదికపై తలవంచని యోధుడిగా నిలబెట్టింది.

ప్రపంచ ఛాంపియన్ కావడమే లక్ష్యం : ప్రధాని మోదీ, సీఎం రేవంత్ రెడ్డి సహా ఎందరో ప్రముఖుల ప్రశంసలు అందుకున్న ఈ తెలుగు తేజం ప్రస్థానంలో మరెన్నోఅద్భుతాలు ఎదురుచూస్తున్నాయి. ప్రపంచ ఛాంపియన్ కావడమే తన అంతిమ లక్ష్యమని చెబుతున్న అర్జున్ ఇరిగేశి మరిన్ని శిఖరాలు అధిరోహించాలని కోరుకుందాం. "8 సంవత్సరాల వయసు నుంచే నేను చెస్ ప్రారంభించాను. నా ఆటలోనూ ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొన్నాను. తల్లితండ్రులు స్పాన్సర్ల సహకారంతో అంచలంచెలంచెలుగా ఎదిగాను. నేను చదువుకునే రోజుల్లో పరీక్షల సమయాల్లో సైతం మా తల్లిదండ్రులు చెస్కే ప్రాధాన్యం ఇచ్చేవారు. సంపత్, సుదర్శన్ల వద్ద వరంగల్లోనే ఆట నేర్చుకున్నాను. ప్రస్తుతం వారు హైదరాబాద్లో ఉంటున్నారు. తర్వాత హైదరాబాద్లో తర్వాత అంతర్జాతీయంగా అడుతూ, నేర్చుకుంటూ ఉన్నాను." - అర్జున్ ఇరిగేశి, చెస్ క్రీడాకారుడు

# సలాహ్ లివర్పూల్‌కు రీ టర్న్



ఆఫ్రికా కప్ ఆఫ్ నేషన్స్ నుండి ఈజిప్ట్ ఫార్వర్డ్ ఆటగాడు తిరిగి రానున్న నేపథ్యంలో, తన వద్ద 15 మంది అటాకర్లు ఉన్నప్పటికీ మహ్మద్ సలాహ్ను లివర్పూల్కు తిరిగి స్వాగతిస్తానని ఆర్నే స్లాట్ అన్నారు. శనివారం మొరాకోలో నైజీరియాతో జరిగే ఈజిప్ట్ మూడవ స్థానం కోసం జరిగే ప్లే-ఆఫ్ మ్యాచ్లో సలాహ్ ఆడనున్నాడు. గత నెల ప్రారంభంలో ఒక సంచలన ఇంటర్వ్యూలో అతను లివర్పూల్పై విమర్శలు చేసిన తర్వాత, అతని రాక ఒక ప్రధాన చర్చనీయాంశంగా మారింది. వరుసగా మూడు గేమ్లకు తనను బెంచ్కే పరిమితం చేసినందుకు క్లబ్ తనను "బలిపశువును చేసిందని" సలాహ్ ఆరోపించాడు మరియు మేనేజర్ స్లాట్తో తనకు ఎలాంటి సంబంధం లేదని చెప్పాడు. కానీ డిసెంబర్ 13న బ్రైటన్పై 2-0 తేడాతో సాధించిన ప్రీమియర్ లీగ్ విజయంలో అతను ప్రత్యామ్నాయ ఆటగాడిగా బరిలోకి దిగి, ఒక అసిస్ట్ అందించాడు, ఆ తర్వాత ఈ వివాదం నుండి క్లబ్ బయటపడిందని స్లాట్ చెప్పాడు. పట్టికలో నాలుగో స్థానంలో ఉన్న స్లాట్ జట్టు శనివారం కష్టాల్లో ఉన్న బర్న్లీతో తలపడనుంది. ఈ సందర్భంగా మ్యాచ్కు ముందు జరిగిన విలేకరుల సమావేశంలో సలాహ్ తిరిగి రావడం గురించి స్లాట్ను అడిగారు."అన్నింటికంటే ముందు, అతను శనివారం ఈజిప్ట్ తరపున మరో ముఖ్యమైన మ్యాచ్ ఆడాలి," అని ఆ డచ్ కోచ్ అన్నాడు."ఆ తర్వాత అతను మా వద్దకు తిరిగి వస్తాడు, మరియు అతను తిరిగి వస్తున్నందుకు నేను సంతోషంగా ఉన్నాను. మో ఈ క్లబ్కు, నాకు చాలా ముఖ్యమైనవాడు, కాబట్టి అతను తిరిగి వచ్చినందుకు నేను సంతోషిస్తున్నాను."ఎందుకంటే నా దగ్గర 15 మంది అటాకర్లు ఉన్నప్పటికీ, అతను తిరిగి వస్తే నేను సంతోషించేవాడిని, కానీ ప్రస్తుతం మా పరిస్థితి అది కాదు. కాబట్టి అతను ఇంకా ఆడాల్సిన ఒక ముఖ్యమైన మ్యాచ్ తర్వాత అతను తిరిగి వస్తున్నందుకు నేను సంతోషంగా ఉన్నాను."- వ్యక్తిగత సంభాషణలు - 2017లో లివర్పూల్లో చేరిన 33 ఏళ్ల సలాహ్తో తన సంభాషణల వివరాలను వెల్లడించడానికి స్లాట్ నిరాకరించాడు."మోకు, నాకు మధ్య మా ఫోన్లో లేదా ఇక్కడ జరిగే విషయాలు మా ఇద్దరి మధ్యే ఉంటాయని నేను భావిస్తున్నాను," అని అతను చెప్పాడు."నా ఆటగాళ్లలో ఎవరితోనైనా ఫోన్లో లేదా ఇక్కడ నేను జరిపే అన్ని వ్యక్తిగత సంభాషణలను పంచుకోవడం నాకు అవసరమని నేను అనుకోవడం లేదు."గత సీజన్లో లివర్పూల్ 20వ ఇంగ్లీష్ లీగ్ టైటిల్ను గెలుచుకున్నప్పుడు సలాహ్ 29 లీగ్ గోల్స్ చేసి ప్రీమియర్ లీగ్ గోల్డెన్ బూట్ను గెలుచుకున్నాడు, కానీ ప్రస్తుత సీజన్లో కేవలం నాలుగు గోల్స్ మాత్రమే చేయగలిగాడు. సలాహ్ ఎప్పుడు ఆడేందుకు అందుబాటులో ఉంటాడని ఆశిస్తున్నారని స్లాట్ను అడిగారు."వచ్చే వారం," అని అతను చెప్పాడు. "మేము అతనితో చర్చలు జరుపుతున్నాము, అక్కడ అతని నుండి ఏమి ఆశిస్తున్నారు మరియు ఇక్కడ మేము ఏమి ఆశిస్తున్నాము అనే దానిపై మాట్లాడుతున్నాము." అయితే, అన్నింటికంటే ముందు, డి జెర్సీకి చెందిన మార్సెయిల్తో తలపడి, ఆ తర్వాత వచ్చే వారాంతంలో బోర్న్మౌత్కు వెళ్తుంది.




# అర్జున్ పాండే చరిత్ర

పాట్నాకు చెందిన పారా-అథ్లెట్ అర్జున్ పాండే, పారా-క్లైంబింగ్లో బీహార్కు మొదటి జాతీయ పతకాన్ని సాధించి చరిత్ర సృష్టించాడు. చిన్నతనంలో రైలు ప్రమాదంలో కాలు కోల్పోయినప్పటి నుండి విజేతల వేదికపై నిలబడే వరకు అతని ప్రయాణం, విషాదం తర్వాత జీవించి నిలబడటానికి, కోలుకోవడానికి మరియు జీవితాన్ని పునర్నిర్మించుకోవడానికి సంబంధించిన ఒక శక్తివంతమైన కథను తెలియజేస్తుంది. డిసెంబర్ చివరి వారంలో బెంగళూరులో జరిగిన 5వ పారా క్లైంబింగ్ నేషనల్ కప్ 2025లో, అర్జున్ దిగువ అవయవ వైకల్యం విభాగంలో కాంస్య పతకాన్ని గెలుచుకున్నాడు. ఇప్పుడు, అతను పారా క్లైంబింగ్ ప్రపంచ కప్ మరియు పారాలింపిక్స్పై దృష్టి సారించాడు. జీవితాన్ని మార్చిన ప్రమాదం ఫుల్వారీ అసెంబ్లీ నియోజకవర్గంలోని పున్పున్ బ్లాక్లోని లఖ్నా బజార్ గ్రామానికి చెందిన అర్జున్, తాను 8వ తరగతి చదువుతున్నప్పుడు 2012లో తన జీవితం ఒక వినాశకరమైన మలుపు తీసుకుందని చెప్పాడు."రైలు ఎక్కే ప్రయత్నంలో, నేను ఒక ప్రమాదానికి గురయ్యాను, దానివల్ల నా కుడి కాలు తీసివేయవలసి వచ్చింది. ఆ సమయంలో, నేను నా జీవితాన్ని ఎలా గడపాలో అర్థం కాలేదు. జీవించాలనే నా సంకల్పం పూర్తిగా దెబ్బతింది," అని అతను చెప్పాడు. ఈ ప్రమాదం కుటుంబాన్ని తీవ్ర దుఃఖంలోకి నెట్టివేసింది, అతని చికిత్స కోసం అతని తల్లి తన ఆభరణాలన్నీ అమ్మవలసి వచ్చింది. "మా నాన్న మతపరమైన పూజలు చేస్తూ సాధారణంగా జీవనం సాగించేవారు, కానీ మేము చాలా సంవత్సరాలు ఆర్థికంగా కోలుకోవడానికి చాలా కష్టపడ్డాము," అని అర్జున్ చెప్పాడు. ప్రమాదం తర్వాత జరిగిన సంఘటనలను గుర్తుచేసుకుంటూ, శారీరక గాయం తనను మానసికంగా కుంగదీసిందని అర్జున్ చెప్పాడు. "నేను దాదాపు 8 నుండి 10 సంవత్సరాల పాటు డిప్రెషన్లో ఉన్నాను, ఇంటి నుండి అరుదుగా బయటకు వచ్చేవాడిని మరియు నా కుటుంబానికి భారం అని భావించేవాడిని," అని అతను చెప్పాడు. అయితే, వైద్య పరీక్ష సమయంలో ఒక డాక్టర్ ఇచ్చిన చిన్న సలహా అతని జీవితాన్ని శాశ్వతంగా మార్చివేసింది. "ఒక డాక్టర్ నన్ను క్రీడలు చేపట్టమని ప్రోత్సహించారు, బీహార్ మరియు భారత ప్రభుత్వాలు పారా-అథ్లెట్లను ప్రోత్సహిస్తున్నాయని మరియు అవకాశాలు పెరుగుతున్నాయని చెప్పారు. ఆ సలహా నాకు కొత్త ఆశను ఇచ్చింది," అని అర్జున్ చెప్పాడు. ఆ కాంప్లెక్స్లో పిల్లలు స్పోర్ట్ క్లైంబింగ్ సాధన చేయడం నేను గమనించినప్పుడు ఒక మలుపు వచ్చింది. "ఆసక్తితో, నేను బీహార్ స్పోర్ట్ క్లైంబింగ్ అసోసియేషన్ శిక్షకుడు మరియు కార్యదర్శి అయిన సయ్యద్ అబదుర్ రెహమాన్ను సంప్రదించాను," అని అతను చెప్పాడు. తాను కూడా పర్వతారోహణ చేయవచ్చా అని అడిగినప్పుడు, పారా-క్లైంబింగ్లో తనకు ఇంకా ఎక్కువ అవకాశాలు ఉన్నాయని చెప్పారని అర్జున్ తెలిపాడు. ఆ అసోసియేషన్ అర్జున్కు ఉచిత శిక్షణను అందించింది. రోజువారీ ఖర్చుల కోసం, అతను శిక్షణ మరియు పనిని సమన్వయం చేసుకుంటూ, జొమాటో డెలివరీ బాయ్గా పార్ట్టైమ్గా పనిచేయడం కూడా ప్రారంభించాడు."నేను ఉదయం విలువిద్య మరియు పర్వతారోహణ సాధన చేస్తాను మరియు సాయంత్రం 6:30 నుండి రాత్రి 10 లేదా 10:30 వరకు పని చేస్తాను," అని అతను చెప్పాడు. మొదట్లో ట్రైసైకిల్ ఉపయోగించిన అతను, ఇటీవల ఈఎంఐ పద్ధతిలో ఒక ఎలక్ట్రిక్ స్కూటర్ను కొనుగోలు చేశాడు. అర్జున్ పాట్నాలో రాజేంద్ర మరియు మంజు సిన్హా అనే దివ్యాంగ దంపతులతో కలిసి నివసిస్తున్నాడు. వారు పూల నుండి అగరబత్తులు తయారు చేస్తూ, దివ్యాంగులకు ఉపాధి తీవ్రంగా కుంగిపోయిందని అర్జున్ చెప్పాడు.

# టాలీవుడ్ సినీ వివాదాలు

**2025లో టాలీవుడ్ లో విజయాలకన్నా వివాదాలకే ఎక్కువ ప్రాధాన్యం దక్కింది. అగ్ర హీరోల నుంచి సీనియర్ నటుల వరకూ పలువురు సెలబ్రిటీలు వివాదాస్పద వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచారు. పలువురు దర్శక నిర్మాతలు, యాంకర్లు, లిరిసిస్టులు, కూడా వివాదాలు కొనితెచ్చుకున్నారు. మహిళల వస్త్రధారణ, వారసత్వ వ్యాఖ్యలు, అసభ్య పదజాలం, రాజకీయ వ్యాఖ్యలు.. ఇలా అనేక వివాదాలు పరిశ్రమను కుదిపేశాయి. పోలీసు కేసులు, క్షమాపణలు, ఫ్యాన్ వార్స్‌తో ఈ ఏడాది టాలీవుడ్‌కు 'వివాదాల సంవత్సరం'గా మిగిలింది. గడిచిన ఏడాది కాలంలో టాలీవుడ్ లో అనేక వివాదాలు చోటుచేసుకున్నాయి. సినిమా విజయాల కంటే వివాదాలే ఎక్కువ కనిపిస్తున్నాయి. ఈ ఏడాది టాలీవుడ్ ను వణికించిన వివాదాలు, సంచలనం సృష్టించిన కేసులు, కాంట్రవర్సీలు ఏంటో చూద్దాం...**



**మెగాస్టార్ లేడీస్ హాస్టల్ వార్డెన్ కామెంట్స్..**మెగాస్టార్ చిరంజీవి ఈ ఏడాది ఊహించని విధంగా వివాదంలో చిక్కుకున్నారు. ఎప్పుడూ హుందాగా మాట్లాడుతూ తన పెద్దరికాన్ని చాటుకునే చిరు.. బ్రహ్మా ఆనందం సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ఆడపిల్లలపై చిరంజీవి చేసిన కామెంట్లు వివాదాస్పదంగా మారాయి. ఇంట్లో అందరూ ఆడపిల్లలే ఉన్నారని, వారిని చూస్తుంటే కొన్ని సార్లు లేడీస్ హాస్టల్ కి వార్డెన్‌లాగా ఉంటుందనిపిస్తుందని చిరంజీవి అన్నారు. తమ లెగసీని కంటిన్యూ చేయడానికి ఒక్క మగపిల్లాడు కావాలని, ఈసారైనా ఒక్క మగపిల్లాడిని కనివ్వాలని రామ్ చరణ్ ను అడుగుతున్నానని, మళ్లీ ఆడపిల్లను కంటాడేమో అనే భయంగా ఉందని సరదాగా అన్నారు. అయితే ఆయన వ్యాఖ్యలను నెటిజన్లు సరదాగా తీసుకోలేదు. మహిళలను కించపరిచారంటూ విపరీతంగా ట్రోల్ చేశారు. అసెంబ్లీలో చిరంజీవిపై బాలయ్య అభ్యంతరకర వ్యాఖ్యలు..సీనియర్ హీరోలైన చిరంజీవి - నందమూరి బాలకృష్ణ మధ్య ఈ ఏడాది ఊహించని విధంగా ఓ వివాదం చోటుచేసుకుంది.

**హిందూపురం ఎమ్మెల్యే బాలయ్య..** ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో మాట్లాడుతూ సీఎంని కలిసే సినీ ప్రముఖుల జాబితాలో తన పేరును ఎక్కడో 9వ స్థానంలో వేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. చిరంజీవి పేరు ప్రస్తావిస్తూ అవమానకరంగా మాట్లాడారు. దీనిపై చిరంజీవి ఘాటుగా స్పందించారు. బాలకృష్ణ కామెంట్స్ కు కౌంటర్ గా ప్రెస్ నోట్ రిలీజ్ చేశారు. అఖిల భారత చిరంజీవి యువత అప్పట్లో బాలకృష్ణపై రెండు తెలుగు రాష్ట్రాల్లో 300 పైగా పోలీస్ స్టేషన్స్‌లో కంప్లెయింట్ చేయాలని అనుకున్నారు. అయితే చిరంజీవి వారించడంతో వెనక్కి తగ్గారు. డేవిడ్ వార్నర్, అలీపై రాజేంద్రప్రసాద్ అసభ్యకర వ్యాఖ్యలు..సీనియర్ నటుడు రాజేంద్రప్రసాద్ ఈ ఏడాది రెండుసార్లు వివాదంలో చిక్కుకున్నారు. డైరెక్టర్ ఎస్.వీ. కృష్ణారెడ్డి పుట్టినరోజు వేడుకల్లో కమెడియన్ అలీపై అసభ్యకరమైన కామెంట్స్ చేసారు. ఎక్కడ ఆ లం కొకు అంటూ నోరు పారేసుకున్నారు. అంతకముందు రాబిన్ హుడ్ మూవీ ఈవెంట్‌లో ఆస్ట్రేలియన్ క్రికెటర్ డేవిడ్ వార్నర్ ను అనరాని మాటలు అని వివాదం కొనితెచ్చుకున్న. రెండు సందర్భాల్లోనూ ఆయన వివరణ ఇవ్వాల్సి వచ్చింది. ఇక 'స:కుటుంబానాం' సినిమా ఈవెంట్‌లో ముసలి ము కొడుకు అంటూ బ్రహ్మానందంపై రాజేంద్రప్రసాద్ నోరుజారిన సంగతి తెలిసిందే.




**కాంట్రవర్సీగా మారిన దిల్ రాజు కల్లు కామెంట్స్..**సంక్రాంతి టైమ్‌లో దిల్‌రాజు మాట్లాడుతూ సినిమాల విషయంలో ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాలను కంపేర్ చేస్తూ చేసిన కామెంట్స్ కాంట్రవర్సీ అయ్యాయి. సంక్రాంతి అంటే ఆంద్రా వాళ్లకి సినిమాల పండగ.. తెలంగాణ వాళ్లకైతే మటన్, తెల్ల కల్లు ఉంటే చాలు అని ఆయన అన్నారు. సరదాకి అన్న మాటలకు తెలంగాణ ప్రజలు నొచ్చుకున్నారు. తెలంగాణ అంటే తాగుడు, తినుడేనా అనేదే ఆయన ఉద్దేశం అంటూ ఫైర్ అయ్యారు.

**శిరీష్ గేమ్ ఛేంజర్ వివాదం..**ఎన్నడూ మీడియా ముందు మాట్లాడని దిల్ రాజు సోదరుడు శిరీష్.. తొలిసారిగా ఇంటర్వ్యూ ఇచ్చి వివాదంలో చిక్కుకున్నారు. గేమ్ ఛేంజర్ చిత్రంపై ఆయన చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. సినిమా ఫ్లాప్ అయిన తర్వాత మాకు ఎవరైనా సాయం చేశారా? హీరో ఏమైనా సాయం చేశారా? డైరెక్టర్ ఏమైనా సాయం చేశారా? కనీసం కర్టసీ కోసమైనా ఫోన్ చేసి మాట్లాడలేదు అని శిరీష్ చెప్పారు. ఈ మాటలు మెగా అభిమానులకు కోపం తెప్పించాయి. శిరీష్ నోటికొచ్చినట్లు మాట్లాడితే ఊరు కోమని హెచ్చరిస్తూ ఓ లేఖ విడుదల చేశారు. దీంతో శిరీష్ క్షమాప ణలు చెబుతూ ఓ ప్రకటన విడుదల చేశారు. రామ్‌చరణ్ తమకు అన్ని విధాలా సహకరిం చారని తెలిపారు.



**వివాదాల ఎస్‌కేఎన్** ఈ ఏడాది వివాదా స్పద వ్యాఖ్యలతో, చేష్టలతో వార్తల్లో నిలిచిన నిర్మాత. ఎంటర్ ది డ్రాగన్ ఈవెంట్లో తెలుగు హీరోయిన్లను ఉద్దేశించి అతడు చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. తెలుగు రాని వీ ా రో ంు ్ల ను అ భి వ ూ ని స్తా మని, తెలుగమ్మాయిలను ఎంకరేజ్ చేస్తే ఏమవు తుందో ఈ మధ్యనే తనకు అర్థమ యిందని, అందుకే తెలుగమ్మాయిలను ఎంకరేజ్ చేయకూడదని అను కున్నామని అన్నాడు. ఎస్కేఎన్ కామెంట్స్ పై నెటిజన్స్ ఫైర్ అవ్వడంతో, 25 మంది తెలుగమ్మాయిలను హీరోయిన్లుగా పరిచయం చేయడం తన టార్గెట్ అంటూ వివరణ ఇచ్చుకున్నాడు. ఆ తర్వాత సింగిల్ ప్రమోషన్స్ లో హీరోయిన్ కేతిక శర్మ బాత్ రూమ్ లోకి తమకు యాక్సెస్ లేదంటూ చేసిన వ్యాఖ్యలపై కూడా అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. అలానే ది రాజాసాబ్ ఈవెంట్ లో నిర్మాత జాతిని! అనే క్యాప్షన్ ప్రింట్ చేసిన టీ-షర్ట్ వేసుకోవడంపైనా ట్రోలింగ్ జరిగింది.


దుమారం రేపిన **దర్శకధీరుడి వ్యాఖ్యలు..దర్శకధీరుడు ఎస్.ఎస్ రాజమౌళి** కూడా ఈ ఏడాది వివాదంలో చిక్కుకున్నారు. వారణాసి మూవీ గ్లోబ్ ట్రాటర్ ఈవెంట్‌లో దేవుడిపై నమ్మకం లేదంటూ రాజమౌళి చేసిన వ్యాఖ్యలపై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. దర్శకుడు క్షమాపణలు చెప్పాలంటూ పలు హిందూ సంఘాలు, బీజేపీ నేతలు డిమాండ్ చేస్తున్నారు. దేవుడిపై నమ్మకం లేదంటూ దేవుడిపై ఎందుకు సినిమాలు తీసి డబ్బు చేసుకుంటున్నా రంటూ విమర్శించారు. వివాదరహితుడిగా పేరున్న జక్కన్న.. ఈ వివాదం కారణంగా కొన్ని రోజుల పాటు వివాదాలకు కేంద్ర బిందువయ్యారు. ఆయనకు రామ్‌గోపాల్ వర్మతో సహా పలువురు మద్దతుగా నిలిచారు. మహిళల వస్త్రధారణపై శివాజీ అసభ్యకర కామెంట్స్.. నటుడు శివాజీ ఇటీవల మహిళల డ్రెస్సింగ్ పై టంగ్ స్లిప్ అయినసంగతి తెలిసిందే.




**దండోరా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో హీరోయిన్ల వస్త్రధా రణపై మాట్లాడుతూ..** సామాన్లు, దరిద్రపు ముం లాంటి పదాలు వాడారు. దీనిపై ఆయన క్షమాపణలు చెబుతూనే, తన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నా నంటూ మరింత రెచ్చగొట్టేలా మాట్లాడారు. నిధి అగర్వాల్, అనసూయలను కూడా ఇష్యూలోకి లాగారు. నాగబాబు, రామ్ గోపాల్ వర్మ, చిన్మయి, మంచు లక్ష్మి, మంచు మనోజ్, హెబ్బా పటేల్, పాయల్ రాజ్ పుత్ వంటి ఎంతోమంది సినీ ప్రముఖులు శివాజీ వ్యాఖ్యల్ని ఖండించారు. విమెన్ పవర్ పేరిట స్వప్నదత్ లాంటి కొంతమంది మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్‌కు ఫిర్యాదు చేశారు. శివాజీ ఈ వివాదంపై ఈ మధ్యనే మహిళా కమిషన్ ముందు హాజరై వివరణ ఇచ్చుకున్నారు. తనకు బాగా కావాల్సినవారే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు.అటు శ్రీముఖి.. ఇటు శివజ్యోతి.. అలానే కల్కి సినిమాలో కర్ణుడి పాత్రపై లిరిసిస్ట్ అనంత శ్రీరామ్ చేసిన కామెంట్స్ కాంట్ర వర్సీ అయ్యాయి. మన్మథుడు హీరోయిన్ అన్షుపై దర్శకుడు త్రినాథరావు నక్కిన చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. దీంతో ఆయన సారీ చెప్పారు. సంక్రాంతికి వస్తున్నాం సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో రామలక్ష్మణులపై యాంకర్ శ్రీముఖి చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. తీవ్ర వ్యతిరేకత రావడంతో శ్రీముఖి క్షమాపణలు కోరుతూ ఓ వీడియోని రిలీజ్ చేసింది. యాంకర్ శివజ్యోతి శ్రీవారి అన్నప్రసాదంపై చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమవ్వడంతో, సారీ చెబుతూ ఓ వీడియో విడుదల చేశారు. కాంట్రవర్సీ కావాల్రా నాయనా అంటూ నటి కల్పిక ఆ మధ్య ఓ పబ్‌లో రచ్చ చేసింది. సినీ నటి మాధవీ లత రీసెంట్ గా సాయి బాబాపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసి వివాదంలో చిక్కుకుంది.పుష్ప-2 తొక్కిసలాట కేసులో ఛార్జ్ షీట్ దాఖలు..గతేడాది పుష్ప-2 ప్రీమియర్ సందర్భంగా ఆర్టీసీ క్రాస్ రోడ్స్ సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనపై చిక్కడపల్లి పోలీసులు ఇటీవల ఛార్జ్ షీట్ దాఖలు చేశారు. ఈ ఘటనలో రేవతి అనే మహిళ మర ణించగా, ఆమె కుమారుడు శ్రీతేజ్ తీవ్రంగా గాయపడిన సంగతి తెల్సిందే. అయితే థియేటర్ యాజమాన్యం నిర్లక్ష్యంతోనే తొక్కిసలాట జరిగినట్లు పోలీసులు నిర్ధారించారు. మొత్తం 23 మందిపై అభియోగాలు నమోదు చేశారు. ఏ-1గా సంధ్య థియేటర్ మేనేజ్మెంట్, ఏ-11గా అల్లు అర్జున్ ను పేర్కొన్నారు.

## "కటాలన్" మాస్ అవతార్‌తో సెకండ్ షాకింగ్ లుక్

క్యూబ్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై షరీఫ్ మహమ్మద్ నిర్మించిన గ్రాండ్ యాక్షన్ థ్రిల్లర్ కట్టాలన్ సెకండ్ లుక్ పోస్టర్‌ను లాంచ్ చేశారు. ప్రేక్షకులను ఉత్రూతలూగించిన ఫస్ట్ లుక్ తర్వాత, రెండవ లుక్ మరింతగా ఆశ్చర్యపరిచేలా రూపొందించారు. ఏనుగుల వేట నుండి ప్రేరణ పొందిన ఉత్కంఠభరితమైన మాస్ యాక్షన్‌ను సూచిస్తూ, ఈ పోస్టర్ మలయాళ సినిమా చరిత్రలో మునుపెన్నడూ చూడని మాస్ అవతార్‌లో ఆంటోనీ వర్గీస్‌ను పరిచయం చేస్తుంది. సినిమా టైటిల్‌కు తగ్గట్టుగానే, ఆంటోనీ వర్గీస్‌ను ఫస్ట్ లుక్‌లోనూ, తాజాగా విడుదలైన సెకండ్ లుక్‌లోనూ పవర్ ఫుల్ లుక్‌లో చూపించారు. మలయాళ సినిమా చరిత్రలోనే బిగ్గెస్ట్ రిలీజ్ గా నిలవనున్న కటాలన్, మే 14, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ చిత్రానికి నూతన దర్శకుడు పాల్ జార్జ్ దర్శకత్వం వహించారు. షరీఫ్ మహమ్మద్ నిర్మించిన పాన్-ఇండియన్ బ్లాక్‌బస్టర్ యాక్షన్ థ్రిల్లర్ మార్కో తర్వాత క్యూబ్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ నుండి వస్తున్న మూవీ. మాస్ అప్పీల్, యాక్షన్ పరంగా ఈ సినిమా మార్కోను అధిగమించాలని లక్ష్యంగా పెట్టుకుందని పోస్టర్లు సూచిస్తున్నాయి. ఈ చిత్రం మొదటి టీజర్ జనవరి 16న విడుదల కానుంది. కటాలన్ ఇప్పటికే మలయాళ సినిమా చరిత్రలోనే అతిపెద్ద ఓవర్సీస్ డీల్స్‌లో దక్కించుకుందని, షూటింగ్ పూర్తి కాకముందే అనేక ప్రీ-రిలీజ్ రికార్డులను బద్దలు కొట్టింది. ఫార్స్ ఫిల్మ్స్‌తో కలిసి, కటాలన్ ఒక మలయాళ చిత్రానికి ఇప్పటివరకు ఎన్నడూ లేని అతిపెద్ద ఓవర్సీస్ రిలీజ్ కోసం సిద్ధమవుతోంది. యాక్షన్ సన్నివేశాలను థాయ్‌లాండ్‌లో, ఓంగ్-బాక్ సిరీస్‌తో సహా అంతర్జాతీయ యాక్షన్ థ్రిల్లర్లకు ప్రసిద్ధి చెందిన ప్రపంచ ప్రఖ్యాత యాక్షన్ డైరెక్టర్ కేచా ఖంఫక్డీ, అతని బృందం ఆధ్వర్యంలో చిత్రీకరించారు. ఓంగ్-బాక్ సిరీస్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన పాంగ్ అనే ఏనుగు కూడా ఈ సినిమాలో కనిపించనుంది.



## దాదాసాహెబ్ ఫాల్కే బయోపిక్ కి సర్వం సిద్ధం..



ఈ మధ్యకాలంలో సినిమా, రాజకీయ, క్రికెట్ రంగాలకు చెందిన ప్రముఖుల బయోపిక్స్ ను తెరపైకి తీసుకొస్తూ మనకు తెలియని ఎన్నో విషయాలను ఈ సినిమాల ద్వారా తెలియజేస్తున్న విషయం తెలిసిందే. ముఖ్యంగా చారిత్రక అంశాలను కూడా తెరపైకి తీసుకొస్తున్నారు. అయితే ఇప్పుడు ఏకంగా భారతీయ సినిమా పితామహుడైన దుండిరాజ్ గోవింద్ ఫాల్కే బయోపిక్ ను తెరపైకి తీసుకురాబోతున్నారు. భారతీయ సినీ నిర్మాత, దర్శకుడు, స్క్రీన్ ప్లే రచయితగా పేరు దక్కించుకున్న ఈయన దాదాసాహెబ్ ఫాల్కేగా ప్రసిద్ధి చెందారు. ముఖ్యంగా 1913లో తన మొదటి సినిమా తీసిన ఈయన.. తన జీవిత కాలంలో 95 ఫీచర్ ఫిలిమ్స్ నిర్మించి పేరు దక్కించుకున్నారు. ఇక ఈయన పేరు మీద గానే సినిమా ఇండస్ట్రీలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన అతి తక్కువ మందికి మాత్రమే దాదాసాహెబ్ ఫాల్కే అవార్డును అందిస్తూ వారికంటూ ఒక స్థానాన్ని అందిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పుడు ఈ నేపథ్యంలోనే బాలీవుడ్ లో ఈ దాదాసాహెబ్ ఫాల్కే జీవిత కథ ఆధారంగా బయోపిక్‌ను తెరకెక్కించడానికి సిద్ధం అయ్యారు. బాలీవుడ్ స్టార్ హీరో అమీర్ ఖాన్, రాజ్ కుమార్ హిరానీ. నిజానికి ఈ సినిమా స్క్రిప్ట్ ఎప్పుడో మొదలయ్యింది. కానీ కొన్ని కారణాలవల్ల స్క్రిప్ట్ ప్రక్రియ ఆగిపోవడంతో అభిమానులు కూడా కాస్త నిరాశ వ్యక్తం చేశారు. అయితే ఇప్పుడు తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం.. రాజ్ కుమార్ హిరానీ, అమీర్ ఖాన్‌ల సహకారం తిరిగి పట్టాలపైకి వచ్చినట్లు కనిపిస్తోంది. ముఖ్యంగా ఈ సినిమాకు సంబంధించిన స్క్రిప్ట్ పనులు తిరిగి ప్రారంభమైనట్లు సోషల్ మీడియాలో వార్తలు వెలువడుతున్నాయి. ముఖ్యంగా దాదాసాహెబ్ ఫాల్కే జీవితం గురించి చెబుతూనే సమకాలీనంగా ప్రేక్షకులకు అనిపించాలని అమీర్ ఖాన్ భావిస్తున్నారట. అందులో భాగంగానే ఇప్పటి నేటివిటీకి తగ్గట్టుగా సినిమాను రూపొందించాలని అమీర్ ఖాన్, రాజ్ కుమార్ హిరానీ భావిస్తున్నారు. ఇక అన్నీ అనుకున్నట్లు జరిగితే మార్చి నుండి ఈ సినిమా షూటింగ్ ప్రారంభమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా సున్నితమైన స్వభావాన్ని దృష్టిలో పెట్టుకొని చిత్ర బృందం చాలా జాగ్రత్తగా ముందుకు వెళుతున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా రాజ్ కుమార్ హిరానీ చివరిగా షారుక్ ఖాన్ తో ఢంకీ సినిమా చేశారు. అయితే ఈ సినిమాకి సోషల్ మీడియాలో వచ్చిన అభిప్రాయాలను ఆయన దృష్టిలో పెట్టుకొని.. ఇకపై సోషల్ మీడియాలో చర్చలకు ఛాన్స్ ఇవ్వకుండా ఈ సినిమాను తెరకెక్కించాలని భావిస్తున్నారట. మరొకవైపు అమీర్ ఖాన్ కూడా ఈ సినిమాపై ఎటువంటి విమర్శలకు చోటు ఇవ్వకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు సమాచారం.

# సూర్య సినిమా

## 50లోకూడా అంతే ఎనర్జీగా...!

వయసు ఒక నంబర్ మాత్రమేనని నిరూపించిన ఫిట్నెస్ ఫ్రీక్ మలైకా అరోరా. 52 వయసులోను ఎనర్జిటిక్ డ్యాన్సులు, ఫ్యాషన్ షోలతో దుమారం రేపుతోంది ఈ బ్యూటీ. వయసుతో సంబంధం లేకుండా ఎంతో ఆత్మవిశ్వాసంతో తనపై వస్తున్న ట్రోలింగ్‌కు ధీటైన సమాధానం ఇస్తుంటారు. ఇప్పుడు మరోసారి తనదైన గట్సీ ఆన్సర్‌తో మలైకా చర్చల్లోకొచ్చారు. 'ద నమ్రతా జకారియా షో'లో పాల్గొన్న మల్లా.. ఐటెం సాంగ్స్ (స్పెషల్ నంబర్స్) చేయడం తనను తాను శక్తివంతంగా మలుచుకునేలా చేస్తాయని తెలిపారు. మలైకా మాట్లాడుతూ.. నేను 52 ఏళ్ల వయస్సులో కూడా ఇవన్నీ చేయగలుగుతున్నానంటే, నేను ఏదో ఒక విషయంలో సరైన మార్గంలోనే ఉన్నానని అర్థం. దీని గురించి నేను క్షమాపణలు చెప్పాల్సిన అవసరం లేదు. ప్రజలు ఎన్నో రకాలుగా మాట్లాడుతుంటారు.. ట్రోల్ చేస్తుంటారు.. కానీ అందులో పెద్ద విషయం ఏముందో నాకు అర్థం కాదు అని అన్నారు. డ్యాన్స్ అనేది నా విషయంలో ఒక భావ వ్యక్తీకరణ అని మలైకా అన్నారు. ఐటెం సాంగ్స్ చేయడం వల్ల తనకు ఎంతో ధైర్యం, ఆత్మవిశ్వాసం లభిస్తాయని చెప్పారు. ఇతరులు తనను ఒక ఉదాహరణగా తీసుకుని, తమకు నచ్చిన పనిని చేస్తూ సంతోషంగా ఉంటే, తాను సాధించిన విజయం అదేనని తాను భావిస్తున్నట్టు తెలిపారు. ఛయ్య ఛయ్య మొదలు కెరీర్‌లో ఎన్నో చార్ట్‌బస్టర్ పాటల్లో నర్తించిన మలైకా అరోరా.. గత ఏడాది (2025) మలైకా రెండు భారీ హిట్‌లను త ్ న ఖాతా ల ో వే న ు క ు న్నారు. యో యో హనీ సింగ్ పాట 'చిల్గమ్' మరో విజయాన్ని అందించింది. ఆదిత్య సర్పోత్దార్ సినిమా 'థామ్మా' లోని 'పాయిజన్ బేబీ' తనకు మంచి మైలేజ్‌ని పెంచింది. ఛయ్య ఛయ్య మొదలు..మున్నీ బద్నామ్ హుయి..... అనార్కలీ డిస్కో చలీ... ఇలా ఎన్నో స్పెషల్ సాంగ్స్‌లో మలైకా దుమ్ము రేపారు. వయస్సు అనేది కేవలం ఒక సంఖ్య మాత్రమే.. ఆత్మవిశ్వా సం- శ్రమ ఉంటే ఏదైనా సాధించవచ్చని ఆమె నిరూపిస్తున్నారు. 50 ప్లస్ లోను లైవ్ వైర్ లా అదరగొట్టేయడం మలైకా స్టైల్.



## ట్రోల్స్ పై అనిల్ రావిపూడి

సంక్రాంతి రేసులో మెగాస్టార్ చిరంజీవి నటించిన మన శంకర వరప్రసాద్‌గారు బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లతో దూసుకుపోతోంది. అనిల్ రావిపూడి దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమాకు ఫ్యామిలీ ఆడియన్స్ నుంచి వస్తున్న రెస్పాన్స్ చూస్తుంటే, పండుగ విన్నర్‌గా నిలిచేలా కనిపిస్తోంది. ఈ సక్సెస్‌ని ఎంజాయ్ చేస్తున్న చిత్ర యూనిట్ తాజాగా నిర్వహించిన ప్రెస్ మీట్‌లో అనిల్ రావిపూడి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి. సాధారణంగా సినిమాల మీద సోషల్ మీడియాలో రకరకాల చర్చలు నడుస్తుంటాయి. మరీ ముఖ్యంగా అనిల్ రావిపూడి సినిమాలపై మీమ్స్, ట్రోల్స్ కొంచెం ఎక్కువగా కనిపిస్తుంటాయి. ఈ క్రమంలో గత 15 రోజులుగా తనపై జరుగుతున్న చర్చను అనిల్ చాలా పాజిటివ్ గా తీసుకున్నారు. కేవలం సినిమాలను హిట్ చేయడమే కాకుండా, తనపై వచ్చే విమర్శలను కూడా అంతే స్పోర్టివ్‌గా తీసుకోవడం ఈ దర్శకుడి ప్రత్యేకత అని మరోసారి నిరూపించుకున్నారు. ముఖ్యంగా సోషల్ మీడియాలో తన గురించి వస్తున్న ట్రోల్స్ పై అనిల్ నవ్వుతూనే స్పందించారు. గత 15 రోజులుగా యూట్యూబ్ లో, సోషల్ మీడియాలో జరిగిన విధ్వంసం మామూలు విషయం కాదు.. దొరుకుతాడా? దొరకడా? అని చాలా రకాలుగా మాట్లాడుకున్నారు అని ఆయన గుర్తు చేసుకున్నారు. ఆ ట్రోల్స్ అన్నింటికీ బాక్సాఫీస్ రిజల్ట్ తోనే సమాధానం దొరికిందన్నట్లుగా ఆయన తన మాటల్లో వ్యక్తపరిచారు. సోషల్ మీడియాలో దొరుకుతాడా దొరకడా అన్నారు.. గట్టిగా దొరికేసా.. ఎవరికి దొరికాను? ప్రేక్షకులకు దొరికాను అంటూ అనిల్ తనదైన శైలిలో స్వీట్ కౌంటర్ ఇచ్చారు. ప్రేక్షకులు టికెట్ కొని థియేటర్లకు వచ్చి ఈ సినిమాలో చిరంజీవి గారిని చూసి సెలబ్రేట్ చేసుకోవడం చూస్తుంటే తన మీద వచ్చే ట్రోల్స్ అన్నీ మర్చిపోతానని ఆయన వెల్లడించారు.



PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081, TELANGANA, PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR,NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044.